70 ఏండ్లు పైబడిన వారికీ 'ఆయుష్మాన్'
ఆదాయంతో సంబంధం లేకుండా అందరికీ వర్తింపు
పీఎం గ్రామ్ సడక్ నాలుగో విడతకు క్యాబినెట్ ఆమోదం ›11



# నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం మన పత్రిక

NAMASTE TELANGANA



మండలి ప్రతిపక్ష నేతగా సిరికొండ
గెజిట్ విడుదల చేసిన శాసనసభ కార్యదర్శి ›5

గురువారం THURSDAY 12.9.2024 | హైదరాబాద్ HYDERABAD | పేజీలు: 12+4 Pages: 12+4 | సంపుటి (Volume): 14 ‖ సంచిక (Issue): 98 ‖ వెల (Price) రూ.6.50 | నవమి

గురువారం, సూర్యోదయం: 6-04, సూర్యాస్తమయం: 6-20. శ్రీ క్రోధి నామ సంవత్సరం దక్షిణాయనం వర్ష రుతువు భాద్రపద మాసం శుక్ల పక్షం తిథి: నవమి రాత్రి 11-32 వరకు. నక్షత్రం: మూల రాత్రి 9-53 వరకు. వర్జ్యం: రాత్రి 8-15 నుంచి రాత్రి 9-53 వరకు. రాహుకాలం: పగలు 1-43 నుంచి పగలు 3-15 వరకు. దుర్ముహూర్తం: ఉదయం 10-09 నుంచి ఉదయం 10-58 వరకు, పునర్ దుర్ముహూర్తం: పగలు 3-03 నుంచి పగలు 3-52 వరకు. అమృతకాలం: పగలు 3-20 నుంచి సాయంత్రం 4-58 వరకు.

PUBLISHED FROM HYDERABAD • KARIMNAGAR • WARANGAL • KHAMMAM • NALGONDA • MAHABUBNAGAR • NIZAMABAD
www.ntnews.com /ntdailyonline


## కోర్టుకెళ్లినా వదలం కూల్చేసుడే

- ఆక్రమణదారులెవరైనా హైడ్రా వదలిపెట్టదు
- స్వచ్ఛందంగా ఆక్రమణలను విడిచిపెట్టి వెళ్లండి
- మూసీ పరీవాహక బాధితులకు డబుల్‌బెడ్రూం
- 27 రోజుల్లో రూ.18 వేల కోట్ల రుణమాఫీ
- ఎస్సైల దీక్షాంత్ పరేడ్‌లో సీఎం రేవంత్‌రెడ్డి

రూపాయి రూపాయి జమ చేసుకుని అమాయకులు ఇండ్లు కట్టుకుంటే.. పెద్ద పెద్ద జేసీబీలు తీసుకొని వెళ్లి ఉన్నపళంగా నేలమట్టం చేయాల్సిన అవసరం ఉన్నదా? వాళ్లేమైనా దేశద్రోహం చేసింర్రా? అక్రమమైతే చట్టపరంగా క్రమబద్ధీకరించాలి.
*- ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఓ టీవీ ఇంటర్వ్యూలో రేవంత్‌రెడ్డి*



హైదరాబాద్, సెప్టెంబర్ 11 (నమస్తే తెలంగాణ): చెరువులు, కాల్వలను కబ్జా చేసిన ఆక్రమణదారులు ఎవరైనా సరే హైడ్రా వదలి పెట్టదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పారు. చెరువులను చెరబట్టిన వారు ఎంతటి వారైనా జైలుకు పంపేందుకు కూడా వెనకాడబోమని పేర్కొన్నారు. ఆక్రమణదారులు కోర్టులకు వెళ్లినా, కోర్టు ఆర్డర్లను వెకేట్ చేయించి, అక్రమ నిర్మాణాలను కూల్చి తీరుతామని స్పష్టంచేశారు. బుధవారం తెలంగాణ పోలీసు అకాడమీలో 3వ బ్యాచ్ ఎస్సైల దీక్షాంత్ పరేడ్‌కు ముఖ్య అతిథిగా హాజరైన సీఎం రేవంత్‌రెడ్డి ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ కార్యక్రమంలో సీఎం మాట్లాడుతూ.. ఆక్రమించుకున్న చెరువులను స్వచ్ఛందంగా వదలాలని, గౌరవంగా పక్కకు తప్పుకోవాలని ఆక్రమణదారులకు విజ్ఞప్తి ›3వ పేజీలో

## హైడ్రా అనుమతిస్తేనే ఇంటి నిర్మాణం!

- ఎన్‌వోసీ తప్పనిసరి చేస్తూ సర్కారు మెలిక?
- 'టౌన్‌ప్లానింగ్' నిర్వీర్యం దిశగా అడుగులు ›3

• ఈ పాప చేసిన పాపమేమి?



హైడ్రా కూల్చివేతలతో గూడు చెదిరిన సున్నంచెరువు బాధితులు.. శిథిలాల మధ్య ముక్కలైన బతుకుని వెతుక్కుంటున్నారు. ఇండ్లు నేలమట్టమై రోడ్డునపడిన కుటుంబాలు తాత్కాలికంగా వేసుకున్న టార్పాలిన్ల కింద తలదాచుకుంటున్నాయి. తానేం పాపం చేశానంటూ అమాయకపు చూపులతోనే ఈ పాప ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నట్టుంది కదూ.
(ఫొటో: ఎం గోపీకృష్ణ)

# కలికి మేడ భద్రం.. పేద బతుకు ఛిద్రం

## 'హైడ్రా'మాలో సామాన్యులే సమిధలు!

- 23 రోజుల్లో 262 చోట్ల కూల్చివేతలు
- ఒకట్రెండు చోట్ల తప్ప పేదలపైనే ప్రతాపం
- కూల్చినచోట వ్యర్థాలు తొలగించకుండానే భూమి స్వాధీనం చేసుకున్నట్టు ప్రకటన
- సీఎం, కమిషనర్ ప్రకటనలతో గందరగోళం

**ఎన్‌హెచ్‌ఆర్సీకి సున్నం చెరువు బాధితులు**

హైదరాబాద్ సిటీబ్యూరో, సెప్టెంబరు 11 (నమస్తే తెలంగాణ ): విపత్తు నిర్వహణ, ప్రభుత్వ ఆస్తుల రక్షణ కోసం ఏర్పాటైన హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అస్సెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) పనితీరు రోజురోజుకూ వివాదాస్పదమవుతున్నది. పెద్దలు, పేదలు అనే తేడా లేకుండా ఆక్రమిత స్థలాల్లో ఉంటున్న వారిపై కఠినంగా వ్యవహరించాల్సిన హైడ్రా.. ఆచరణలో ఇందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నదనే ›3వ పేజీలో

## చెరువుల మ్యాపులు తవ్వుతున్న రంగనాథ్



- రేపటి కూల్చివేతలకు నేడు రంగం సిద్ధం
- శాటిలైట్ చిత్రాల కోసం ఎన్‌ఆర్‌ఎస్‌సీకి..

**విల్లాల కూల్చివేతలు ఆపండి**

›5 దుండిగల్ కూల్చివేతలపై హైకోర్టు ఆదేశాలు

## రియల్ ఎస్టేట్ సర్వనాశనం

**ఇది రేవంత్ సర్కార్ పాపం**

- హైడ్రా పేరిట ముఖ్యమంత్రి డ్రామాలు
- యూట్యూబ్‌ను చూస్తే సీఎంకు వణుకు
- 800 కోట్ల ఉపాధి నిధుల దారి మళ్లింపు
- పది నెలలుగా గ్రామాలకు పైసా లేదు
- కార్యదర్శులు అప్పుల పాలవుతున్నరు
- రైతు సురేందర్‌రెడ్డిది ప్రభుత్వ హత్యే
- వందశాతం రుణమాఫీకోసం పోరాటం
- సర్కారుపై మాజీ మంత్రి హరీశ్ ఫైర్



హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌కు శాపం

రాష్ట్రంలో నడుస్తున్నది ప్రజాపాలన కాదు. కేసీఆర్ హయాంలో విశ్వనగరంగా ఖ్యాతికెక్కిన హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్.. కాంగ్రెస్ పాలనలో పూర్తిగా దెబ్బతిన్నది. రియల్‌ఎస్టేట్ రంగం సర్వనాశనమైంది.
*-మీడియాతో మాజీ మంత్రి హరీశ్*



సిద్దిపేట, సెప్టెంబర్ 11( నమస్తే తెలంగాణ ప్రతినిధి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీరుతో రాష్ట్రమంతటా రియల్ ఎస్టేట్ వ్యాపారం సర్వనాశనమైందని, హైదరాబాద్ బ్రాండ్ ఇమేజీని రేవంత్‌రెడ్డి దెబ్బ తీశారని మాజీ మంత్రి హరీశ్‌రావు మండిపడ్డారు. మండలాల్లో రిజిస్ట్రేషన్లు పూర్తిగా తగ్గిపోయాయని, గతంలో రోజుకు 30 రిజిస్ట్రేషన్లు అయితే ఇప్పుడు నెలకు 30 కూడా కావడం లేదని చెప్పారు. ఈ ప్రభుత్వం పట్టణాలు, గ్రామాలను గాలికి వదిలేసి ›3వ పేజీలో

## వేములవాడలో 'హైడ్రా' గుబులు?

- మూలవాగు పరీవాహకంలో అధికారుల సర్వే
- హైడ్రా తరహా కూల్చివేతలపై ప్రజల్లో టెన్షన్ ›3

# అసైన్డ్ భూమి ఔట్!

## 190 ఎకరాల పేదల భూములకు రెక్కలు



- నిబంధనలకు విరుద్ధంగా జోరుగా కొనుగోళ్లు
- ఖానాపూర్ భూముల్లో వాలిన కార్పొరేట్ కంపెనీ
- ఎకరా భూమికి రూ.15-50 లక్షల వరకు చెల్లింపు
- అధికారుల కనుసన్నల్లోనే కొనసాగుతున్న దందా
- చెక్కుల రూపంలో చెల్లిస్తున్న ఆరాధ్య హోలిస్టిక్
- రెవెన్యూ రికార్డులన్నీ మార్చేందుకు భారీ స్కెచ్

**సిటీ.. ఫ్యూచర్?**

హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, సెప్టెంబర్ 11 (నమస్తే తెలంగాణ)/ఇబ్రహీంపట్నం: భూమిలేని నిరుపేదలకు గతంలో సర్కారు ఇచ్చిన భూములకు రెక్కలొచ్చాయి. సాగు చేసుకొని జీవనం సాగిస్తారని సదుద్దేశంతో ప్రభుత్వం ఇచ్చిన భూములు ఇప్పుడు కార్పొరేట్ కంపెనీల ధనదాహానికి అడ్డాగా మారాయి. నిబంధనలు అనుమతించకున్నా.. గుట్టుచప్పుడు కాకుండా పేదోళ్ల భూములు పెద్దోళ్లపరం అవుతున్నాయి. ఒకటీ రెండు కాదు.. ఏకంగా 190 ఎకరాల లావణి పట్టా భూముల్ని చేజిక్కించుకొని పట్టా భూమిగా మార్చేందుకు రంగం సిద్ధమైంది. బహిరంగ ›3వ పేజీలో




## ఎమార్ రీఎంట్రీ!


- గత కాంగ్రెస్ సర్కార్‌లో వేల కోట్ల కుంభకోణం ఆరోపణలు
- అదే దుబాయ్ కంపెనీని మళ్లీ ఆహ్వానిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం
- 2 వేల ఎకరాల డెవలప్‌మెంట్ ఒప్పందానికి సిద్ధం?
- రాష్ట్రానికి వచ్చేందుకు సుముఖత వ్యక్తంచేసిన ఎమార్ ప్రాపర్టీస్
- బౌల్డర్ హిల్స్ కేసు అనుకూలంగా పరిష్కరించాలని షరతు?
- ప్రాజెక్టు మీద ప్రత్యేక శ్రద్ధపై వెల్లువెత్తుతున్న అనుమానాలు ›6



## ఆ పది స్థానాల్లో ఉపఎన్నికలు తథ్యం!

- హైకోర్టు తీర్పుతో ఫిరాయింపు ఎమ్మెల్యేల్లో వణుకు
- మంత్రి శ్రీధర్‌బాబు న్యాయస్థానం తీర్పును వక్రీకరిస్తున్నారు
- దానం శాశ్వతంగా మాజీ ఎమ్మెల్యేగా ఉండిపోవాల్సిందే
- మిగిలిన ఏడుగురిపై కూడా అనర్హత వేటు పడుతుంది
- బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు పాడి కౌశిక్‌రెడ్డి, కేపీ వివేకానంద
- హైకోర్టు తీర్పు కాపీ అసెంబ్లీ కార్యదర్శికి అందజేత ›6

• పంటనష్టం పరిహారమెప్పుడు?



వర్షాలతో నష్టపోయిన పంటలకు ప్రభుత్వ పరిహారం ఇంకెప్పుడిస్తారంటూ తాసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించిన కామారెడ్డి జిల్లా పెద్దకొడప్‌గల్ రైతులు

## రుణమాఫీ కాలేదని ఆత్మహత్యాయత్నం

- 20 రోజులక్రితం పురుగుమందు తాగిన జగిత్యాల రైతు సాగర్‌రెడ్డి
- పరిష్కారం చూపని అధికారులు.. మరోసారి సూసైడ్‌కు యత్నం
- అప్పుల బాధతో సిద్దిపేట జిల్లాలో కౌలురైతు బలవన్మరణం ›7






## 'వాల్మీకి' నిధులు కాంగ్రెస్ ప్రచారానికి!

- కర్ణాటక స్కాంలో దారిమళ్లిన సొమ్ము హైదరాబాద్‌కు
- తెలంగాణలో లోక్‌సభ ఎన్నికలకు మద్యం కొనుగోళ్లు
- ఈడీ చార్జ్‌షీట్‌లో వెలుగులోకి వచ్చిన కీలక విషయాలు
- మాజీ మంత్రి నాగేంద్ర పీఏ విజయ్ ఫోన్‌లో ఆధారాలు ›11
- మేం మొదటినుంచీ చెప్తున్నదే నిజమని తేలింది: కేటీఆర్



## అప్పులపై శ్వేతపత్రం విడుదల చేయాలి

బీఆర్ఎస్ నేత వాసుదేవరెడ్డి

హైదరాబాద్, సెప్టెంబర్ 11 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 9 నెలల్లోనే రూ.75 వేల కోట్ల అప్పు తెచ్చారని బీఆర్ఎస్ నేత కే వాసుదేవరెడ్డి ఆరోపించారు. ఈ అప్పులపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బుధవారం హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. కేసీఆర్ ప్రభుత్వం అప్పులు తెచ్చి ఆస్తులు పెంచిందని చెప్పారు. ఉద్యోగులకు పీఆర్సీ, డీఏ ఇవ్వకుండా ఎవరి కోసం అప్పులు చేశారని ప్రశ్నించారు. తొమ్మిదిన్నరేండ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పు రూ.4,26,499 కోట్లు అని మాత్రమే అని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం ఉదయ్ స్కీమ్ తీసుకొచ్చి డిస్కమ్ అప్పులను రాష్ట్ర ప్రభుత్వం టేకోవర్ చేయాలని చట్టం చేయడంతో రూ.41,159 కోట్లు చేర్చుకుని.. మొత్తం రు.3,85,340 కోట్లు అప్పులు అయ్యాయని వివరించారు. అప్పులపై ఆర్బీఐ విడుదల చేసిన నివేదికలో తెలంగాణ కింది నుంచి ఆరో స్థానంలో ఉందని చెప్పారు.

## నాటుసారాపై 'ఎక్సైజ్' దాడులు

హైదరాబాద్, సెప్టెంబర్ 11(నమస్తే తెలంగాణ): రాష్ట్రవ్యాప్తంగా నాటు సారా, డ్రగ్స్, గంజాయిపై దాడులు కొనసాగిస్తున్నట్టు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వీబీ కమలాసన్‌రెడ్డి బుధవారం తెలిపారు. ఖమ్మం జిల్లాలో 52 లీటర్ల సారా స్వాధీనం చేసుకొని ఏడుగురిపై కేసు నమోదు చేశారని, ఎన్టీఆర్ సర్కిల్లో కేజీ గంజాయిని డీటీఎఫ్ టీం స్వాధీనం చేసుకున్నట్టు వెల్లడించారు. మహబూబ్‌నగర్ జిల్లా గూడూరు సలార్‌తండాలో 43 లీటర్ల లిక్కర్, 500 కేజీల బెల్లం, 19 కేజీల పటిక, భూపాలపల్లి జిల్లాలో 10 కేజీల బెల్లం, 400 లీటర్ల పానకం, 22 లీటర్ల సారా స్వాధీనం, ఐదుగురు అరెస్ట్, కరీంనగర్ జిల్లాలో 22 లీటర్ల సారా, 300 లీటర్ల బెల్లం పానకాన్ని స్వాధీనం చేసుకున్నట్టు పేర్కొన్నారు.

# ఆ పది స్థానాల్లో ఉపఎన్నికలు తథ్యం!

- ఫిరాయింపు ఎమ్మెల్యేల్లో వణుకు మొదలు
- హైకోర్టు తీర్పుపై వెంటనే చర్యలు చేపట్టాలి
- మంత్రి శ్రీధర్‌బాబు తీర్పును వక్రీకరిస్తున్నారు
- దానం శాశ్వతంగా మాజీ ఎమ్మెల్యేగా ఉంటాడు
- స్టేషన్‌ఘన్‌పూర్‌లో కడియం డిపాజిట్ తెచ్చుకోవాలి
- మిగిలిన ఏడుగురిపై కూడా అనర్హత వేటు పడుతుంది
- బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పాడి కౌశిక్‌రెడ్డి, కేపీ వివేకానంద
- హైకోర్టు తీర్పు కాపీ అసెంబ్లీ కార్యదర్శికి అందజేత



తెలంగాణ భవన్‌లో విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యేలు పాడి కౌశిక్‌రెడ్డి, కేపీ వివేకానంద

హైదరాబాద్, సెప్టెంబర్ 11 (నమస్తే తెలంగాణ): పార్టీ ఫిరాయింపునకు పాల్పడి కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేల నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలు ఖాయమని ఆ పార్టీ ఎమ్మెల్యేలు పాడి కౌశిక్‌రెడ్డి, కేపీ వివేకానంద చెప్పారు. ఆ పది స్థానాల్లో మళ్లీ బీఆర్ఎస్ అభ్యర్థులు ఘన విజయం సాధిస్తారని ధీమా వ్యక్తంచేశారు. ఫిరాయింపునకు పాల్పడిన ఎమ్మెల్యేల అనర్హతపై నిర్ణయం తీసుకోవాలని హైకోర్టు ఇచ్చిన తీర్పు కాపీని వారు బుధవారం అసెంబ్లీ కార్యదర్శి నర్సింహాచార్యులకు అందించారు. అనంతరం వారిద్దరూ తెలంగాణ భవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ.. శాసనసభా వ్యవహారాలశాఖ మంత్రి డీ శ్రీధర్‌బాబు హైకోర్టు తీర్పును వక్రీకరిస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలు ఉప ఎన్నికలు వస్తాయన్న భయంతో గజగజ వణుకుతున్నారని కౌశిక్‌రెడ్డి చెప్పారు. పూటకో పార్టీ మారే దానం నాగేందర్ శాశ్వతంగా మాజీ ఎమ్మెల్యేగా మిగిలిపోతాడని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కడియం శ్రీహరి పచ్చి మోసగాడని, పొద్దున కేసీఆర్ దగ్గర ఎన్నికల ఖర్చుకు డబ్బు తీసుకుని వెళ్లి సాయంత్రం కాంగ్రెస్ పార్టీలో చేరాడని ఆరోపించారు. ఉప ఎన్నికల్లో కడియం శ్రీహరి స్టేషన్ ఘన్‌పూర్‌లో డిపాజిట్ తెచ్చుకోవాలని సవాల్ విసిరారు. అరికెపూడి గాంధీ కాంగ్రెస్ కండువా కప్పుకోలేదంటూ మాట మారుస్తున్నారని దుయ్యబట్టారు. ఫిరాయింపునకు పాల్పడిన ఎమ్మెల్యేలందరూ స్పీకర్ నిర్ణయం కోసం ఆగకుండా తమ పదవులకు రాజీనామాచేసి ఉప ఎన్నికలు ఎదుర్కోవాలని సవాల్ చేశారు. తమ పార్టీ అధినేత కేసీఆర్ గత పదేండ్లలో సింగిల్‌గా ఏ ఒక్క కాంగ్రెస్ ఎమ్మెల్యేకు కండువా కప్పలేదని, అలా చేర్చుకున్నట్టు నిరూపిస్తే తాను ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని కౌశిక్‌రెడ్డి సవాల్ విసిరారు. కేసీఆర్ హయాంలో సీఎల్పీని బీఆర్ఎస్ఎల్పీలో విలీనం చేశారని గుర్తుచేశారు. అరికెపూడి గాంధీ బీఆర్ఎస్ సభ్యుడైతే తెలంగాణ భవన్‌కు రావాలని సూచించారు.

### ఆ ఏడుగురు పై పిటిషన్ పెండింగ్‌లో ఉంది: వివేకానంద

కాంగ్రెస్‌లోకి ఫిరాయించిన మరో ఏడుగురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని కోరుతూ తాము ఇచ్చిన పిటిషన్ స్పీకర్ కార్యాలయంలో పెండింగ్‌లో ఉన్నదని ఎమ్మెల్యే కేపీ వివేకానంద చెప్పారు. పార్టీ మారిన ఎమ్మెల్యేల అనర్హత విషయంలో కాలయాపన చేయొద్దని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందని గుర్తుచేశారు. పీఏసీ చైర్మన్ విషయంలో ఏ నిబంధనలు పాటించారో శ్రీధర్‌బాబు చెప్పాలని డిమాండ్ చేశారు. పీఏసీకి 14 మంది నామినేషన్ వేస్తే ఎన్నికలు నిర్వహించకుండా.. అరికెపూడి గాంధీతో దొంగచాటుగా నామినేషన్ వేయించి ఎంపిక చేశారని విమర్శించారు. కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను సీఎం రేవంత్‌రెడ్డి మోసం చేశారని, తడిబట్టతో వారి గొంతు కోశారని విమర్శించారు. ఆ పది మంది భవిష్యత్తుకు రాజకీయ సమాధి కట్టారని వ్యాఖ్యానించారు. హైకోర్టు తీర్పు తర్వాత ఆ ఎమ్మెల్యేలు ఆగమాగం అవుతున్నారని చెప్పారు. హైకోర్టు తీర్పుపై కాలయాపన చేయకుండా చర్యలు ప్రారంభించాలని అసెంబ్లీ సెక్రటరీకి వినతిపత్రం ఇచ్చామని వారు తెలిపారు.

# గాలిలో దీపంలా విద్యా వ్యవస్థ

- తక్షణమే సమీక్ష నిర్వహించాలి
- ప్రభుత్వం గ్రాంట్లు విడుదల చేయకపోవడం సిగ్గుచేటు
- దరఖాస్తుల సొమ్ముతో రుణమాఫీ చేస్తరా?
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజం



హైదరాబాద్, సెప్టెంబర్ 11 (నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ పాలనలో విద్యా వ్యవస్థ గాలిలో దీపంలా మారిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. తక్షణమే విద్యాశాఖపై ఉన్నతస్థాయి సమీక్షి నిర్వహించి సమస్యలు పరిష్కరించాలని ఎక్స్ వేదికగా బుధవారం డిమాండ్ చేశారు. విద్యా సంవత్సరం ప్రారంభమై నెలలు గడుస్తున్నా ప్రభుత్వం గ్రాంట్లు విడుదల చేయకపోవటం సిగ్గుచేటని విమర్శించారు. సీఎం సొంత నియోజకవర్గంలోనే టీచర్లు లేక విద్యార్థులు టీసీలు తీసుకొని పోతున్నారని ఉదహరించారు. రుణమాఫీ కాని రైతులపై దరఖాస్తుల పేరుతో దోపిడీ మొదలైందని పేర్కొన్నారు. రైతుల నుంచి వసూలు చేసిన సొమ్ముతో రుణమాఫీ అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తున్నదా? అని ప్రశ్నించారు.

### సీఎం బ్రేక్ ఫాస్ట్ స్కీమ్ ఊపిరి తీశారు

బీఆర్ఎస్ హయాంలో అమలైన 'సీఎం బ్రేక్ ఫాస్ స్కీమ్'ను అర్ధాంతరంగా ఆపడం దుర్మార్గమని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. పథకంపై కేంద్రాన్ని దేబిరించటం హాస్యాస్పదంగా ఉన్నదని ఎద్దేవాచేశారు. ఈ పథకం ఊపిరి తీసి ప్రభుత్వం లక్షలాది మంది విద్యార్థుల పొట్టగొట్టిందని మండిపడ్డారు. ప్రభుత్వ దవాఖానలు రోగులతో కిక్కిరిసిపోవడం దిగజారిన ప్రజారోగ్య వ్యవస్థకు, ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని కేటీఆర్ విమర్శించారు. డాక్టర్ల కొరత, మందుల లేమితో కొట్టుమిట్టాడుతున్న దవాఖానల్లో పరిస్థితులను చక్కదిద్దాలని చెప్పారు. సుడిగాలి (టోర్నడో) బీభత్సానికి ములుగు జిల్లా మేడారం-తాడ్వాయి అటవీ ప్రాంతంలో సుమారు 200 హెక్టార్ల మేర లక్షకు పైగా చెట్లు నేలకూలడం అత్యంత బాధాకరమని కేటీఆర్ పేర్కొన్నారు. నష్టపోయిన గిరిజనులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

# మరణంలోనూ వీడని బంధం

*వృద్ధురాలైన భార్య మరణవార్త విని ప్రాణాలు విడిచిన భర్త*





నందమూరి హనుమయ్య, సుందరమ్మ


*బోనకల్లు, సెప్టెంబర్ 11: జీవిత చరమాంకంలోనూ ఓ వృద్ధ దంపతులు ఒకరినొకరు విడిచి ఉండలేకపోయారు. మరణంలోనూ వారి బంధం వీడలేదు. ఖమ్మం జిల్లా బోనకల్లు మండలంలో ఈ విషాదకర ఘటన బుధవారం చోటుచేసుకున్నది. బోనకల్లు మండల కేంద్రానికి చెందిన నందమూరి సుందరమ్మ(84) అనారోగ్యానికి గురై దవాఖానలో చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందింది. కుటుంబసభ్యులు ఆమె భౌతికకాయాన్ని ఇంటికి తీసుకురాగా, సహధర్మచారిణి మరణించిందన్న విషయం తెలుసుకున్న ఆమె భర్త నందమూరి హనుమయ్య(90) ఒక్కసారిగా దిగ్భ్రాంతికి గురయ్యాడు. కాసేపటికే ప్రాణాలు విడిచాడు. దీంతో ఆ కుటుంబంలో మరింత విషాదం నెలకొన్నది.*

# పడిపోయిన పంటల సాగు

హైదరాబాద్, సెప్టెంబర్ 11(నమస్తే తెలంగాణ) : గత సీజన్‌తో పోల్చితే ఈ వానకాలంలో పంటల సాగు 5 లక్షల ఎకరాల వరకు తగ్గినట్టు వ్యవసాయ శాఖ తెలిపింది. నిరుడు ఇదే సమయానికి 1.28 కోట్ల ఎకరాల్లో సాగు కాగా, ప్రస్తుతం 1.23 కోట్ల ఎకరాలకే పరిమితమైంది. అత్యధికంగా వరి 2.62 లక్షల ఎకరాల్లో తగ్గగా, పత్తి 1.23 లక్షల ఎకరాలకు పడిపోయింది. 43 వేల ఎకరాల్లో సోయాబీన్, 30వేల ఎకరాల్లో మొక్కజొన్న సాగు తగ్గింది. గతేడాది 6.23 లక్షల ఎకరాల్లో వరి నాట్లు పడగా, ప్రస్తుతం 5.97 లక్షల ఎకరాల్లోనే సాగైంది. పత్తి గతంలో 4.45 లక్షల ఎకరాల్లో సాగు కాగా, ప్రస్తుతం 4.32 లక్షల ఎకరాల్లో వేశారు. ఈ ఏడాది వ్యవసాయ శాఖ 1.29 కోట్ల ఎకరాల్లో పంటలు సాగవుతాయని లక్ష్యం పెట్టుకోగా, ఇప్పటి వరకు 1.23 కోట్ల ఎకరాలకే పరిమితమైంది.

# రాష్ట్రంలోకి ఎమార్ రీఎంట్రీ?

- ఫోర్త్ సిటీలో ప్రాజెక్టు అప్పగింత
- 2 వేల ఎకరాల్లో అభివృద్ధిపై ఒప్పందం?
- ఆ సంస్థపై అవినీతి ఆరోపణలు
- హైకోర్టులో కేసు..సీబీఐ దర్యాప్తు
- కేసు ఎత్తివేయాలని సంస్థ షరతు
- అవినీతి ఎమార్‌కు ఆహ్వానంపై వెల్లువెత్తుతున్న విమర్శలు





హైదరాబాద్, సెప్టెంబర్ 11 (నమస్తే తెలంగాణ): ఉమ్మడి ఏపీలో నాటి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో భారీ కుంభకోణానికి పాల్పడినట్టు ఆరోపణలు ఎదుర్కొన్న దుబాయ్ రియల్ ఎస్టేట్ కంపెనీ ఎమార్ ప్రాపర్టీస్‌ను రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మళ్లీ రాష్ట్రానికి ఆహ్వానించినట్టు తెలుస్తున్నది. ఈ మేరకు సోషల్ మీడియాలో వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. ప్రభుత్వం ముచ్చర్లలో నిర్మించబోయే ఫ్యూచర్ సిటీలో భాగస్వామ్యం కావాల్సిందిగా సదరు కంపెనీని ప్రభుత్వం కోరినట్టు విశ్వసనీయంగా తెలిసింది. ముచ్చర్లలో 2 వేల ఎకరాల భూమిని అభివృద్ధి చేసేందుకు ఎమార్ సంస్థతో ఒప్పందం చేసుకునేందుకు రంగం సిద్ధం చేసినట్టు సమాచారం. అయితే రాష్ట్రానికి వచ్చేందుకు ఎమార్ ప్రాపర్టీస్ సంస్థ ఒక షరతు విధించినట్టు తెలిసింది. ఉమ్మడి రాష్ట్రంలో తమ సంస్థ హైదరాబాద్‌లో చేపట్టిన 'బౌల్డర్ హిల్స్ ప్రాజెక్టు'పై నమోదైన కేసులను పరిష్కరించాలని కోరినట్టు సమాచారం.

### బౌల్డర్ హిల్స్ కుంభకోణం ఇదీ

హైదరాబాద్, గచ్చిబౌలిలో బౌల్డర్ హిల్స్ పేరుతో నివాస సముదాయాలు, గోల్ఫ్ కోర్స్ ఏర్పాటుకు సంబంధించి ఎమార్-ఎంజేఫ్ కంపెనీ భారీ కుంభకోణానికి పాల్పడినట్టు ఉమ్మడి రాష్ట్రంలో ఆరోపణలు వెల్లువెత్తాయి. దీనిపై హైకోర్టులో కేసు దాఖలు కాగా దర్యాప్తును కోర్టు సీబీఐకి అప్పగించింది. ఆ కేసు ఇప్పటికీ కొనసాగుతూనే ఉంది. చంద్రబాబు సీఎంగా ఉండగా 2003లో గచ్చిబౌలిలో 535 ఎకరాల్లో బౌల్డర్ హిల్స్ ప్రాజెక్టు కోసం ప్రభుత్వం, ఎమార్ మధ్య ఒప్పందం జరిగింది. అయితే ఆ ఒప్పందంలో అనేక లొసుగులున్నట్టు వెల్లువెత్తాయి. ఆ తర్వాత వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఈ ప్రాజెక్టును కొనసాగించింది. తెలుగుదేశం ప్రభుత్వం ఇచ్చిన రాయితీలు, ఇతర వెసులుబాట్లకు తోడు మరిన్ని ప్రోత్సాహకాలను కట్టబెట్టింది. బాబు ప్రభుత్వం ఎమార్ సంస్థకు తక్కువ ధరకే భూమిని కేటాయించగా.. కాంగ్రెస్ ప్రభుత్వం ఆ ప్రాజెక్టులో ఏపీఐఐసీ వాటాను 26 శాతం నుంచి 4 శాతానికి తగ్గించింది. తద్వారా ప్రభుత్వానికి అప్పట్లోనే రూ.5వేల కోట్ల నష్టం వాటిల్లినట్టు అంచనా. ఇక భూసేకరణలో కూడా అనేక అవకతవకలు జరిగినట్టు పలు సంస్థలో దర్యాప్తులో తేలింది. ఆ ప్రాజెక్టులో కొందరు కాంగ్రెస్ పెద్దలు బినామీల పేరుతో అక్రమంగా విల్లాలు దక్కించుకున్నట్టు ఆరోపణలు ఉన్నాయి.

### అలాంటి కంపెనీపై అంత ఆసక్తి ఎందుకో?

అవినీతి ఆరోపణలున్న ఎమార్ కంపెనీని మళ్లీ తెలంగాణకు తీసుకొచ్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుండటంపై సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వేల కోట్లు దోచుకుందనే ఆరోపణలున్న కంపెనీని ఏ విధంగా తీసుకొస్తారని నెటిజన్లు ప్రశ్నిస్తున్నారు. నాడు కాంగ్రెస్ ప్రభుత్వంలోనే కంపెనీపై అవినీతి ఆరోపణలు వచ్చాయని, ఇప్పుడు మళ్లీ ఆ కంపెనీని అదే ప్రభుత్వం వెనకేసుకురావడంపై అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో మరోసారి స్కాంగ్రెస్‌ను చూడబోతున్నామా అంటూ పోస్టులు వెల్లువెత్తుతున్నాయి. దీని వెనక ఎవరున్నారు, ఎవరికి అంత ఆసక్తి ఉందో వెల్లడించాలనే డిమాండ్లు వినిపిస్తున్నాయి.





కార్యవర్గ సమావేశంలో మాట్లాడుతున్న టీఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్

# ఈ కుబేర్‌ను రద్దుచేయాలి

- ట్రెజరీ ద్వారానే బిల్లులు చెల్లించాలి
- టీఎన్జీవో రాష్ట్ర కార్యవర్గం డిమాండ్

హైదరాబాద్, సెప్టెంబర్ 11 (నమస్తే తెలంగాణ): ఉద్యోగుల వేతనాలు, బిల్లులు చెల్లించేందుకు వినియోగిస్తున్న ఈ కుబేర్‌ను రద్దుచేయాలని, ట్రెజరీ ద్వారానే పాత విధానంలో ఉద్యోగుల బిల్లులను చెల్లించాలని తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం (టీఎన్జీవో) రాష్ట్ర కార్యవర్గం డిమాండ్ చేసింది. 2022 జూలై 1 నుంచి పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలు విడుదల చేయాలని, పెండింగ్ బిల్లులను చెల్లించాలని కోరింది. టీఎన్జీవో రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్ అధ్యక్షతన బుధవారం నాంపల్లి టీఎన్జీవో భవన్‌లో నిర్వహించారు. 51 శాతం ఫిట్‌మెంట్‌తో రెండో పీఆర్సీని ప్రకటించాలని, ఈహెచ్ఎస్ అమలుచేయాలని, కాంట్రాక్ట్ వ్యవస్థను రద్దుచేయాలని, సీపీఎస్, యూపీఎస్ స్థానంలో పాత పెన్షన్ విధానాన్ని, జాయింట్ స్టాఫ్ కౌన్సిల్‌ను పునరుద్ధరించాలని, గ్రంథాలయాలు, మార్కెట్ కమిటీలు, ఎయిడెడ్, వైద్య విధాన పరిషత్, మోడల్ స్కూళ్లు, గురుకులాల ఉద్యోగులకు 010 పద్దు ద్వారా వేతనాలు చెల్లించాలని, ఏపీలో మిగిలిపోయిన 50 మందితోపాటు 9, 10వ షెడ్యూల్‌లోని ఉద్యోగులను తెలంగాణకు తిరిగి తీసుకురావాలని తీర్మానం చేసింది. సమావేశంలో టీఎన్జీవో ప్రధాన కార్యదర్శి ముజీబ్ హుస్సేనీ, అసోసియేట్ అధ్యక్షులు వెంకటేశ్వర్లు, సత్యనారాయణగౌడ్, కోశాధికారి శ్రీనివాసరావు, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్ పాల్గొన్నారు.

# ఆర్టీసీలో వెల్ఫేర్ బోర్డు చిచ్చు

- ట్రేడ్ యూనియన్లను పునరుద్ధరించాలని డిమాండ్
- హామీలను విస్మరించి వెల్ఫేర్ బోర్డుల ఏర్పాటు ఉత్తర్వులు
- జాక్ చైర్మన్ ఈదురు వెంకన్న, వైస్‌చైర్మన్ థామస్‌రెడ్డి వెల్లడి



హైదరాబాద్, సెప్టెంబర్ 11 (నమస్తే తెలంగాణ): తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ)లో 'వెల్ఫేర్ బోర్డు' ఏర్పాటు కార్మికుల్లో చిచ్చుపెట్టింది. ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు ఒక్క రుపాయి ఖర్చు లేకుండా ట్రేడ్ యూనియన్లను ఆర్టీసీలో అనుమతివ్వాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ఆర్టీసీ యాజమాన్యం దానిని పరిగణనలోకి తీసుకోకుండా వెల్ఫేర్ బోర్డు నియామకానికి అంతర్గతంగా ఆదేశాలు జారీచేసింది. యాజమాన్యం తీసుకున్న ఈ నిర్ణయంపై కార్మిక సంఘాలు మండిపడుతున్నాయి. ట్రేడ్ యూనియన్ల రద్దు వల్ల ఏండ్ల తరబడి కార్మికులకు చట్టబద్ధంగా దక్కాల్సిన హక్కులను పొందలేకపోతున్నామని, కార్మికులు ట్రేడ్ యూనియన్ చట్టాలను కాదని పనిచేయాల్సి వస్తున్నదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల మ్యానిఫెస్టోలో ట్రేడ్ యూనియన్లకు ఎన్నికలు నిర్వహిస్తామని కాంగ్రెస్ స్పష్టమైన హామీ ఇచ్చిందని, ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనం సహా ఆరు రకాల హామీలు అమలు చేస్తామని ప్రకటించిందని గుర్తు చేస్తున్నారు. తాజాగా, మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి తొలిసారి ఆర్టీసీ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో కార్మికుల సమస్యలపై చర్చించకపోవటంతో కార్మికులు తీవ్ర నిరాశకు గురయ్యారు. ఇదిలా ఉండగానే ఆర్టీసీ డిపోల్లో పాత వెల్ఫేర్ కమిటీ సభ్యుల స్థానంలో కొత్త వారిని నియమిస్తామని నోటీస్ బోర్డులపై ప్రకటనలు జారీ చేయటం కార్మికులను రెచ్చిగొట్టినట్టు అయ్యిందని ఆర్టీసీ జాక్ చైర్మన్ ఈదురు వెంకన్న, వైస్ చైర్మన్ థామస్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా ఈ నెల 21న ఇందిరా పార్క్ వద్ద సామూహిక నిరాహార దీక్షలు చేపట్టాలని నిర్ణయించినట్టు వెల్లడించారు. సమావేశంలో జేఏసీ కో-కన్వీనర్లు యాదయ్య, సుద్దాల సురేశ్, జేఏసీ నాయకులు కమలాకర్‌గౌడ్, బాబు, ఎండీ అహ్మద్‌అలీ, బాల్‌రెడ్డి, జీ రాములు పాల్గొన్నారు. ఆర్టీసీలో వెల్ఫేర్ బోర్డు సభ్యుల నియామకాన్ని రద్దు చేయాలని ఎస్‌డబ్ల్యూయూ, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొమిరెల్లి రాజిరెడ్డి డిమాండ్ చేశారు. ట్రేడ్ యూనియన్ల పునరుద్ధరణ డిమాండ్‌ను పెడచెవిన పెడుతున్న ప్రభుత్వం, యాజమాన్యవైఖరికి నిరసనగా భవిష్యత్తు కార్యాచరణను ప్రకటించటంపై గురువారం జరిగే సమావేశంలో నిర్ణయం తీసుకుంటామని స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి వీఎస్‌రావు, ప్రచార కార్యదర్శి రవీందర్‌రెడ్డి తెలిపారు.



కలెక్టరేట్‌లోని సివిల్ సప్లయి కార్యాలయం ఎదుట తోసుకుంటున్న టెండర్‌దారులు

# నాగర్‌కర్నూల్ కలెక్టరేట్‌లో 'ధాన్యం దంగల్'

ధాన్యం రవాణా టెండర్లలో ఉద్రిక్తత • ఫ్యాక్షన్ తరహాలో రౌడీయిజం

నాగర్‌కర్నూల్, సెప్టెంబర్ 11 : నాగర్‌కర్నూల్ జిల్లాలో ధాన్యం తరలించేందుకు కలెక్టరేట్‌లో చేపట్టిన టెండర్ల ప్రక్రియలో ఘర్షణ నెలకొన్నది. ఒకే వర్గం వారికి టెండర్లు దక్కాలన్న పన్నాగంలో భాగంగా ఆఫ్‌లైన్ టెండర్లు వేసే వారిని అడ్డుకోవడంతో ఉద్రిక్త పరిస్థితులు చోటు చేసుకున్నాయి. నాగర్‌కర్నూల్, కొల్లాపూర్, అచ్చంపేట, కల్వకుర్తి నియోజకవర్గాల నుంచి ధాన్యం రవాణా కోసం బుధవారం ఐడీవోసీలోని సివిల్ సప్లయ్ మేనేజర్ కార్యాలయంలో టెండర్ ప్రక్రియ కొనసాగింది. ఇదివరకే కొందరు ఆన్‌లైన్‌లో టెండర్లు వేసినప్పటికీ, ఆఫ్‌లైన్‌లో వేసేందుకు అవకాశం ఉండడంతో పలువురు వచ్చారు. ఓ వర్గం వారు తమకే టెండర్ దక్కాలన్న ఉద్దేశంతో ఆఫ్‌లైన్‌లో టెండర్లు వేసేందుకు వచ్చిన వారిని అడ్డుకున్నారు. వారి టెండర్‌పత్రాలను లాక్కెళ్లారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకున్నది. డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ కనకయ్య, ఎస్సైలతో బందోబస్తు ఏర్పాటుచేసినప్పటికీ ఎవరూ అడ్డుకోలేకపోయారని ఆరోపించారు. అధికార పార్టీకి చెందినవారు టెండర్లను దక్కించుకునేందుకు అధికారులతో కుమ్మక్కై ఫ్యాక్షన్ తరహాలో ఇదంతా నడిపించినట్టు టెండర్‌దారులు వాపోయారు. టెండర్లన్నింటినీ రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

# యాదాద్రి పవర్ మార్చి నాటికి సిద్ధం

- డిసెంబర్‌లో 3 యూనిట్లు పూర్తి
- నిర్వాసితులకు ఉద్యోగాలు
- రెండో యూనిట్‌లో ఆయిల్ సింక్రనైజేషన్‌తో ట్రయల్ రన్
- స్విచ్ ఆన్ చేసిన డిప్యూటీ సీఎం



యాదాద్రి పవర్ ప్లాంట్ వద్ద డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని నిలదీస్తున్న భూ నిర్వాసితులు

నల్లగొండ ప్రతినిధి, సెప్టెంబర్11 (నమస్తే తెలంగాణ) : వచ్చే ఏడాది మార్చి 31 నాటికి యాదాద్రి థర్మల్ పవర్ ప్రాజెక్టులో ఐదు యూనిట్ల ద్వారా 4 వేల మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తిని ప్రారంభించనున్నట్టు ఉపముఖ్య మంత్రి, విద్యుత్తు శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. ఏడాది చివరికి మూడు యూనిట్లను ప్రారంభిస్తామని వెల్లడించారు. మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో కలిసి బుధవారం నల్లగొండ జిల్లా దామరచర్ల యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో భట్టి నిర్మాణ పనులు పరిశీలించారు. అనంతరం ఉన్నతాధికారులతో పనుల పురోగతిపై సమీక్షించారు. రెండో యూనిట్‌లో ఆయిల్ సింక్రనైజేషన్ ద్వారా విద్యుత్తు ఉత్పత్తి ట్రయల్ రన్‌కు స్విచ్ ఆన్ చేశారు. అనంతరం ప్లాంట్ కాన్ఫరెన్స్ హాల్‌లో మీడియాతో మాట్లాడారు. డిసెంబర్ 31 నాటికి మూడు యూనిట్లలో 2,400 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తిని ప్రారంభించనున్నట్టు ప్రకటించారు. ఈ పవర్ ప్లాంట్ ద్వారా యూనిట్ విద్యుత్తును రూ.6.35కు ఇచ్చేందుకు కృషి చేస్తున్నట్టు తెలిపారు. ప్రాజెక్టు కోసం భూములిచ్చివారికి భూసేకరణ నిధులతోపాటు ప్రాజెక్టులో ఉద్యోగాలు కల్పిస్తామని తెలిపారు. మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి యాదాద్రి ప్లాంట్‌తోపాటు పులిచింతల ప్రాజెక్టులో భూములు కోల్పోయిన వారికి ఉద్యోగాలు కల్పిస్తామని డిప్యూటీ సీఎం ఆదేశాలిచ్చారని, వారికి నిర్వాసితుల తరపున ధన్యవాదాలు తెలియజేశారు. ఇందులో జెన్‌కో సీఎండీ రోనాల్డ్ రోస్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పనుల పురోగతిని మంత్రుల బృందానికి వివరించారు.

### మంత్రులను నిలదీసిన నిర్వాసితులు

**యాదాద్రి** పవర్‌ప్లాంటుకు వచ్చిన డిప్యూటీ సీఎం మల్లు , మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డిని భూ నిర్వాసితులు, ల్యాండ్ లూసర్స్ అడ్డుకున్నారు. పవర్ ప్లాంటకు భూములిచ్చిన తమకు ఉపాధి కల్పించలేదని నిలదీశారు. స్పందించిన మంత్రులు ప్లాంటుకు భూములు ఇచ్చిన వారు దేవుళ్లతో సమానమని తెలిపారు. మూడు నెలల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించాలని అధికారులను ఆదేశించామని చెప్పడంతో నిర్వాసితులు ఆందోళన విరమించారు.

# భట్టి మాట.. అబద్ధాల మూట!

యాదాద్రి థర్మల్ ప్లాంట్‌పై శుద్ధ అబద్ధాలు • వాస్తవాలు మరిచి కేసీఆర్‌పై విమర్శలు, నిందలు



యాదాద్రి పవర్ ప్లాంట్ పనులను పర్యవేక్షిస్తున్న అప్పటి సీఎం కేసీఆర్(ఫైల్)

హైదరాబాద్, సెప్టెంబర్ 11 (నమస్తే తెలంగాణ): సమాచారం లోపం.. అవగాహన లేమి..పచ్చి అబద్ధాలు.. ఇవి చాలవన్నట్టుగా ఉల్టాచోర్ కొత్వాల్ కో డాంటే అన్నట్టు డిప్యూటీ సీఎం భట్టి తీరు. కేసీఆర్‌పై నిందలు మోపడమే ఎజెండాగా పెట్టుకున్న ఆయన యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ ఆయిల్ సింక్రనైజేషన్‌ను ఇందుకు వాడుకున్నారు. యాదాద్రి పవర్ ప్లాంట్ ప్రణాళిక, నిర్మాణం, నిధుల సేకరణలో కాంగ్రెస్ ప్రభుత్వానికి ఇసుమంతైనా భాగస్వామ్యం లేదు. ఇప్పుడదే ప్రాజెక్ట్‌ను 2025 మార్చి నాటికి 4 వేల మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి చేస్తామని చెప్తున్నారు. 70 శాతానికిపైగా నిర్మాణం పూర్తయిన తర్వాత అంతా తామే చేసినట్టు హడావుడి చేస్తున్నారు. తాజాగా బుధవారం వైటీపీఎస్ ఆయిల్ సింక్రనైజేషన్‌ను ప్రారంభించి కేసీఆర్‌ను అభినందించాల్సిన నోటితో భట్టి అబద్ధాలు వల్లించారు. భట్టి మాట్లాడినవి.. వాస్తవాలు ఏమిటో చూద్దాం.

'2015 ఫిబ్రవరి 8న పవర్‌ప్లాంట్ పనులకు పునాది పడింది. అక్టోబర్ 17న పనులు మొదలుపెట్టారు. 2020 అక్టోబర్‌లో రెండు యూనిట్లు, 2021లో మిగిలిన యూనిట్లు పూర్తిచేయాలని గత ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నది. ప్రాజెక్ట్ సకాలంలో పూర్తిచేయడంలో నాటి ప్రభుత్వం సమీక్షించకపోవడంతో ఆర్థిక భారం పెరిగింది' అని భట్టి పేర్కొన్నారు.

### వాస్తవాలు..

- భట్టి మాటలు శుద్ధ అబద్ధం. యాదాద్రి పవర్ ప్లాంట్ పనులను 2017 అక్టోబర్ 17న చేపట్టారు. 2015లో పనులు మొదలు పెట్టినట్టు భట్టి అబద్ధమాడారు.
- 2020లో రెండు యూనిట్లు, 2021లో మిగిలిన యూనిట్లు చేపట్టాలని లక్ష్యంగా పెట్టుకున్న మాట వాస్తమే. కరోనా కష్టాలు ప్లాంట్‌ను వెంటాడాయి. పనులు పుంజుకుంటున్న సమయంలో కరోనా దెబ్బకొట్టింది. లాక్‌డౌన్, మొదటి, రెండో వేవ్‌లతో కార్మికులు సొంతూళ్లకు వెళ్లిపోయారు. అప్పటి విద్యుత్తుశాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి, జెన్‌కో సీఎండీ ప్రభాకర్‌రావు కార్మికులను వెనక్కి రప్పించేందుకు చర్యలు తీసుకున్నారు.
- అనుకున్న సమయంలో ప్లాంట్‌ను పూర్తి చేయలేదని భట్టి నింద మోపారు. థర్మల్ విద్యుత్తు ప్లాంట్ల నిర్మాణంలో తెలంగాణది రికార్డు. 48 నెలల్లోనే కేటీపీఎస్‌లో 800 మెగావాట్ల సూపర్ క్రిటికల్ థర్మల్ పవర్ ప్లాంట్‌ను కేసీఆర్ ప్రభుత్వం ప్రారంభించింది. రామగుండంలో ఎన్టీపీసీ నిర్మించిన ప్లాంట్ 2020కి పూర్తికావాల్సి ఉండగా 2023కు పూర్తయ్యింది.
- ప్లాంట్ నిర్మాణంలో ఆర్థిక భారం పెరిగిందని భట్టి అపవాదు మోపారు. ఈ ప్లాంట్‌కు కేసీఆరే శంకుస్థాపన చేశారు. నవరత్న కంపెనీ బీహెచ్ఈఎల్ సంస్థ ప్రతినిధులతో స్వయంగా భేటీ అయ్యారు. జెన్‌కో, బెల్ మధ్య లెటర్ ఆఫ్ ఇండెంట్ (ఎల్‌వోఐ) కేసీఆర్ సమక్షంలోనే కుదిరింది. ఈ ప్లాంట్ నిర్మాణం కోసం తొలి విడుతగా రూ.417.16 కోట్ల చెక్కును స్వయంగా కేసీఆరే బెల్ ప్రతినిధులకు అందజేశారు. గ్రామీణ విద్యుద్దీకరణ సంస్థ (ఆర్ఈసీ) రూ.16,070 కోట్ల ప్రోత్సాహకాన్ని మంజూరుచేయగా, ఆర్ఈసీ సీఈవో రాజీవ్‌శర్మ నుంచి కేసీఆరే స్వీకరించారు. పలుమార్లు విద్యుత్తు అధికారులతో సమీక్షించారు. 2022 నవంబర్ 29న దామరచర్లలో పర్యటించి ప్లాంట్ నిర్మాణాన్ని పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు.

### అడ్డుకునే కుతంత్రం

ప్లాంట్‌ను అడ్డుకునే కుతంత్రాలకు కొదువేలేదు. అన్ని అనుమతులు తీసుకున్న తర్వాతే ఈ ప్రాజెక్ట్‌ను చేపట్టినా ముంబైకి చెందిన ఒక సంస్థ నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్జీటీ)లో కేసు వేయడంతో 60 శాతం నిర్మాణం పూర్తయిన తర్వాత మళ్లీ అధ్యయనం చేయాలంటూ ఎన్జీటీ తీర్పునిచ్చింది. గ్రామీణ విద్యుద్దీకరణ సంస్థ (ఆర్ఈసీ) పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ (పీఎఫ్‌సీ) పూర్తిస్థాయి రుణానిచ్చేందుకు ముందుకొచ్చాయి. పలు సాంకేతిక కారణాలతో నిధుల విడుదల ఆపేశాయి. ఇది ప్లాంట్ నిర్మాణంపై ప్రభావం చూపింది.

## హలో.. కులకర్ణి.. ఆరోగ్యమెట్లున్నది..?

- బ్రెయిన్‌స్ట్రోక్‌తో చికిత్సపొందుతున్న కార్యకర్తకు ఫోన్‌లో కేసీఆర్ పరామర్శ
- చికిత్స ఖర్చులు భరిస్తానని భరోసా



హైదరాబాద్, సెప్టెంబర్ 11(నమస్తే తెలంగాణ): 'హలో! కులకర్ణి.. ఆరోగ్యమెట్లున్నది..? ఏం బాధపడకు.. ధైర్యంగా ఉండు.. దవాఖాన ఖర్చులన్నీ నేనే భరిస్తా..' అంటూ మాజీ ముఖ్యమంత్రి, బీఆర్‌ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు పార్టీ కార్యకర్తకు భరోసా ఇచ్చారు. ఇటీవల బ్రెయిన్‌స్ట్రోక్‌కు గురై హైదరాబాద్‌లోని ఓ దవాఖానలో చికిత్సపొందుతున్న ధరణి కులకర్ణిని పార్టీ అధినేత ఆదేశాల మేరకు మాజీ ఎంపీ సంతోష్‌కుమార్ బుధవారం పరామర్శించారు. డాక్టర్లతో మాట్లాడి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కులకర్ణితో కేసీఆర్ ఫోన్‌లో మాట్లాడి పరామర్శించారు. చికిత్స ఖర్చులను తానే భరిస్తానని హామీ ఇచ్చారు. కాగా, పార్టీ అధినేత కేసీఆర్ స్వయంగా ఫోన్ చేయడంతో కులకర్ణి, ఆయన కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తంచేశారు.

# శాటిలైట్ డాటా సేకరణలో హైడ్రా

### 46 ఏండ్ల డేటాతో కబ్జాలను గుర్తించే పనిలో అధికారులు

సిటీబ్యూరో, సెప్టెంబర్ 11 (నమస్తే తెలంగాణ): గ్రేటర్‌లో మరిన్ని పేదల ఇండ్లపై హైడ్రా బుల్డోజర్‌తో దాడి చేయనున్నట్టు సమాచారం. 46 ఏండ్ల నుంచి నిర్మాణాలపై హైడ్రా ఫోకస్ పెట్టినట్టు తెలుస్తోంది. ఇండ్లలో నివాసం ఉండే వారిపై హైడ్రా చర్యలు తీసుకోబోదని హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఇటీవల వెల్లడించారు. బుధవారం ముఖ్యమంత్రి ఆక్రమణదారులను ఎట్టి పరిస్థితుల్లోనూ వదలమని, కోర్టుకు వెళ్లినా తాము స్టే తెచ్చి కూల్చేస్తామని హెచ్చరించారు. ఈ క్రమంలోనే హైడ్రా కమిషనర్ రంగనాథ్ హైడ్రా పరిధిలోని చెరువుల మ్యాప్‌లను ఎన్‌ఆర్‌ఎస్‌సీ నుంచి సేకరిస్తున్నట్టు వెల్లడించారు. 1979 నుంచి 2023 వరకు చెరువులు ఎలా ఉన్నాయనే విషయాలను విశ్లేషిస్తున్నారు. శాటిలైట్ ఆధారంగా ఎన్‌ఆర్‌ఎస్‌సీ(నేషనల్ రిమోంట్ సెన్సార్ సెంటర్) చెరువులకు సంబంధించిన చిత్రాలు తీస్తున్నది. హైడ్రా దీనినే పరిగణలోకి తీసుకుని కూల్చివేతలు చేసేందుకు సన్నాహాలు చేస్తారని చర్చ మొదలయ్యింది. ముఖ్యమంత్రి వ్యాఖ్యలు దీనికి తోడయ్యాయి. దీంతో 46 ఏండ్ల నుంచి ప్రభుత్వ అనుమతులు తీసుకొని, తీసుకోకుండా చెరువులు, కుంటలు, నాలాల పక్కన ఇండ్లు నిర్మించుకున్న పేదలలో తీవ్ర భయాందోళనలు నెలకొన్నాయి.

### ఏదీ ప్రామాణికం...?

1979 నుంచి హైదరాబాద్ వేగంగా అభివృద్ధి చెందుతూ ఔటర్ లోపల దాదాపు విస్తరించింది. హైడ్రా పరిధిలో వెయ్యికిపైగా చెరువులు, కుంటలు ఉంటాయి. హెచ్‌ఎండీఏ, జీహెచ్‌ఎంసీ, ఇరిగేషన్ విభాగాలు తయారు చేసిన మ్యాప్‌లు, 46 ఏండ్ల ఎన్‌ఆర్‌ఎస్‌సీతో పోల్చుకొని చెరువులకు సంబంధించిన డైరెక్షన్‌ని హైడ్రా తయారు చేస్తున్నది. ఎన్‌ఆర్‌ఎస్‌సీ, మూడు ప్రభుత్వ విభాగాలు రూపొందించిన మ్యాప్‌లకు చాలావరకు పొంతనలేవు. చాలామంది పేదలు చెరువులు, కుంటల పక్కన తెలిసీతెలియక ఏండ్ల క్రితమే ప్లాట్లు కొని ఇండ్లు నిర్మించుకున్నారు. జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏ, మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీల నుంచి అనుమతులు తీసుకున్నా.. అవి చెల్లవని ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లలో ఇండ్లు ఎప్పుడు కట్టినా కూల్చేస్తామనే సంకేతాలు ప్రభుత్వం నుంచి వెల్లడవడంతో పేదలు బిక్కు బిక్కుమంటూ బతుకు సాగిస్తున్నారు. ప్రజలలో జరుగుతున్న చర్చపై హైడ్రా కమిషనర్‌తో 'నమస్తే తెలంగాణ' మాట్లాడేందుకు ప్రయత్నిస్తే ఆయన అందుబాటులోకి రాలేదు.

## గర్భిణిగా మహిళ డ్రామా

### ప్రసవం కోసం వచ్చి డాక్టర్లకే బురిడీ

జనగామ రూరల్, సెప్టెంబర్ 11: తొమ్మిది నెలల గర్భిణినంటూ కుటుంబసభ్యులతోపాటు డాక్టర్లను బురిడీ కొట్టించిన ఘటన జనగామ ఎంసీహెచ్‌లో బుధవారం చోటుచేసుకున్నది. కొడకండ్ల మండలం మొండ్రాయి తండాకు చెందిన ఓ వివాహిత పురిటి నొప్పులు వస్తున్నాయంటూ కుటుంబసభ్యులకు తెలిపింది. జనగామ మండలం పసరమడ్ల శివారు చంపక్ హిల్స్‌లో ఉన్న మాతాశిశు దవాఖానకు తరలించారు. పరీక్షల కోసం డాక్టర్లు పిలవగా బాత్‌రూం వెళ్లానని చెప్పి అరగంటపాటు అందులోనే ఉండి తర్వాత బయటికి వచ్చింది. బాత్రూంలోనే అబార్షన్ అయిందని, పుట్టినబాబు డ్రైనేజీలో పడిపోయాడని తెలిపింది. కంగుతిన్న డాక్టర్లు ఎంత వెతికినా అలాంటి ఆనవాళ్లు కనబడలేదు. అనుమానంతో వైద్య పరీక్షలు నిర్వహించిన డాక్టర్లు సదరు మహిళ గర్భిణి కాదని తేల్చడంతో అందరూ అవాక్కయ్యారు.

## వరంగల్‌లో గణపతి లడ్డూ@2100 కిలోలు



గణపతి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని వరంగల్ నగరంలోని పాపయ్యపేట కమాన్ గణపతి వద్ద పెట్టిన భారీ లడ్డూ రికార్డు సృష్టించింది. 2100 కిలోల లడ్డూ ప్రసాదాన్ని డోర్‌సైల్ డెలివరీ సర్వీసెస్ వారు సమర్పించారు. నిమజ్జనం రోజు తమ కంపెనీ యాప్ డౌన్లోడ్ ద్వారా బుక్ చేసుకున్న భక్తుల ఇంటికి వెళ్లి ఫ్రీగా లడ్డూ ప్రసాదాన్ని ఇస్తామని చెప్పారు. -మట్టెవాడ

## శాసనమండలి ప్రతిపక్ష నేతగా ఎమ్మెల్సీ సిరికొండ

### గెజిట్ విడుదల చేసిన శాసనసభ కార్యదర్శి



హైదరాబాద్, సెప్టెంబర్ 11 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర శాసనమండలిలో ప్రతిపక్ష నేతగా ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారిని గుర్తిస్తున్నట్టుగా శాసనసభ కార్యదర్శి వీ నర్సింహాచార్యులు గెజిట్ విడుదల చేశారు. ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారిని శాసనమండలిలో తమ పార్టీ నేతగా ఎంపిక చేశామని, ఇందుకు సంబంధించిన లాంఛనాలు పూర్తిచేయాలని బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ గత నెలలో శాసనసభ కార్యదర్శికి లేఖ రాసిన విషయం తెలిసిందే. ఆ లేఖను పరిగణనలోకి తీసుకొని బుధవారం శాసనసభ కార్యదర్శి గెజిట్ విడుదల చేశారు.

## కొత్త ఎస్‌ఈసీ ఎవరు?

హైదరాబాద్, సెప్టెంబర్ 11 (నమస్తే తెలంగాణ): స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధమవుతున్న తరుణంలో కీలకమైన రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నియామకంపై ఉత్కంఠ నెలకొన్నది. ప్రస్తుత కమిషనర్ పార్థసారథి పదవీ కాలం ఈనెల 8వ తేదీతో ముగిసింది. ఆయనను మరో సంవత్సరం కొనసాగించే అవకాశం ఉన్నా.. ఫైల్‌పై సీఎం రేవంత్‌రెడ్డి ఇంతవరకు సంతకం చేయలేదు. దీంతో ఆయనను కొనసాగించే ఉద్దేశం ప్రభుత్వానికి లేదని కాంగ్రెస్ పార్టీ వర్గాలు చెప్తున్నాయి. పార్థసారథి కేవలం నాలుగేండ్లు మాత్రమే పదవిలో కొనసాగారు. వాస్తవంగా రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పదవీ కాలం ఐదు సంవత్సరాలు. పంచాయతీరాజ్ చట్టంలోనూ అదే పేర్కొన్నారు. ఎన్నికల కమిషనర్‌గా ముఖ్యకార్యదర్శి లేదా అంత కంటే ఎక్కువ హోదాలో పనిచేసిన ఐఏఎస్ అధికారిని నియమించాల్సి ఉంటుంది. హైకోర్టు జడ్జి స్థాయికి సమానమైన కమిషనర్ పదవికి జడ్జికి వర్తించే నిబంధనలన్నీ వర్తిస్తాయి. 65 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న వారిని ఎంపిక చేయాలి. ఈ కోణంలో కొత్త ఎన్నికల కమిషనర్ కోసం అన్వేషణ ప్రారంభమైందని తెలిసింది.

# 'కాంగ్రెసోళ్లు మా ఇజ్జత్ తీస్తుండ్రు'

- మాకెవ్వరూ పైసలియ్యలే..
- సామాజిక మాధ్యమాల్లో కాంగ్రెస్ నాయకుల పోస్టుపై బాధితుల ఆగ్రహం

రామడుగు, సెప్టెంబర్11: సాయం చేయకుండా చేసినట్టు ప్రచారం చేసుకున్న కాంగ్రెస్ నేతల తీరుపై బాధిత కుటుంబసభ్యులు ఆగ్రహం వ్యక్తంచేశారు. కరీంనగర్ జిల్లా రామడుగు మండలం వెలిచాలకు చెందిన గోవింద్ దుబాయిలో అనారోగ్యానికి గురైతే, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సాయం అందించారని మండల, గ్రామస్థాయి కాంగ్రెస్ నాయకులు ఇటీవల సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టారు. దీంతో ఆగ్రహం వ్యక్తంచేసిన గోవింద్ సోదరుడు శంకర్ బుధవారం పెట్టిన వాయిస్ రికార్డు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్నది. 'చెయ్యని సాయానికి మా ఇజ్జత్ తీసుకుంట కాంగ్రెసోళ్లు గ్రూపుల్లో పోస్టులు పెట్టింండ్రు. మాకు ఏ ఎమ్మెల్యే, ఏ నాయకుడూ పైసలివ్వలే. మా అన్న దుబాయ్‌లో షుగర్ వ్యాధితో బాధపడుతుండగా, అక్కడే పనిజేసే మా తమ్ముడు అధికారుల చుట్టూ తిరిగితే, అక్కడి దవాఖానలో పనిచేసే ఆంధ్రా డాక్టర్ మెడికల్ సర్టిఫికెట్ ఇవ్వడంతో మా సొంత పైసల్తోని మా అన్న ఇంటికి జేరిండు.' అంటూ వాయిస్ రికార్డు పెట్టారు.



ఎమ్మెల్యే సత్యం సహాయం అందించినట్టు సామాజిక మాధ్యమాల్లో కాంగ్రెస్ నాయకులు పెట్టిన పోస్టు

# కౌలు రైతు ఆత్మహత్య

- పంట పెట్టుబడికి 8 లక్షల అప్పు
- అప్పుల బాధలు భరించలేక చెట్టుకు ఉరేసుకుని బలవన్మరణం
- సిద్దిపేట జిల్లా తొగుట మండలంలో విషాదం

తొగుట, సెప్టెంబర్ 11: అప్పుల బాధలు భరించలేక ఓ కౌలు రైతు తనువు చాలించాడు. ఈ ఘటన బుధవారం సిద్దిపేట జిల్లా తొగుట మండలం కన్గల్ గ్రామంలో చోటుచేసుకుంది. దొమ్మాట స్వామి (35) కన్గల్ గ్రామానికి చెందిన పెద్దమాతర మల్లయ్య వద్ద మూడెకరాల భూమి కౌలుకు తీసుకుని ఐదేండ్లుగా వ్యవసాయం చేస్తున్నాడు. ఆశించిన దిగుబడి రాక నష్టాలపాలయ్యాడు. దీంతో తెచ్చిన పెట్టుబడులు మీదపడి రూ.8 లక్షల వరకు అప్పులయ్యాయి. అప్పులు ఇచ్చిన వారి వేధింపులు పెరగడంతో మనస్తాపం చెందాడు. వాటిని తీర్చే దారి కనిపించకపోవడంతో జీవితంపై విరక్తి చెంది బుధవారం కౌలు చేస్తున్న పొలం వద్ద చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు ఒడిగట్టాడు. మృతుడికి భార్య దొమ్మాట లావణ్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.



స్వామి (ఫైల్)

మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్టు ఎస్సై వీ రవికాంతారావు తెలిపారు.

### విద్యుత్తు షాక్‌తో యువ రైతు మృతి

గాంధారి, సెప్టెంబర్ 11: ప్రమాదవశాత్తు విద్యుత్తు షాక్‌తో ఓ యువ రైతు మృతి చెందిన ఘటన కామారెడ్డి జిల్లా గాంధారి మండలం గుర్జాల్ గ్రామంలో బుధవారం చోటుచేసుకున్నది. గుర్జాల్ గ్రామానికి చెందిన అమర్లబండ దేవేందర్‌రావు(35) బుధవారం ఉదయం తన చేనులోని పత్తిపంటకు పురుగుల మందును పిచికారీ చేయడానికి వెళ్లాడు. బోరుమోటర్ నడవకపోవడంతో పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు విద్యుత్తు తీగ తెగిపోవడంతో దానిని ఓ కర్రతో సరిచేస్తుండగా షాక్ తగిలి అక్కడిక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య లావణ్య, ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు.

## 'మేడిగడ్డ'లో వరద ప్రవాహ పరీక్షలు షురూ

### బోటు సాయంతో ఏడీసీపీ పరికరంతో నిపుణుల టెస్టింగ్

మహదేవపూర్, సెప్టెంబర్ 11: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం అంబట్‌పల్లిలోని మేడిగడ్డ బరాజ్‌లో ఎన్‌డీఎస్‌ఏ (నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ) సూచనల మేరకు బుధవారం వరద ప్రవాహ అంచనా పరీక్షలు మొదలయ్యాయి. పుణెకు చెందిన శాస్త్రవేత్తలు డాక్టర్ సంపత్, నాగరాజు ఆధ్వర్యంలో ఏడీసీపీ (అకౌస్టిక్ డాప్లర్ కరెంట్ ప్రొఫైల్లర్) పరికరాన్ని బోటుకు అమర్చి బరాజ్‌లోని అప్‌స్ట్రీమ్‌లో భారీ నీటిపారుదల శాఖ అధికారులతో కలిసి వరద ప్రవాహం అంచనా కోసం పరీక్షలు చేపట్టారు. బరాజ్ వద్ద వరద ప్రవాహం మంగళవారం 4,06,510 క్యూసెక్కులు ఉండగా, బుధవారం 3,62,690 క్యూసెక్కులకు పెరిగింది. వరద ప్రవాహాన్ని నిపుణుల బృందం పరీక్షించింది. రిపోర్ట్‌ను పుణేలోని పీడబ్ల్యూపీఆర్‌సీకి అందజేయనున్నారు.

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

### నమస్తే తెలంగాణ

## ప్రజాస్వామ్య విలువల పాతర

**పార్లమెంటరీ** ప్రజాస్వామ్యానికి పాలక, విపక్షాలు రెండు చక్రాల వంటివి. రెండూ కలిసి ప్రజాహితమనే ఏకైక లక్ష్యం దిశగా అడుగులు వేయాలి. దీనికనుగుణంగానే వ్యవస్థలు, సంప్రదాయాలూ స్థిరమైనాయి. కానీ, రాష్ట్రంలో ప్రస్తుత పరిస్థితి అందుకు భిన్నంగా తయారైంది. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని ప్రజాస్వామిక విలువలను తుంగలో తొక్కి విపరీతపు పోకడలకు పోతున్నది. అసెంబ్లీ ప్రజాపద్దుల కమిటీ (పీఏసీ) చైర్మన్‌గా అరికెపూడి గాంధీని నియమించడమే దీనికి ఉదాహరణ. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ తరపున గెలిచిన గాంధీ, ఆ తర్వాత కాంగ్రెస్‌లో చేరారు. చేరినట్టుగా ఫొటోలు, ఆయన పోస్టు చేసిన ట్వీట్లు కూడా ఉన్నాయి. కానీ, తన పీఏసీ నియామకంపై వివాదం తలెత్తడంతో తాను పార్టీ మారలేదని మాట మార్చారు. గాంధీ ఫిరాయింపుపై అంతిమంగా ఏం జరుగుతుందనేది వేరే విషయం. ప్రతిపక్షాలకు ఇవ్వాల్సిన పీఏసీ చైర్మన్ పదవిని అసెంబ్లీ నియమావళికి, పార్లమెంటరీ స్ఫూర్తికి విరుద్ధంగా తమ పక్షానికే ఇచ్చుకోవడం కాంగ్రెస్ మార్క్ ప్రజాస్వామ్యంగా భావించాలి.

శాసనసభ నిబంధన 250 ప్రకారం దామాషా ప్రాతిపదికన పీఏసీ సభ్యుల ఎంపిక జరగాలి. పీఏసీ ఏర్పాటుచేసే నాటికి బీఆర్‌ఎస్ సభ్యుల సంఖ్య 38. ఆ ప్రకారం ముగ్గురు సభ్యులు బీఆర్‌ఎస్ నుంచి ఉండాలి. ఒక్కో సభ్యుని ఎన్నికకు 13 మంది అవసరమవుతారు. మరి గాంధీని ఎన్నుకున్నది ఏ 13 మంది ఎమ్మెల్యేలో? 1958-59 నుంచి విపక్ష సభ్యుడినే పీఏసీ చైర్మన్‌గా ఎన్నుకునే ఆనవాయితీ ఉన్నట్టు అసెంబ్లీ సభ్యుల కరదీపికలో స్పష్టంగా ఉన్నది. మరి పార్టీ ఫిరాయించిన గాంధీని పీఏసీ చైర్మన్‌గా ఎలా నియమించారు? ఈ తరహా నియామకం జరపడం అసెంబ్లీ నియమావళికి విరుద్ధం కాదా? పీఏసీ అనేది ప్రభుత్వ ఖాతాలను, వ్యయాలను తనిఖీ చేసే కీలక బాధ్యతను నిర్వర్తిస్తుంది. మరి తమ పార్టీ వారికే తాళాలు ఇస్తే సర్కారీ లెక్కల్లో సత్యాసత్యాలను నిగ్గు తేల్చడం సాధ్యమవుతుందా?

ఏ మాత్రం అవకాశం దొరికినా అన్నింటిలో స్వపక్షీయులను జొప్పించాలని చూసే కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కూడా ఎన్నడూ ఇలాంటి సంప్రదాయ ఉల్లంఘనకు పాల్పడలేదు. 2014-19లో కాంగ్రెస్ పార్టీకి చెందిన కేవీ థామస్‌ను, మల్లికార్జున ఖర్గేను పీఏసీ చైర్మన్లుగా నియమించి, క్యాబినెట్ ర్యాంకు కల్పించడం గమనార్హం. ఆ తర్వాత అధీర్ రంజన్ చౌదరిని, ప్రస్తుతం కేసీ వేణుగోపాల్‌ను పీఏసీ చైర్మన్‌గా నియమించారు. ఈ సంప్రదాయం ప్రకారమే బీఆర్‌ఎస్ హయాంలో విపక్ష కాంగ్రెస్ ఎమ్మెల్యేలు పి.కిష్టారెడ్డి, రామ్ వెంకటరెడ్డి, జె.గీతారెడ్డి, ఎంఐఎంకు చెందిన అక్బరుద్దీన్ ఒవైసీ పీఏసీ చైర్మన్లుగా నియమితులయ్యారు. మరి పొద్దున లేస్తే రాజ్యాంగ విలువలను కాపాడతామని ఊదరగొట్టే కాంగ్రెస్ అధిష్ఠానానికి తెలంగాణలో జరుగుతున్న విలువల హననం కనిపించడం లేదా? బహిరంగంగా ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగ విలువలను పరిహసిస్తుంటే చూసీచూడనట్టు వదిలేస్తారా? ఊరుకో రీతి అవసరానికో నీతి అనేదే కాంగ్రెస్ విధానమా? పార్లమెంట్‌లో విపక్ష హోదాతో కమిటీ పదవులు పొందుతూ ఇక్కడ విపక్షానికి ఆ అవకాశం దక్కకుండా చేయడం ద్వంద్వ ప్రమాణాల కిందకు రాదా?

# ఉపన్యాసాలు వేరు, ఆచరణ వేరు



బుద్దా మురళి

**ఒక స్థాయికి వెళ్లిన తర్వాత ప్రతి ఒక్కరికీ విలువల గురించి చెప్పాలని ఉంటుంది. ఇది అత్యంత సహజమైన లక్షణం. దీనిలో తప్పు పట్టాల్సిందేమీ లేదు. జర్నలిస్టుల హౌజింగ్ సొసైటీకి చెందిన దాదాపు 1100 మంది జర్నలిస్టులను ఉద్దేశించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మీడియాలో విలువలు, యూట్యూబ్ చానల్స్ విశృంఖలత, రాజకీయాల్లో విలువల గురించి ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యల మీద తమను విమర్శించారని యూట్యూబ్ ఛానల్స్ చర్చలతో తీవ్రంగా స్పందించినా, మెయిన్ స్ట్రీమ్ మీడియా మాత్రం పెద్దగా స్పందించలేదు.**



మీడియా గురించి, విలువల గురించి రేవంత్‌రెడ్డి మాట్లాడిన మాటలు విన్నాక దాదాపు 15 ఏండ్ల కిందట రేవంత్‌రెడ్డి సమక్షంలోనే జరిగిన ఒక చర్చ గుర్తుకువచ్చింది. ఉమ్మడి రాష్ట్రంలో 2009లో అప్పుడు టీడీపీ ప్రతిపక్షంలో ఉన్నది. టీడీపీ అప్పటి అధికార పక్షానికి చెందిన పత్రిక సాక్షిని టార్గెట్ చేసింది. అప్పటివరకు మీడియా అంటే దాదాపు 90 శాతం టీడీపీ అనుకూల మీడియానే. దీనికి వ్యతిరేకంగా కాంగ్రెస్ మీడియా నిలవడం అప్పుడు ప్రతిపక్ష నాయకుడిగా ఉన్న చంద్రబాబుకు కంటగింపుగా మారింది. అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్నప్పుడు లాబీలోని తన ఛాంబర్‌లో మీడియాతో బాబు మాట్లాడుతూ 'అక్రమ సంపాదనతో పెట్టిన మీడియాలో మీరు ఎలా పనిచేస్తారు, బయటకు రండి' అని మీడియాను ఉద్దేశించి ఆగ్రహంగా పలికారు. అప్పుడు టీడీపీలో ఉన్న రేవంత్‌రెడ్డి అక్కడే ఉన్నారు. టీడీపీ బీట్ రిపోర్టర్‌గా ఆంధ్రభూమి తరపున నేను అక్కడ ఉన్నాను. బాబు ఆవేశం మీద నీళ్లు చల్లుతూ 'కాంగ్రెస్ పత్రిక అక్రమ సంపాదనతో పెడితే మీ పార్టీకి అండగా ఉండే పత్రిక ఏ సంపాదనతో పెట్టారు? ఆ పత్రికలో పనిచేసే జర్నలిస్ట్ పత్రికనే కొనేశాడు. ప్రావిడెంట్ ఫండ్ డబ్బులు కూడబెట్టి కొన్నాడా?' అని నేను ప్రశ్నిస్తే బాబు సమాధానం చెప్పలేదు. ఛాంబర్ నుంచి బయటకు వచ్చాక రేవంత్‌రెడ్డి నాతో 'నిజమే నువ్వు చెప్పేదాకా ఆ ఆలోచన రాలేదు. అన్ని పత్రికలు అంతే కదా?' అని అబ్బురపడిపోయారు. రేవంత్‌రెడ్డి ఆనాటి అభిప్రాయానికి కట్టుబడి ఉండాల్సిన అవసరం లేదు. అప్పుడు ఆయన టీడీపీ శాసనసభ్యుడు మాత్రమే. ఇప్పుడు ముఖ్యమంత్రి కాబట్టి అచ్చం ఆ రోజు చంద్రబాబు ఆలోచన విధానంలోనే ఈ రోజు రేవంత్‌రెడ్డి చెప్తూ రాజకీయాల్లో, మీడియాలో విలువల గురించి బోధిస్తున్నారు.

కాంగ్రెస్‌లో జూనియర్ అయినా 'కాంగ్రెస్‌కు ఏకైక ఆశాకిరణం' రేవంత్‌రెడ్డి అనే విధంగా ప్రచారం చేయడంలో రేవంత్ రెడ్డి సొంత యూట్యూబ్ బృందాలు విశేషంగా కృషిచేశాయి. మంచి కన్నా, చెడు ప్రచారం ప్రజల్లోకి విస్తృతంగా వెళ్తుంది. అలా అప్పుడు రేవంత్‌రెడ్డి యూట్యూబ్ బృందం విజయవంతంగా పనిచేసింది. చివరికి కాంగ్రెస్ పార్టీ వాళ్లే యూట్యూబ్ బృందాల ద్వారా కాంగ్రెస్ సీనియర్‌లకు వ్యతిరేకంగా తప్పుడు ప్రచారం చేస్తున్నారని కాంగ్రెస్ సీనియర్ నేత ఉత్తమ్‌కుమార్ రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఈ యూట్యూబ్‌లను నడిపించే స్థావరాలపై దాడులు కూడా జరిపారు. రేవంత్‌రెడ్డి తక్కువ కాలంలో రాజకీయాల్లో ఎదగడానికి, కాంగ్రెస్ సీనియర్లను పక్కనపెట్టి ఏకైక ఆశాకిరణం అనుకునే స్థాయికి చేరుకోవడానికి మీడియాతో పాటు రేవంత్‌రెడ్డి సొంత యూట్యూబ్ సైన్యం గణనీయమైన పాత్ర పోషించింది. అందుకే, రేవంత్‌రెడ్డి యూట్యూబ్ చానళ్ల అరాచకాన్ని లేవనెత్తడంపై ట్యూబ్స్ తీవ్రంగా స్పందిస్తున్నాయి. సబ్బుల వ్యాపారం ఎలానో మీడియా వ్యాపారం కూడా అంతే.. దానికి మీరు ఎక్కువగా విలువలు ఆపాదిస్తున్నారని దార్శనికులు, స్వయంగా జర్నలిస్ట్ అయిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 1950 ప్రాంతంలోనే చెప్పారు. సబ్బుల వ్యాపారం, చెప్పుల వ్యాపారం, కూల్‌డ్రింక్స్ వ్యాపారం ఎలాగో రాజకీయ వ్యాపారం అంతే. సంపాదనే నేటి రాజకీయాల్లో సిద్ధాంతం.

> **రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక కాదు, పీసీసీ అధ్యక్షునిగా, అంతకు ముందు టీడీపీ అధ్యక్షునిగా, టీడీపీలో శాసనసభ్యునిగా ఉన్నప్పుడు కూడా మీడియా గురించి సంపూర్ణ అవగాహన ఉన్నది. తనకు వ్యతిరేకంగా రాస్తే మీడియా సమావేశంలో 'మీడియా వాళ్లు తమ డీఎన్‌ఏ పరీక్ష చేయించుకోవాలి' అని తిట్టినవారు ఆయన.**

యూట్యూబ్ చానళ్లు, పత్రికలు, చానళ్లు అన్నీ ఏదో ఒక పార్టీకి అనుబంధంగా పనిచేస్తున్నాయి. గతంలో ఎన్నికల ముందు రాజకీయపార్టీలు పుట్టుకువచ్చేవి. ఇప్పుడు ఎన్నికల ముందు డజన్ల కొద్ది యూట్యూబ్ చానళ్లను రాజకీయ నాయకులే పుట్టిస్తున్నారు. ఏదైనా తేడా వస్తే సీనియర్ల కోటాలో సీఎం కావచ్చు అని ఆశిస్తున్న సంపన్న సీనియర్ నాయకుడు ముందుచూపుతో రెండు పత్రికలు, రెండు చానళ్లు పెట్టే సన్నాహాలు చేస్తున్నట్టు మీడియా సర్కిల్‌లో ప్రచారం జరుగుతున్నది. రవీంద్రభారతిలో జరిగిన జర్నలిస్టుల సమావేశంలో మీడియా, రాజకీయ పార్టీల అనుబంధం గురించి రేవంత్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయ పార్టీల అనుబంధం లేని మీడియా కూడా ఉందా? ఈ విషయం రేవంత్‌రెడ్డికి తెలియదా? నిజానికి ఏ మీడియా, ఏ పార్టీకి అనుబంధమో రేవంత్‌రెడ్డికి అందరి కన్నా ఎక్కువ తెలుసు. ఓటుకు నోటు ఉదంతంలో స్వయం గా రేవంత్‌రెడ్డినే ప్రధాన మీడియా చానళ్ల పేర్లు ప్రస్తావించి టీడీపీకి అనుకూల మీడియా గురిం చి స్టీఫెన్ సన్‌కు చెప్పారు.

ఇప్పుడు అన్ని పార్టీలకూ మీడియా ఉన్నది. ఆంధ్రలో ఒక పార్టీకి పెద్ద ఎత్తున తటస్థ మద్దతుదారులు ఉంటారు. వారు పార్టీ వాళ్లమని ఒప్పుకోరు. పార్టీకి అనుకూలమే కానీ, తటస్థులం అని చెప్పుకుంటారు. మీడియా సైతం అంతే ఏదో ఓ పార్టీకి తటస్థ మద్దతుదారులు. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలు తమ కార్యాలయాల్లో ప్రెస్ కాన్ఫరెన్స్‌కు ప్రత్యర్థి పార్టీల మీడియా రిపోర్టర్‌లను బహిష్కరించాయి. మీడియా, రాజకీయపక్షాల అనుబంధం, రాజకీయ నాయకులే యూట్యూబ్ గుంపులను ప్రారంభించిన విషయం, తమ ప్రత్యర్థులపై ప్రచారదాడికి యూట్యూబ్ చానళ్లను నడిపిస్తున్న విషయం అందరికీ తెలిసిందే. రాజకీయ వ్యాపార క్రీడలో మీడియా ఎంతోకొంత తన విశ్వసనీయతను కోల్పోయిన మాట నిజం.

> **రేవంత్‌రెడ్డి రాజకీయాల్లో విలువల గురించి మాట్లాడిన మరుసటి రోజే, బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి దూకిన శాసనసభ్యులు అరికెపూడి గాంధీని పీఏసీ చైర్మన్‌గా నియమించారు. ఇప్పటివరకు దేశవ్యాప్తంగా ప్రతిపక్షానికి చెందిన శాసనసభ్యున్నే పీఏసీ చైర్మన్‌గా నియమించారు. నియంతృత్వంగా రాష్ట్ర ప్రభుత్వాలను తారుమారు చేసిన ప్రధాని నరేంద్ర మోదీ సైతం ఈ ఆచారాన్ని పాటించారు.**

తొలిసారి తెలంగాణలో వేరే పార్టీ నుంచి చేరిన వారిని పీఏసీ చైర్మన్‌గా నియమించారు. మీడియాలో, వ్యాపారంలో, రాజకీయాల్లో విలువల గురించి ఉపన్యాసాలు వేరు, ఆచరణ వేరు. ఈ రంగాల్లో విలువలు ఆశించడం అత్యాశే అనిపిస్తున్నది.

**కాంగ్రెస్‌లో జూనియర్ అయినా 'కాంగ్రెస్‌కు ఏకైక ఆశాకిరణం' రేవంత్‌రెడ్డి అనే విధంగా ప్రచారం చేయడంలో రేవంత్ రెడ్డి సొంత యూట్యూబ్ బృందాలు విశేషంగా కృషిచేశాయి. మంచి కన్నా, చెడు ప్రచారం ప్రజల్లోకి విస్తృతంగా వెళ్తుంది. అలా అప్పుడు రేవంత్‌రెడ్డి యూట్యూబ్ బృందం విజయవంతంగా పనిచేసింది... రేవంత్‌రెడ్డి తక్కువ కాలంలో రాజకీయాల్లో ఎదగడానికి, కాంగ్రెస్ సీనియర్లను పక్కన పెట్టి ఏకైక ఆశాకిరణం అనుకునే స్థాయికి చేరుకోవడానికి మీడియాతో పాటు రేవంత్‌రెడ్డి సొంత యూట్యూబ్ సైన్యం గణనీయమైన పాత్ర పోషించింది.**

**రవీంద్రభారతిలో జరిగిన జర్నలిస్టుల సమావేశంలో మీడియా, రాజకీయ పార్టీల అనుబంధం గురించి రేవంత్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయ పార్టీల అనుబంధం లేని మీడియా కూడా ఉందా? ఈ విషయం రేవంత్‌రెడ్డికి తెలియదా?**

# బీసీలు.. పల్లకీ మోసే బోయిలేనా?



ముఖేష్ సామల
97039 73946

**కాంగ్రెస్ అధిష్ఠానం రాష్ట్ర ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (పీసీసీ) అధ్యక్ష పదవిని బీసీ సామాజిక వర్గానికి ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే, బీసీలకు ఏదో రాష్ట్రాన్నే రాసిచ్చినట్టు.. కాంగ్రెస్ బీసీలకు పెద్దపీట వేస్తున్నదనే వార్తలు కొంత విస్మయాన్ని కలిగిస్తున్నాయి. జనాభా పరంగా చూస్తే రాష్ట్రంలో ఎక్కువగా ఉన్నది బీసీలే. అయితే, వారికి అరకొరగా పదవులిచ్చి, అన్నీ బీసీలకే ఇచ్చినట్టు ఆయా మీడియా సంస్థల ద్వారా ప్రచారాలు సాగించడాన్ని బీసీలు అర్థం చేసుకొని, అప్రమత్తంగా ఉండాలి. ఏ మాత్రం ఏమరుపాటుగా వ్యవహరించినా యావత్ బహుజన జాతి ఇంకా మోసానికి గురవుతూనే ఉంటుంది.**

డాక్టర్ వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి ఉమ్మడి రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఇదే పీసీసీ పదవిని బీసీ సామాజిక వర్గమైన దివంగత డి.శ్రీనివాస్‌కు ఇచ్చి ఓట్ పోలరైజేషన్‌కు వాడుకున్న మాట వాస్తవం కాదా? వైఎస్ మరణానంతరం బీసీ వ్యక్తి పీసీసీగా ఉన్నా, వైశ్య సామాజిక వర్గానికి చెందిన రోశయ్యను, ఆ తర్వాత కిరణ్‌కుమార్‌రెడ్డిని సీఎం సీటులో కూర్చోబెట్టింది కాంగ్రెస్ పార్టీ కాదా? ముఖ్యమంత్రిగా బీసీ నేతలకు ఆ పార్టీ అవకాశం ఇవ్వలేదు. అంటే, బీసీలకు కాంగ్రెస్ జెండాను మోసే అర్హత మాత్రమే ఉన్నదా? అధికార పీఠాన్ని ఎక్కే స్థాయి, శక్తియుక్తులు బీసీలకు లేవా? అనే ప్రశ్న యావత్ బీసీలోకంలో తలెత్తుతున్నది. దేశంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ వేవ్ బలంగా ఉన్నప్పుడు, వారు ఆడిందే ఆట, పాడిందే పాట అయ్యింది. ఆ రోజుల్లోనే ఢిల్లీ అధిష్ఠానం బీసీలపై మమకారం చూపలేదు. అంటే, రాష్ట్రాన్ని ఏలగలిగే సమర్థులు బీసీల్లో కూడా ఉన్నారని ఆ పార్టీ అనుకోవడం లేదని మనం అర్థం చేసుకోవాలి.


సరే గతం గతః అని వదిలేసి, ఇప్పటి విషయానికి వద్దాము. మధుయాష్కీ లాంటివారికి అధిష్ఠానం వద్ద చొరవ ఉన్నా, కాంగ్రెస్ ముఖ్యమంత్రిగా ప్రకటించలేదు. అన్నిపార్టీల కండువాలు మార్చినవారికే ముఖ్యమంత్రి పదవిని కట్టబెట్టి బీసీలపై కాంగ్రెస్ పార్టీ వైఖరి ఏమిటో చెప్పకనే చెప్పింది. అంతేకాదు, కనీసం నామినేటెడ్ పోస్టుల్లోనో, పార్టీ పదవుల్లోనో, కార్పొరేషన్ పదవుల్లోనో, కమిషన్ల నియామకాల్లోనో బీసీలకు జనాభా దామాషా ప్రకారం కేటాయించి సామాజిక న్యాయం పాటించిందా? అంటే, అదీ లేదు. పార్టీలో తొండికో మొండికో బీసీ గళం వినిపించే వి.హన్మంతరావు లాంటోళ్లు, తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న కత్తి వెంకటస్వామి లాంటివారు కూడా ఉత్సవ విగ్రహాలుగానే మిగిలిపోయారు. సరే, ఇవన్నీ బీసీలు వదిలేసుకున్నప్పటికీ, ప్రభుత్వ యంత్రాంగంలో బీసీ అధికారులకు ఎటువంటి ప్రాధాన్యం ఉందో, ఏ వర్గాల వాళ్లు పెత్తనం చెలాయిస్తున్నారో, బాజాప్తా మాది గవర్నమెంట్ అని బహిరంగంగా చెప్పుకొంటున్న వర్గమేదో కూడా బీసీలు ఆత్మావలోకనం చేసుకోవాల్సిన సందర్భం ఇది. సరిగ్గా ఇందిరమ్మ దేశాన్ని పాలిస్తున్న సమయంలో, 1982 జనవరిలో అప్రెస్డ్ ఇండియన్ అనే పత్రిక ఎడిటోరియల్‌లో 'మనకు రాజకీయ రిజర్వేషన్లున్నాయి, కానీ, నిర్ణయాలు తీసుకునే హక్కు మాత్రం మనకు లేదు. నిర్ణయాలు తీసుకోబడుతాయి, ప్రణాళికలు తయారు చేయబడుతాయి. అయితే, అవన్నీ ఎవరైతే మనకు శత్రువులో వారు మాత్రమే తయారుచేస్తారు. వాళ్ళు మన తరపున నిర్ణయాలు తీసుకుంటారు. భారతదేశంలో ప్రజాస్వామ్య విధానం ఈ విధంగా ఉన్నది' అని రాసింది. ఆనాటి ప్రజాస్వామిక పరిస్థితులను ఆ పత్రిక ఎద్దేవా చేసినట్టుగానే, నేటి తెలంగాణ ఇందిరమ్మ రాజ్యంలోనూ అవే పరిస్థితులు దాపురిస్తున్నాయి.



కాంగ్రెస్ పార్టీ దృష్టిలో ఏ పదవులకు పనికిరాని బీసీలు, కేవలం లోకల్‌బాడీ ఎన్నికల్లో వార్డు మెంబర్, సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ వంటి చిన్నాచితకా పదవులకు మాత్రమే అర్హులు. బీసీ కులాలను ఉద్ధరించేందుకే కమిషన్ వేసి లెక్కలు గట్టి 'కిందిస్థాయిలో మీరు ఉండండి మీపైన మేము పెత్తనం చేస్తాం' అన్నట్టుగా స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ అంశాన్ని ముందుకు తెస్తున్నది. ఇదెలా ఉందంటే.. 'పండ్లు మేం తింటాం, మీరు తొక్కలు తినండి' అన్నట్టుగా ఉన్నది. తెలంగాణ శాసనసభలో 22 మంది మాత్రమే బీసీ ఎమ్మెల్యేలు ఉండటాన్ని బీసీ సామాజిక వర్గం గమనించాలి. కాంగ్రెస్ పార్టీ డబ్బులున్న ఎన్నారైలకు మాత్రమే టిక్కెట్లు ఇచ్చింది కానీ, స్థానికంగా పార్టీకి లాయల్‌గా ఉన్న బీసీ లీడర్లను కేవలం పల్లకీ మోసే బోయిలుగానే చూసింది. ఎవరు ఔనన్నా, కాదన్నా ఇది నూటికి నూరు శాతం నిజం. ఉమ్మడి రాష్ట్రంలో బీసీలకు గుర్తింపు ఉండలేదన్నది వాస్తవమే కానీ, తెలంగాణ ఏర్పడిన తర్వాత ఇంతటి దీనస్థితి, కుల వివక్షకు బీసీలెప్పుడూ గురికాలేదు. కేసీఆర్ హయాంలో బీసీల్లోని ఒక్కో వర్గాన్ని గుర్తు పెట్టుకొని మరీ ఆయా పదవుల్లో అకామడేట్ చేసి తగిన గౌరవం ఇచ్చారు.

రాష్ట్రంలో జరుగుతున్న పరిస్థితులను కొంచెం సునిశితంగా గమనిస్తే దళితుల కంటే దయనీయమైన స్థితిలో బీసీ బిడ్డలున్నారనే విషయం అర్థమవుతున్నది. ప్రభుత్వం ఇచ్చే సర్టిఫికెట్‌లో ఏ విధంగానైతే 'వెనుకబడిన తరగతులు' అని రాసినట్టుగా బీసీలు అన్నింటిలోనూ వెనకబడే ఉన్నారని కాంగ్రెస్ పార్టీ ఇంకా బీసీలను దగా చేస్తూనే ఉన్నది. యాదగిరిగుట్టలో దళితుడైన ఉప ముఖ్యమంత్రి భట్టికి చిన్నపీట వేసి మిగతా అగ్రవర్ణాలు పెద్ద పీటల మీద కూర్చున్నట్టే, బీసీ బిడ్డ అయిన పీసీసీ అధ్యక్షుడికి చిన్నపీట వేసి ముఖ్యమంత్రి పెద్ద పీట మీద కూర్చొని వినాయక పూజలో పాల్గొన్నారు. పాలకునికి ఎంతటి కుల దురహంకారమో అన్నది దీన్నిబట్టే అర్థమవుతున్నది. ప్రజలు గమనిస్తున్నారు. కర్రు కాల్చి వాతపెట్టే సమయం ఎంతో దూరం లేదు.

(వ్యాసకర్త: హైకోర్టు న్యాయవాది, రాజకీయ విశ్లేషకులు)




## ఈ వ్యతిరేకత నేటిది కాదు!



**రిజర్వేషన్లను పేదలకు దూరం చేయాలన్న రాహుల్‌గాంధీ వైఖరి కొత్తదేమీ కాదు. నెహ్రూ-గాంధీ కుటుంబం ఏండ్ల తరబడి అవలంబిస్తున్న వైఖరికి ఆయన వ్యాఖ్యలే నిదర్శనం. మాజీ ప్రధానులు జవహర్‌లాల్ నెహ్రూ, రాజీవ్‌గాంధీ గతంలో సమర్థించి, అమలులో విఫలమైన దాని గురించే నేడు రాహుల్ గాంధీ మాట్లాడుతున్నారు.**

**- హిమంత బిశ్వ శర్మ,**
అసోం ముఖ్యమంత్రి

**కేసీఆర్ నాయకత్వంలో జరిగిన అలుపెరగని పద్నాలుగేండ్ల పోరాట ఫలితంగా స్వరాష్ట్రం సిద్ధించింది. అరువై ఏండ్ల వలస పాలనలో అన్నిరకాల వివక్షకు గురై, వెనుకబడిన తెలంగాణను అనతికాలంలోనే ప్రగతిపథంలో నడిపించిన మహనీయుడు కేసీఆర్. జాతీయ పార్టీల కుట్రల నుంచి కాపాడటమే కాకుండా తెలంగాణను దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిపారు. ఏ రాష్ట్రంలోనూ లేని సంక్షేమ పథకాలను అమలుచేసి రాష్ట్రాన్ని పునర్నిర్మాణం చేశారు. కేసీఆర్ అకుంఠిత దీక్షతో తెలంగాణ అన్ని రంగాల్లోనూ ప్రగతి పథంలో దూసుకుపోయింది. అలాంటి తెలంగాణ నేడు మళ్లీ ఆగమవుతున్నది.**

# మళ్లీ మొదలైన కుట్ర




రాజేశ్ నాయక్
96035 79115



తెలంగాణకు గుండెకాయ లాంటి హైదరాబాద్ కేసీఆర్ హయాంలోనే విశ్వనగరంగా అవతరించింది. మౌలిక వసతులు, శాంతిభద్రతల పరంగా ఎంతగానో పురోగమించింది. అంతేకాదు, అనేక ప్రాంతాల్లో ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు నిర్మించి ట్రాఫిక్ సమస్యకు చెక్‌పెట్టారు. తత్ఫలితంగా ప్రపంచ దిగ్గజ సంస్థలు హైదరాబాద్‌కు వచ్చాయి. స్వయంగా రైతు అయిన కేసీఆర్ అన్నదాతల సంక్షేమం కోసం అనేక పథకాలను అమలుచేశారు. ఏటా ఎకరానికి పెట్టుబడి సాయంగా రూ.10,000 అందించి తాను రైతు పక్షపాతినని నిరూపించుకున్నారు. ఈ పథకాన్ని ఐరాస సైతం కొనియాడింది. అకాల మరణం చెందిన రైతుల కుటుంబసభ్యులు రోడ్డున పడకూడదనే ఉద్దేశంతో తీసుకొచ్చిన రైతుబీమా పథకం విప్లవాత్మకమైంది. ఈ పథకం ద్వారా చనిపోయిన రైతు కుటుంబానికి రూ.5 లక్షల పరిహారం అందించారు. పేదోళ్ల బిడ్డలు కూడా ఇంగ్లీష్ చదువులు చదివి, ప్రపంచంతో పోటీపడాలనే ఉద్దేశంతో అనేక గురుకులాలను స్థాపించారు. రాష్ట్రంలోని గురుకులాలను వెయ్యికి పెంచి, ఏటా లక్షలమంది విద్యార్థులకు అధునాతన సౌకర్యాలతో కూడిన నాణ్యమైన ఉచిత విద్యనందించారు.

ప్రజలకు అధికారులు అందుబాటులో ఉండేవిధంగా పాలన వికేంద్రీకరణ చేసి జిల్లాలు, మండలాలు, పంచాయతీల సంఖ్యను పెంచారు. ప్రతి జిల్లాలో కలెక్టరేట్ల నిర్మాణం, మండల, గ్రామ పంచాయతీల కార్యాలయాలను ఏర్పాటుచేశారు. కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించి సాగును బాగు చేశారు. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి, ప్రగతిపథంలో పరుగులు పెట్టించారు. అంతేకాదు, మన నీళ్లు, మన నిధులు, మన నియామకాలు మనకే దక్కాయి. కానీ, వీటన్నింటిని ప్రచారం చేసుకోవడంలో బీఆర్‌ఎస్ విఫలమైంది. అదే సమయంలో నాటి ప్రతిపక్షాలు లేనిపోని దుష్ప్రచారం చేశాయి. వెరసి గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఓటమిపాలైంది. ఒకే అబద్ధాన్ని పదే పదే చెప్పడంతో అదే నిజమని ప్రజలు భ్రమపడి కాంగ్రెస్‌ను గద్దెనెక్కించారు. కానీ, నమ్మి ఓట్లేసిన ప్రజలను హస్తం పార్టీ ప్రభుత్వం నట్టేట్లో ముంచింది. 9 నెలల కాలంలోనే రేవంత్‌రెడ్డి సర్కార్‌పై ప్రజల్లో అసహనం మొదలైంది.

బీఆర్‌ఎస్ హయాంలో తెలంగాణ వైపు కన్నెత్తి చూడని ఆంధ్రా పెత్తందార్లు నేడు మళ్లీ రాష్ట్రంలో కార్యకలాపాలు కొనసాగించేందుకు ఉవ్విళ్లూతున్నారు. పదవుల పంపకంలో మళ్లీ ఆంధ్రోళ్ల ఆధిపత్యం మొదలైంది. తెలంగాణ బిడ్డల ఓట్లతో గద్దెనెక్కిన రేవంత్ ప్రభుత్వం నిస్సిగ్గుగా ఆంధ్రాపెత్తందార్లకు వంతపాడుతున్నది. 'మాకు తెలంగాణవాళ్లు వద్దు, ఆంధ్రావాళ్లే ముద్దు' అనే ఎజెండాతో రేవంత్ సర్కార్ ముందుకుపోతున్నది. తెలంగాణవారికి న్యాయంగా దక్కాల్సిన పదవులను ఆంధ్రోళ్లకు కట్టబెడుతున్నది. ఆంధ్రాకు చెందిన సి.ఆంజనేయరెడ్డిని బుద్ధవనం ప్రాజెక్టు డైరెక్టర్‌గా, అనంతపురం జిల్లాకు చెందిన అనితా వావిళ్లకు తెలంగాణ రెడ్కో వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌గా, నిమ్మగడ్డ రమేష్ కుమార్‌ను నీటి పారుదల జలవనరుల సలహాదారులుగా నియమించడం అందులో భాగమే. అదేవిధంగా ఏపీకి చెందిన రఘునాథ్ రెడ్డికి మున్సిపల్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ శాఖలోకి తీసుకోవడం, సూర్యదేవర ప్రసన్న కుమార్‌ను తెలంగాణ శాసన మండలి సలహాదారుడిగా, శ్రీనివాస్‌రాజును తెలంగాణ ప్రభుత్వ సలహాదారుడిగా, ఆంధ్రాకు చెందిన జర్నలిస్టు శ్రీరామ్ కర్రికి తెలంగాణ మీడియా అండ్ కమ్యూనికేషన్ పదవి కట్టబెట్టడం కూడా ఈ కోవకు చెందినవే. ఈ నియామకాల వెనుక చాలా పెద్ద కుట్ర దాగి ఉన్నదని తెలంగాణవాదులు మండిపడుతున్నారు. వీళ్లకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమాధానమివ్వాలి. కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న ఈ వైఖరి రాష్ట్రానికి చాలా ప్రమాదకరం. దీనిపై పౌర సమాజం మరోసారి ఉద్యమించాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.



# వేములవాడలో 'హైడ్రా' గుబులు?

- రెండో బైపాస్‌లో అధికారుల సర్వే
- మూలవాగు పరీవాహకంలో హద్దుల ఏర్పాటు
- హైడ్రా తరహా తనిఖీలపై ప్రజల్లో ఆందోళన

వేములవాడ, సెప్టెంబర్ 11: రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ మూలవాగు పరీవాహక ప్రాంతంలో బుధవారం అధికారులు సర్వే చేపట్టడంతో ప్రజల్లో ఆందోళన నెలకొన్నది. వేములవాడ పట్టణం మూలవాగుకు పరీవాహక ప్రాంతంగా ఉండగా, గత బీఆర్‌ఎస్ హయాంలో మొదటి బైపాస్ రహదారిలో బఫర్ జోన్ హద్దులను నిర్ణయించి అధికారులు నోటీసులు జారీచేసిన విషయం తెలిసిందే. తాజాగా రెండో బైపాస్ రహదారి వద్ద అధికారులు బుధవారం సర్వే చేయడం కలకలం రేపింది. సర్వేయర్, మున్సిపల్, ఇరిగేషన్ శాఖలకు సంబంధించిన అధికారులు సుమారు రెండు కిలోమీటర్ల పొడవు ఉన్న మూలవాగు బఫర్ జోన్ హద్దుల ఏర్పాటుకు సర్వే చేశారు. ఇందులో భాగంగా దాదాపు 40 కట్టడాల వరకు గుర్తించినట్లుగా సమాచారం. కలెక్టర్ సందీప్ కుమార్ ఝ ఆదేశాలతో సర్వే నిర్వహించడంతో హైడ్రా తరహాలో కూల్చివేతలు ఉంటాయన్న పుకార్లు షికారు చేస్తుండగా, వేములవాడ ప్రజలు ఆందోళన చెందుతున్నారు. సర్వేలో ఆర్డీవో రాజేశ్వర్, జిల్లా ఇన్‌చార్జి ఏడీ సర్వేయర్ వినయ్, డీఐ బాలచంద్రం, ఇరిగేషన్ డీఈ శ్రీనివాస్, సంపత్, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.



రాజన్న సిరిసిల్ల వేములవాడ పట్టణంలోని రెండో బైపాస్ రహదారి మూలవాగు పరిసరాల్లో హద్దులు నిర్ణయించేందుకు సర్వే చేస్తున్న ఇరిగేషన్, సర్వే విభాగం అధికారులు

# హైడ్రా అనుమతిస్తేనే ఇంటి నిర్మాణం!

- ఎన్‌ఓసీ తప్పనిసరి చేస్తూ సర్కారు మెలిక
- 'టౌన్‌ప్లానింగ్' నిర్వీర్యం దిశగా అడుగులు
- సివిల్ ఇంజినీర్ల బాధ్యత పోలీసుశాఖకు?
- చట్టబద్ధత లేని సంస్థకు అధికారాలపై విమర్శలు

హైదరాబాద్, సెప్టెంబర్ 11(నమస్తే తెలంగాణ) : చెరువులు, జలాశయాలను కబ్జాల నుంచి కాపాడేందుకు ఏర్పాటు చేసిన హైడ్రా(హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ)కు మరిన్ని అధికారాలు కల్పించేందుకు ప్రభుత్వం సిద్ధమైనట్టు తెలిసింది. నీటి వనరుల సమీప ప్లాట్లలో ఇకనుంచి ఇంటి అనుమతులు పొందాలంటే హైడ్రా నుంచి నిరభ్యంతర ధ్రువీకరణ పత్రం(ఎన్‌వోసీ) తప్పనిసరి చేస్తూ ఉత్తర్వులిచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నట్టు సమాచారం. ఎక్కడైనా ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌ల పరిధిలో అక్రమ నిర్మాణాలు చేపడితే ఇంటి నంబరును రద్దుచేయడంతోపాటు కరెంటు, నల్లా కనెక్షన్లను కూడా తొలగించేందుకు ఉత్తర్వులు వెలువడతాయని తెలిసింది. ఇప్పటివరకు ఇంటి అనుమతుల కోసం ఉన్న టౌన్‌ప్లానింగ్ వ్యవస్థను నిర్వీర్యం చేస్తూ దాని అధికారాలను ఎలాంటి చట్టబద్ధత లేని హైడ్రాకు అప్పగించాలని చూడడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

### చట్టబద్ధంగా టౌన్‌ప్లానింగ్

సహజంగా ఇంటి అనుమతులు జారీచేసేందుకు మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లలో టౌన్‌ప్లానింగ్ పేరుతో చట్టబద్ధమైన వ్యవస్థ పనిచేస్తున్న విషయం విదితమే. అనుమతుల కోసం వచ్చే దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి, క్షేత్రస్థాయి తనిఖీలు నిర్వహించిన తర్వాత అన్నీ సవ్యంగా ఉంటేనే ఈ విభాగం అనుమతుల కోసం సిఫారసు చేస్తుంది. టౌన్‌ప్లానింగ్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన దరఖాస్తులకు మున్సిపల్ కమిషనర్లు అనుమతులు జారీచేస్తారు. ఆయా మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల పరిధిలోని చెరువులు, రిజర్వాయర్లు, కుంటలు, నాలాలు, ప్రభుత్వ స్థలాలు, అసైన్డ్ భూములు తదితర అంశాల సమగ్ర సమాచారం టౌన్‌ప్లానింగ్ విభాగం వద్ద నిక్షిప్తమై ఉన్నది. అంతేకాదు, గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన టీఎస్ బీపాస్ సింగిల్ విండో విధానంలో దరఖాస్తుదారులు ఎక్కడికీ తిరగకుండానే ఆన్‌లైన్ ద్వారా శీఘ్రగతిన అనుమతులు పొందే వీలున్నది. టౌన్‌ప్లానింగ్ విభాగం బఫర్‌జోన్, ఎఫ్‌టీఎల్ వంటి అంశాలను పరిశీలించిన తర్వాతే అనుమతులు జారీచేస్తుంది.



### వారి బాధ్యత పోలీస్ శాఖకు?

కూల్చివేతల కోసం హైడ్రా పోలీస్ స్టేషన్లను ఏర్పాటు చేస్తున్నారనే ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో, ఇంటి అనుమతులకు హైడ్రా నుంచి ఎన్‌వోసీ పొందాలనడం విమర్శలకు తావిస్తున్నది. టౌన్‌ప్లానింగ్‌లో నిపుణులైన సివిల్ ఇంజినీర్లు, ఆర్కిటెక్ట్‌లు చేయాల్సిన పనులను పోలీసు శాఖ ఆధీనంలోకి తెస్తున్నారా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. బఫర్ జోన్లు, ఎఫ్‌టీఎల్‌ల నిర్ధారణ హైడ్రాకు ఎలా సాధ్యమని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఒకవేళ ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ల నిర్ధారణ హైడ్రాకు అప్పగించాలంటే హైడ్రాలో టౌన్‌ప్లానింగ్ అధికారులను నియమించుకోవాల్సి ఉంటుంది. అంటే, కొత్త సీసాలో పాత సారా అన్న చందంగా ఇంతకాలం టౌన్‌ప్లానింగ్ విభాగంలో పనిచేసిన సిబ్బంది ఇకనుంచి హైడ్రా ఆధీనంలో పని చేయాల్సి ఉంటుందని చెప్పవచ్చు. దీనివల్ల ప్రభుత్వం ఎలాంటి మార్పు ఆశిస్తున్నదో అంతుబట్టడంలేదు.

### చట్టబద్ధత లేని సంస్థకు మరిన్ని అధికారాలా?

హైడ్రాకు అసలు చట్టబద్ధతే లేదని పెద్ద ఎత్తున విమర్శలు వ్యక్తమవుతున్న క్రమంలో దానికి మరిన్ని అధికారాలు కల్పిస్తుండడం చర్చనీయాంశమైంది. అక్రమంగా అనుమతులు జారీచేసే అధికారులపై చర్యలు తీసుకోవాల్సిందిపోయి దేశంలో ఎక్కడా లేనివిధంగా అనాధిగా వస్తున్న టౌన్‌ప్లానింగ్ వ్యవస్థనే నిర్వీర్యం చేసే దిశగా ప్రభుత్వం ఏర్పాట్లు చేయడం వివాదాస్పదమవుతున్నది. దీనివల్ల భవిష్యత్తులో ఇంటి అనుమతి కోసం వెళ్లేవారు హైడ్రా చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతున్నది.

# కోర్టుకెళ్లినా వదలం కూల్చేసుడే

> మొదటిపేజీ తరువాయి...

చేశారు. హైడ్రాపై కొందరు ఇష్టం వచ్చినట్టు మాట్లాడుతున్నారని, చెరువులు, కుంటలు, నాలాల ఆక్రమణల వల్లే వరదలు వస్తున్నాయని చెప్పారు. కొందరు బడాబాబులు చెరువుల్లో అక్రమ నిర్మాణాలు కట్టి, డ్రెయిన్ వాటర్‌ను చెరువుల్లోకి వదులుతున్నారని, ఆ నీటిని హైదరాబాద్ ప్రజలకు ఇవ్వాలా? అని ప్రశ్నించారు. ఆక్రమణలతో చెరువులు నిండిపోవడంతో వానకాలం వరదలతో పేదల జీవితాలు అతలాకుతలం అవుతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. అందుకే చెరువుల్లోని అక్రమ నిర్మాణాలను నేలమట్టం చేసి తీరుతామని, నా లాల ఆక్రమణలను నిరభ్యంతరంగా కూల్చేస్తామని స్పష్టంచేశారు. చెరువులను చెరబట్టిన వారి నుంచి వాటిని విడిపించడమే హైడ్రాకు తామిచ్చిన టాస్క్ అని పేర్కొన్నారు. త్వరలోనే ఆక్రమణలు తొలగించి మూసీని ప్రక్షాళన చేస్తామని, మూసీ నాలాల్లోని శాశ్వత నివాసదారులకు డబుల్‌బెడ్రూం ఇండ్లు అందిస్తామని తెలిపారు. మూసీ ప్రక్షాళనలో ఇండ్లు కోల్పోయే 11–14 వేల మందికి ప్రభుత్వం పునరావాసం కల్పిస్తుందని చెప్పారు. ఎఫ్టీఎల్, బఫర్‌జోన్ పరిధిలో నిర్మాణాలను రెగ్యులరైజ్ చేసే ప్రసక్తే లేదని స్పష్టంచేశారు.

### 27 రోజుల్లో 18 వేల కోట్ల రుణమాఫీ

తమ ప్రభుత్వం పెట్టుబడులు తీసుకురావడమే కాకుండా.. రైతన్నలు, నేతన్నలు, గీతన్నలను ఆదుకుంటున్నదని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. ఈ క్రమంలో సరిగ్గా 27 రోజుల్లోనే 22,22,685 మంది రైతుల ఖాతాల్లో రూ.18 వేల కోట్లు జమ చేసి రుణమాఫీ చేసినట్టు వివరించారు. దేశంలోనే ఇదొక కొత్త చరిత్ర అని చెప్పారు. కడుపు కట్టుకుని నిధులు సేకరించి రుణమాఫీ చేసి రైతుల కండ్లల్లో ఆనందం చూస్తున్నామని పేర్కొన్నారు. పెట్టుబడులు తీసుకొనిరావడం ద్వారా లక్షలాది నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించే పనిలో ఉన్నామని చెప్పారు. అయితే, సీఎం అధికారిక కార్యక్రమాల్లో రాజకీయ విమర్శలు చేయడం పట్ల పలువురు అభ్యంతరం వ్యక్తంచేస్తున్నారు. ఈ తరహా వ్యాఖ్యలు సీఎంకు తగవని అంటున్నారు.

# రియల్ ఎస్టేట్ సర్వనాశనం

> మొదటిపేజీ తరువాయి...

హైడ్రా పేరిట డ్రామాలు చేస్తున్నదని విమర్శించారు. కేంద్రం ఇచ్చిన రూ.800 కోట్ల ఉపాధి హామీ నిధులను కాంగ్రెస్ ప్రభుత్వం దారి మళ్లించిందని తెలిపారు. బుధవారం సంగారెడ్డి, మెదక్ జిల్లాలో పర్యటించిన ఆయన, ఇటీవల ఖమ్మం పర్యటనలో కాంగ్రెస్ కార్యకర్తల దాడిలో గాయపడి దవాఖానలో చికిత్స అనంతరం ఇంటికి వచ్చిన బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు యావన్నగారి సంతోష్‌రెడ్డిని గుమ్మడిదలలో పరామర్శించారు. అంతకు ముందు శివ్వంపేటలో స్థానిక నాయకులు, కార్యకర్తలు హరీశ్‌కు ఘనస్వాగతం పలికారు. మెదక్ జిల్లాలోని నర్సాపూర్‌లో స్థానిక ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డితో కలిసి క్యాంప్ కార్యాలయంలో మీడియా సమావేశంలో హరీశ్ మాట్లాడుతూ యూట్యూబ్‌లను చూస్తే రేవంత్‌రెడ్డికి వెన్నుల్లో వణుకు పుడుతున్నదని ఎద్దేవాచేశారు. ఫార్మాసిటీ, మెట్రోరైలు విషయంలో సీఎం రూటు మార్చారని మండిపడ్డారు. రేవంత్ తొందరపాటు వల్ల స్థానిక కాంగ్రెస్ నాయకులు గ్రామాలకు వెళ్లలేని పరిస్థితి వచ్చిందని చెప్పారు. 'ఏ గ్రామానికైనా వెళ్దాం.. వందశాతం రుణమాఫీ అయ్యిందో? లేదో? తేల్చుకుందామా?' అని సవాల్ విసిరారు. భువనగిరి నియోజకవర్గంలో రుణమాఫీ కాలేదని కాంగ్రెస్ నాయకులను రైతులంతా కలిసి రూమ్‌లో వేసి తాళం వేశారని గుర్తుచేశారు.

### రేషన్‌కార్డు నిబంధనల వల్లే రైతు ఆత్మహత్య

రేషన్‌కార్డ్ నిబంధనలు పెట్టడం వల్లే రైతు సురేందర్‌రెడ్డి ఆత్మహత్య చేసుకున్నాడని, ఇది ముమ్మాటికీ ప్రభుత్వ హత్యేనని హరీశ్ ధ్వజమెత్తారు. రాష్ట్రంలో 50 శాతానికి మించి రుణమాఫీ కాలేదని చెప్పారు. 41 లక్షల మందికి రుణమాఫీ కావాల్సి ఉంటే 20లక్షల మందికే చేశారని, ఇంకా 21 లక్షల మందికి మాఫీ కాలేదని తెలిపారు. రైతులకు వందశాతం పంటల రుణాలు మాఫీ అయ్యేదాకా బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో పోరాటం చేస్తామని చెప్పారు. పంట బీమా, భరోసా కల్పించకపోతే రైతుల తరపున ఆందోళనలు చేస్తామని ప్రకటించారు. కేసీఆర్ ప్రభుత్వం రైతులకు రెండుసార్లు రుణమాఫీ చేసిందని, ప్రతి పంట సాగుకు ముందే రైతుబంధు అందించి రైతులకు దన్నుగా నిలిచిందని గుర్తుచేశారు.

### పది నెలలుగా గ్రామాలకు నిధుల్లేవ్

కాంగ్రెస్ పాలనలో 10 నెలల నుంచి గ్రామ పంచాయతీలకు నిధుల్లేవని హరీశ్‌రావు చెప్పారు. పంచాయతీ కార్యదర్శులు అప్పులు తెచ్చిపెడుతున్నారని, ఒక్క పైసా కూడా పంచాయతీలకు ఇవ్వడం లేదని ప్రభుత్వంపై మండిపడ్డారు. బీఆర్‌ఎస్ హయాంలో ప్రతి నెల పల్లె ప్రగతి ద్వారా నిధులిచ్చి గ్రామాలను అద్భుతంగా తీర్చిదిద్దామని గుర్తుచేశారు. చెక్‌డ్యామ్‌లు, ధాన్యం కొనుగోళ్లు, రైతుబీమాకు ప్రాధాన్యత ఇచ్చిందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా విషజ్వరాలతో ప్రజలు బాధపడుతూ దవాఖానల చుట్టూ తిరుగుతున్నా ప్రభుత్వానికి చీమకుట్టినట్టు కూడా లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఏ ప్రభుత్వ దావాఖానకు వెళ్లినా మందుల కొరత ఉన్నదని చెప్పారు. కుక్కల దాడులు పెరుగుతున్నా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని, ఇది ముమ్మాటికీ ప్రభుత్వ వైఫల్యమేనని మండిపడ్డారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం పడకేసిందని, స్కూల్, హాస్టళ్లలో భోజనం కూడా సరిగా ఉండడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. 10 నెలలవుతున్నా మధ్యాహ్న భోజన నిధులను మంజూరు చేయలేదని వెల్లడించారు. బీజేపీ, కాంగ్రెస్ తెలంగాణ ప్రజలను మోసం చేశాయని ధ్వజమెత్తారు. గ్రామ, పట్టణాలకు ఇంతవరకు ఎంత నిధులు మంజూరు చేశారో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఖమ్మం జిల్లాలో వరద బాధితులను పరామర్శించి సాయం చేసేందుకు వెళ్లిన తమపై కాంగ్రెస్ నాయకులు దాడి చేయడం అప్రజాస్వామ్యమని ఆగ్రహం వ్యక్తంచేశారు. దాడి చేసిన వారిపై కేసులు పెట్టాల్సింది పోయి తమపైనే కేసులు పెట్టారని మండిపడ్డారు. త్వరలోనే ప్రజలు కాంగ్రెస్ సర్కారుకు తగిన బుద్ధి చెప్తారని హరీశ్ హెచ్చరించారు.

## హైడ్రా కూల్చివేతలు ఇలా

| ప్రాంతం | కూల్చివేతల తేదీ/తొలగించినవి | ఆక్రమణలు/ వాటి విస్తీర్ణం (ఎకరాల్లో) |
|---|---|---|
| ఫిలింనగర్ కో ఆపరేటివ్ సొసైటీ | జూన్ 27 / 1 | లోటస్‌పాండ్ పార్కు స్థలం కంపౌండ్ వాల్ /0.16 |
| మన్సురాబాద్/సహస్ర ఎస్టేట్ రోడ్ | 1-7-24/1 | రహదారి ఆక్రమణ/0.2 |
| ఎంపీ, ఎమ్మెల్యే కాలనీ ప్లాన్ నం 315 | 4-7-24/3 | పార్కు స్థలం కబ్జా/0.06 |
| బంజారాహిల్స్, మిథాల నగర్ | 5-7-24/2 | పార్కు స్థలం /1.04 |
| ఫిలింనగర్, బీజేఆర్ నగర్ | 14-7-24/1 | నాలా ఆక్రమణ/ 5 |
| గాజుల రామారం, మహదేవ్‌పూర్ | 21-7-24/1 | పార్కులో నిర్మాణాలు /0.01 |
| గాజుల రామారం, భూదేవిహిల్స్ | 23-7-24 /5 | చెరువు ఆక్రమణ /1.1 |
| జూబ్లీహిల్స్ బేబీలాన్ రెస్టారెంట్ | 27-7-24/1 | ఫుట్‌పాత్‌ల ఆక్రమణ /0.05 |
| ఆమీర్‌పేట నాలా | 3-8-24 /3 | నాలా ఆక్రమణ /0.01 |
| చింతల్ చెరువు, గాజుల రామారం | 6-8-24/54 | చెరువు ఆక్రమణ /3.5 |
| జూబ్లీహిల్స్ నందగిరి హిల్స్ | 9-8-24/16 | పార్కు స్థలం కబ్జా/0.18 |
| రాజేంద్రనగర్,బుమారక్ లేక్ | 10-8-24/45 | చెరువుల్లో నిర్మాణాలు/12 |
| చందానగర్/ఈర్ల చెరువు | 10-8-24/ 3 | అక్రమ నిర్మాణాలు /0.16 |
| బాచుపల్లి/ఎర్రకుంట | 14-8-24/3 | చెరువులో నిర్మాణాలు /0.29 |
| బోడుప్పల్ సర్వే నం 3 | 14-8-24/1 | ప్రభుత్వ స్థలం కబ్జా /0.03 |
| ఖానాపూర్, గండిపేట | 18-8-24/14 | చెరువుల్లో భవనాలు /8.75 |
| గండిపేట/చిలుకూరు | 18-8-24/10 | ఉస్మాన్‌సాగర్ చెరువు పరిధిలో నిర్మాణాలు /6.5 |
| ఎన్ కన్వెన్షన్, తుమ్మిడికుంట చెరువు | 24-8-24/2 | ఎఫ్‌టీఎల్‌లో నిర్మాణాలు / 4.9 |
| మణెమ్మగల్లీ, రామ్‌నగర్ | 30-08-24/3 | తాత్కాలిక షెడ్లు/0.30 |
| అప్పచెరువు,సర్వే నెం,.176,178 | 31-08-24/14 | షెడ్లు/3.2 |
| అమీన్‌పూర్‌చెరువు, సర్వేనెం. 323,324,329 | 08-09-24/24 | షెడ్లు, కాంపౌండ్‌వాల్స్/51.78 |
| సున్నంచెరువు, సర్వే నెం.30, అల్లాపూర్‌సర్వేనెం.10,12,13,14,16, గుట్టల బేగంపేట, మాదాపూర్ | 08-09-24/42 | షెడ్లు, ఆర్‌సీసీ నిర్మాణాలు, బిల్డింగ్స్/10 |
| కత్వాచెరువు, సర్వేనెం.170/3, 170/4, మల్లంపేట, దుండిగల్ | 08-09-24/13 | విల్లాలు/2.50 |
| మొత్తం | కాపాడిన స్థలం | 111 ఎకరాల 72 గుంటలు |

# కలికి మేడ భద్రం.. పేద బతుకు ఛిద్రం

> మొదటిపేజీ తరువాయి...

విమర్శలు వస్తున్నాయి. మొత్తంగా హై'డ్రామా'లో సామాన్యులే సమిధలవుతున్నారని స్వయంగా హైడ్రా గణాంకాలే స్పష్టంచేస్తున్నాయి. ఏర్పాటు నుంచి ఈ నెల 8 వరకు జరిపిన కూల్చివేతలపై హైడ్రా బుధవారం నివేదిక విడుదల చేసింది. చెరువులు, నాలాలు, ప్రభుత్వ ఖాళీ స్థలాలు, జంట జలాశయాల ఎఫ్‌టీఎల్‌లో కట్టడాలు, పార్కు స్థలాల్లో 262 నిర్మాణాలను కూల్చివేసి 111.72 ఎకరాలను స్వాధీనం చేసుకున్నట్టు వెల్లడించింది. ఇందులో కూల్చివేతలు జరిపిన 23 ప్రాంతాల్లో గండిపేట ఖానాపూర్, మల్లంపేట విల్లాలు, నాగార్జున ఎన్ కన్వెన్షన్ మినహా మిగతా చోట్ల సామాన్యుడిపైనే బుల్డోజర్ ప్రతాపం చూపినట్టు తెలుస్తున్నది. కాంగ్రెస్ నేత, కేంద్ర మాజీ మంత్రి పల్లం రాజు సోదరుడు పల్లం ఆనంద్, కావేరీ సీడ్స్ అధినేత జీవీ భాస్కర్‌రావు, బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి సునీల్‌రెడ్డి, ప్రో కబడ్డీ ఓనర్ అనుపమ, సినీ హీరో నాగార్జున తప్ప మిగిలిన పెద్దలు అక్రమంగా కట్టుకున్న భారీ భవంతులు, విల్లాలు, ఫాంహౌస్‌ల వైపు బుల్డోజర్లు వెళ్లలేదు. బాచుపల్లిలో లేక్‌వ్యూ పాయింట్ తీరాన ప్రముఖంగా పేరొందిన బిల్డర్ కడుతున్న హైరైజ్ బిల్డింగ్ వైపు కూల్చివేతలకు వెళ్లిన హైడ్రా బుల్డోజర్లు తిరిగి వెంటనే వెనక్కి వచ్చాయి. ఈ వ్యవహారంలో ప్రభుత్వ పెద్దలకు భారీగా ముడుపులు అందాయన్న చర్చ బిల్డర్లలో జరుగుతున్నది. సున్నం చెరువుకు సంబంధించి ఎలాంటి నోటీసు ఇవ్వకుండా, కనీసం ఇంట్లో ఉన్న సామాన్లను సర్దుకునే సమయం ఇవ్వకుండా సామాన్యుడిని రోడ్డున పడేసి గుండెకోత మిగిల్చిన హైడ్రా..జయభేరి లాంటి ప్రముఖులకు మాత్రం నోటీసులతో సమయమివ్వడం పట్ల ప్రజలు భగ్గుమంటున్నారు. ప్రభుత్వం హైడ్రా పేరుతో హైడ్రామా ఆడుతున్నదని మండిపడుతున్నారు.

### సీఎం, కమిషనర్ తలోమాట

అక్రమిత స్థలాల్లో ఉంటున్న వారిపై హైడ్రా కొరఢా ఝుళిపిస్తుండగా కూల్చివేతలపై హైడ్రా చైర్మన్ అయిన సీఎం రేవంత్‌రెడ్డి, హైడ్రా కమిషనర్ రంగనాథ్ ప్రకటనలు గ్రేటర్ ప్రజలను గందరగోళానికి గురిచేస్తున్నాయి. ఇటీవల సున్నం చెరువు, మల్లంపేట విల్లాల కూల్చివేతల సమయంలో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ స్పందించి సామాన్యులు ఇప్పటికే నివాసం ఉంటున్న గృహాలను కూల్చబోమని ప్రకటించారు. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న కట్టడాలను మాత్రమే తాము కూల్చుతున్నామని స్పష్టం చేశారు. అయితే ఇందుకు విరుద్ధంగా బుధవారం సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారు. ఆక్రమణలను కూల్చే బాధ్యత తానే తీసుకుంటానని, ఆక్రమణలకు పాల్పడిన ఎవ్వరినీ వదిలి పెట్టబోనని, కూల్చివేతలపై స్టే తెచ్చుకున్నా కోర్టులో కొట్లాడుతామని స్పష్టం చేశారు. ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌ను ఆక్రమించిన వారినీ వదిలేది లేదని, ఆక్రమణలను వదిలి గౌరవంగా తప్పుకోండని హెచ్చరించారు. ముఖ్యమంత్రి ఒక మాట..కమిషనర్ మరో మాట మాట్లాడుతుండడం పలు అనుమానాలకు తావిస్తున్నది. వాస్తవంగా జూలై 19న హైడ్రా ఏర్పాటు చేస్తూ జీవో విడుదల చేసిన ప్రభుత్వం నేటికీ విధి విధానాలు ప్రకటించలేదు. పరిధి దాటి హైడ్రా కూల్చివేతలు జరిపింది. జీహెచ్‌ఎంసీ నిబంధనలకు విరుద్ధంగా హైడ్రాను తీసుకొచ్చి చట్టబద్ధత కల్పించలేదు.



### స్వాధీనం సరే..తట్టెడు మట్టి తీయలే

హైడ్రా ఇప్పటి వరకు 262 నిర్మాణాలను కూల్చివేసి 111.72 ఎకరాలు స్వాధీనం చేసుకున్నట్టు వెల్లడించింది. ఇందులో అత్యధికంగా అమీన్‌పూర్ లేక్‌కు సంబంధించి 51.78 ఎకరాలు, రాజేంద్రనగర్ బుమ్రాక్ 12, సున్నం చెరువు 10, గండిపేట లేక్ 8.75, చిల్కూరు 6.5 ఎకరాలతో పాటు మొత్తం 23 ప్రాంతాల్లో భూములను స్వాధీనం చేసుకున్నట్టు స్పష్టం చేసింది. వాస్తవంగా చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్, నాలాల వెంట వెలసిన కట్టడాలను కూల్చివేసిన హైడ్రా, వాటి వ్యర్థాల (డెబ్రీస్)ను ఎక్కడికక్కడే వదిలి వేసింది. కనీసం తట్టెడు చెత్తను కూడా తరలించలేదు. 111 ఎకరాలను స్వాధీనం చేసుకున్నట్టు ప్రకటించిన హైడ్రా.. చెత్త, డెబ్రీస్‌ను ఎత్తివేయకుండానే చెరువులను పరిరక్షించామని చెబుతుండడం విస్తుగొలుపుతున్నది.

# అసైన్డ్ భూమి ఔట్!

> మొదటిపేజీ తరువాయి...

మార్కెట్లో ఏకంగా రూ.570 కోట్ల విలువైన భూముల్ని అగ్గువకు చేజిక్కించుకొని రియల్ ప్రాజెక్టులతో రూ.వేల కోట్లు గడించేందుకు భారీ స్కెచ్ వేసిన ఒక కంపెనీ అనధికారికంగానే ఈ భూములను కొనుగోలు చేస్తున్నది. ఇదంతా అధికార యంత్రాంగానికి తెలిసినా ఎవరికి వారు 'సంతృప్తి'గానే ప్రేక్షకపాత్ర పోషిస్తున్నారనే ఆరోపణలున్నాయి. కొనుగోలు ప్రక్రియ చివరి దశకు చేరుకోవటంతో రెవెన్యూ రికార్డుల్లో లావణి పట్టా భూములను సాధారణ పట్టా భూములకు మార్చేందుకు వేగంగా పావులు కదులుతున్నాయి. ఈ నేపథ్యంలో 'నమస్తే తెలంగాణ' చేపట్టిన విచారణలో నకిలీ ఎన్వోసీని అడ్డుపెట్టుకొని కొందరు ఈ తతంగాన్ని నడిపిస్తున్నట్టు తెలిసింది. మరి ఈ భూములను కాపాడేందుకు రేవంత్ సర్కారు ఏం చర్యలు తీసుకుంటుంది?

***

రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ పరిధి ఖానాపూర్ గ్రామంలోని సర్వే నంబర్ 79లో సుమారు 250 ఎకరాల భూమి ఉన్నది. 1953లో భూ గరిష్ఠ పరిమిత చట్టం అమలులోకి వచ్చింది. అప్పటికే ఖానాపూర్ గ్రామంలో జాగిర్దార్ ఉన్నారు. ఆయనకు ఖానాపూర్‌తో పాటు యాచారం మండలం చింతుల్లలో వందల ఎకరాల భూములు ఉన్నాయి. భూగరిష్ఠ చట్టం రావడంతో ఆయన పేరు మీద ఉన్న వేల ఎకరాల భూమిని ప్రభుత్వానికి అప్పగించారు. ఖానాపూర్‌లోని సర్వే నంబర్ 79 లోని 250 ఎకరాల భూమిని కూడా ప్రభుత్వానికి అప్పగించారు. ఇందులో 60 ఎకరాల భూమిని గ్రామ అవసరాలకు కేటాయించారు. మిగిలిన భూమిని గతంలో జాగిర్దారీ కోరిక మేరకు అప్పటి ప్రభుత్వం ఖానాపూర్‌కు చెందిన 26 మంది భూమిలేని నిరుపేదలకు పంపిణీ చేసింది. ఒక్కొక్కరి పేరిట 7 ఎకరాల భూమిని పంపిణీ చేశారు. దీంతో ఆ రైతుల పేరిట రెవిన్యూ రికార్డుల్లో లావణి పట్టా భూములుగానే నమోదవుతూ వస్తున్నది. ప్రస్తుతం ధరణి రికార్డుల్లో కూడా సదరు 26 మంది రైతుల పేరిట ఈ భూములు లావణి పట్టాగా నమోదయ్యాయి. నిషేధిత జాబితాలోనూ ఈ సర్వే నంబర్ నమోదై ఉన్నది. అంటే ఈ భూములపై క్రయ, విక్రయాలు నిషేధం. అయితే ఈ భూములు హైదరాబాద్–నాగార్జునసాగర్ రాష్ట్ర రహదారికి అతి సమీపంలో... ఫోర్త్ (ప్యూచర్ సిటీ) సిటీకి సైతం సమీపంలోనే ఉండటంతో కొందరి బడా వ్యక్తుల నజర్ ఈ భూములపై పడింది.

### ప్రైవేటు సంస్థ పేరిట కొనుగోలు

ఈ భూములపై కన్నేసిన కొందరు వ్యక్తులు ఆరాధ్య హోలిస్టిక్ ఎల్‌ఎల్‌పీ కంపెనీ పేరుతో కొనుగోలు చేయటం మొదలుపెట్టారు. రైతులను నయానో.. భయానో.. నచ్చజెప్పి అనధికారిక ఒప్పందాలతో ఈ భూములను కొనుగోలు చేశారు. తొలుత 15 లక్షలతో మొదలైన ఈ కొనుగోలు ప్రక్రియ.. ఇప్పుడు ఏకంగా రూ.50 లక్షల వరకు చేరింది. దీనిపై 'నమస్తే తెలంగాణ' విచారణ చేపట్టగా.. 1950లోనే సర్వేనంబర్ 70లోని భూమిని జాగిర్దారీ భూమిగా ప్రకటించినట్టు తేలింది. ఈ మేరకు ఉర్దూలో ఉన్న ఆ ఒప్పంద ప్రతిని ఆంగ్లంలోకి కూడా అనువదించిన ప్రతి లభించింది. 'సర్వే నంబర్ 70లోని లావణి ఖాస్రా పట్టా భూమిని 26 మందికి పంపిణీ చేయడం జరిగింది. ఇది ముఖద్దం పట్వారీ సమక్షంలోనే పూర్తయింది. లేఖ నంబర్ 864, 865 తేది: 28.4.1953 ప్రకారం జమాబంధీ అమలు చేయడం జరిగింది. 1954లో ఆ 26 మంది ఆ భూముల్లో సేద్యం చేసి జొన్నపంట వేశారు. ఈ మేరకు జొన్న పండించినట్టు రికార్డుల్లో నమోదు చేయడం జరిగింది' అని రెవెన్యూ పాత రికార్డుల్లో నమోదై ఉన్నది. కానీ కొంతకాలంగా కొందరు వ్యక్తులు ఆ రైతుల నుంచి నిబంధనలకు విరుద్ధంగా భూములను కొనుగోలు చేశారు.

### 20–30 శాతం రేటుకే హస్తగతం

వాస్తవానికి ఖానాపూర్ గ్రామపరిధిలో పట్టా భూముల విలువ ఎకరా రూ.3 కోట్లకు పైగానే ఉన్నది. కానీ ఇవి లావణి పట్టా కావటంతో తమకు దక్కిందే చాలు అని రైతులు అనుకుంటున్నారు. ఈ క్రమంలో బాట సరిగాలేని భూ ముల రైతులు రూ.12–15 లక్షల వరకు ఎకరా భూమిని విక్రయించగా, కొంత బాట సరిగా, ప్రధాన రహదారికి సమీపంలో ఉన్నవారు ఎకరా రూ.30–50 లక్షల వరకు విక్రయించారు. ఈ మేరకు అనధికారికంగానే ఒప్పందాలు చేసుకున్నారు. లావణి పట్టా అయినందున అధికారికంగా రిజిస్ట్రేషన్ కాకపోవటంతో ప్రస్తుతానికి న్యాయపరంగా ఎలాంటి చిక్కులు లేకుండా ఉండేలా బాండు పేపర్లపై ఒప్పందం చేసుకొని, రైతుల పాసు పుస్తకాలను సదరు కంపెనీ స్వాధీనం చేసుకున్నది. అసైన్డ్ భూముల కొనుగోళ్లకు రైతుల్లో ఒకరికి తెలియకుండా మరొకరికి రియల్ ఎస్టేట్ వ్యాపారులు రేట్లు నిర్ణయిస్తున్నారు. ముందుగా రైతుల ఆధార్ కార్డులను పాత పాస్‌బుక్‌లను తీసుకుని వారి నుంచి అగ్రిమెంట్ చేసుకున్నారు. కొంతమంది రియల్ ఎస్టేట్ బ్రోకర్ల ప్రమేయంతో కొంతమంది రైతులకు ఎక్కువ రేట్లు ఇవ్వగా, మరి కొంతమంది రైతులకు తక్కువ రేట్లు ఇచ్చారు. దీంతో రైతుల మధ్య ప్రస్తుతం ఘర్షణలు చోటుచేసుకుంటున్నాయి.

### హైడ్రా రంగంలోకి దిగుతుందా?

వాస్తవానికి ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ కోసం రేవంత్ ప్రభుత్వం ప్రత్యేకంగా హైడ్రాను ఏర్పాటు చేసింది. ఈ మేరకు హైడ్రా చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో ఉన్న కట్టడాలను కూల్చివేసింది. అదీ ప్రధాన నగరంలోని వాటిపైనే దృష్టిసారించింది. కానీ నగరానికి అతి సమీపంలోని ఇబ్రహీంపట్నం మండలంలోని 190 ఎకరాల ప్రభుత్వ భూమి అనేది సీఎం రేవంత్ రెడ్డి చెప్తున్న ఫ్యూచర్ సిటీకి అతి సమీపంలో ఉన్నది. అంటే భవిష్యత్తులో ఇది ప్రభుత్వానికి, ప్రజాప్రయోజనాలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. మరి.. రేవంత్ సర్కారు అనధికారికంగా జరిగిన ఈ విక్రయాలపై కొరడా ఝుళిపించి సర్కారు భూములను పరిరక్షిస్తుందా? అనేది ప్రశ్న. ముఖ్యంగా ఫోర్త్ సిటీ రానున్నందున ఇలాంటి అక్రమాలు ఇంకా ఎన్నో వెలుగుచూసే అవకాశం ఉన్నది. ఈ క్రమంలో రేవంత్ సర్కారు చిత్తశుద్ధితో ప్రభుత్వ ఆస్తులను పరిరక్షించేందుకు అడుగు ముందుకు వేస్తుందా? అనేది తేలాల్సి ఉన్నది.

### రికార్డులన్నీ మాయం

ఈ సర్వే నంబర్‌కు సంబంధించిన రికార్డులన్నీ ప్రస్తుతం తహసీల్దార్ కార్యాలయంలో అందుబాటులో లేకపోవటం గమనార్హం. విశ్వసనీయ సమాచారం మేరకు ఒక మాజీ పట్వారీ ఇంట్లో వీటికి సంబంధించిన రికార్డులన్నీ ఉన్నట్టు తెలిసింది. వాస్తవానికి ఆది నుంచి లావణి పట్టాగానే రికార్డులు కొనసాగుతున్నప్పటికీ రెండు, మూడు సంవత్సరాల పాటు ఆర్‌వోఆర్‌లో పట్టా భూమిగా నమోదు చేశారు. దీని ఆధారంగానే ఇక ముందు ఆద్యంతం పట్టా భూమిగా రికార్డులను తారుమారు చేసేందుకు స్కెచ్ వేస్తున్నట్టు తెలిసింది. ఈ మేరకు ఇప్పటికే నకిలీ ఎన్వోసీని సృష్టించి, దాని ఆధారంగానే కొనుగోలు ప్రక్రియను పూర్తి చేసినట్టు సమాచారం.

### 1953లో లావుని పట్టాలు పొందిన రైతులు

1. చింతకాయల రామయ్య
2. మాదాసు రామయ్య
3. పడకంటి జంగయ్య
4. మాల జంగయ్య
5. మాదాసు చిన్నయ్య
6. దొంతరమోని కనిగా
7. చేతాల లక్ష్మయ్య
8. జాషువా
9. పంది ఎల్లయ్య
10. పంది రాములు
11. పంది రాజయ్య
12. ముత్తయ్య
13. మల్లయ్య
14. కట్టెల మారయ్య
15. చింతకాయల పెద్ద అచ్చయ్య
16. కావలి దుర్గయ్య
17. వనం మల్లయ్య
18. యాదయ్య
19. కాళ్ల జంగయ్య
20. పుల్లయ్య
21. కిష్టయ్య
22. సత్తయ్య
23. మల్లయ్యతో పాటు మరో ముగ్గురు రైతులకు ప్రభుత్వం అసైన్‌మెంట్ పట్టాలను ఇచ్చింది.








## మంత్రిగారి రాజప్రసాదం...!!

ఇది హిమాయత్‌సాగర్ చెంతన కొలువుదీరిన సాక్షాత్తు రాష్ట్ర రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సౌధం. వాస్తవానికి ఎగువ నుంచి వస్తున్న వరదతో జలాశయంలో నీటిమట్టం పెరిగి నీళ్లు ఇంకా ముందుకు వెళ్లాలి. కానీ వందల టిప్పర్లతో మట్టి నింపడంతో నీళ్లు ముందుకుపోయే పరిస్థితి. అయినప్పటికీ మంత్రివర్యులు, ఆయన సోదరుడి గృహం ఎఫ్‌టీఎల్‌తో పాటు బఫర్‌జోన్‌లోనూ ఉందనేది కండ్ల ముందు కనిపిస్తున్న వాస్తవం. బఫర్‌జోన్‌లో ఉన్నా తన ఇంటిని కూల్చుకోమని మంత్రి పొంగులేటి గతంలోనే సెలవిచ్చారు. కానీ హైడ్రాగానీ, ఇతర అధికారులుగానీ ఇప్పటివరకు అటువైపు కన్నెత్తి చూడటం లేదు.

## ఈ ఎఫ్‌టీఎల్ పరిధి కానపడదే!

ఇది రంగారెడ్డి జిల్లా మంచాల మండల పరిధిలోని కాఘజ్‌ఘట్ గ్రామంలో 25 ఎకరాల విస్తీర్ణంలోని అలీ (అల్ల చెరువు) చెరువు ఎఫ్‌టీఎల్ పరిధి (రెడ్‌మార్క్ ఉన్నది). స్వయంగా హెచ్‌ఎండీఏ అధికారికంగా గుర్తించిన హద్దు ఇది. ఇందులోనే సిరి నేచర్స్ వ్యాలీ రిసార్ట్ ఉండటంతోపాటు ఏకంగా రియల్ వెంచర్ కూడా చేశారు. ఇప్పుడు అందులో విల్లాల నిర్మాణం కూడా జోరుగా సాగుతున్నది. నీటిపారుదల శాఖ గత ఏప్రిల్ నెలలో ఫిర్యాదు చేస్తే పోలీసు శాఖ కేసు నమోదు చేసింది. కానీ అధికారులెవరూ ఈ అక్రమాలపై చర్యలు తీసుకోవడం లేదు. హెచ్‌ఎండీఏ సర్వేనే సదరు ప్రైవేటు సంస్థ ప్రశ్నిస్తూ కోర్టుకు వెళితే మళ్లీ సర్వే చేయమని హైకోర్టు ఆదేశించింది. కానీ సంవత్సరాలవుతున్నా నీటి పారుదల శాఖ సర్వే చేయదు. ఎందుకంటే సర్వే చేస్తే చర్యలు తీసుకోవాలి కదా!



## ఆయనగారి రియల్ దందా!

రంగారెడ్డి జిల్లా మంఖాల్‌లోని మరో రియల్ వెంచర్ ఇది. వర్టెక్స్-కేఎల్‌ఆర్ గిగా సిటీ పేరిట చేసిన ఈ వెంచర్‌లో ఏకంగా రెండు చెరువులు సమిధగా మారాయి. ఎగువన శంషాబాద్ ఎయిర్‌పోర్టుతో పాటు పహాడీషరీఫ్ వైపు నుంచి భారీ వరద పదెకరాల కొత్తకుంటలోకి చేరి.. అక్కడి నుంచి నాలాల ద్వారా దిగువన 60.32 ఎకరాల విస్తీర్ణంలో సూరోని చెరువులోకి వస్తాయి. కానీ కొత్తకుంటలో దాదాపు ఎనిమిది ఎకరాలు, సూరోని చెరువులో సుమారు 30 ఎకరాలకు పైగా ఆక్రమించి ఈ వెంచర్ ఏర్పాటు చేశారు. నాలాలను మట్టితో నింపి డ్రెయిన్ బాక్సులు నిర్మించారు. నీటిపారుదల శాఖ, రెవిన్యూశాఖ అధికారులు వచ్చారు... సర్వే చేసి వెళ్లారు. కానీ ఇప్పటికీ ఎలాంటి చర్య తీసుకోలేదు.

# అవెందుకు కూల్చరు!

# ఇవెందుకు కూలుస్తరు?

- కూలిన ఆశకు ఇదే ఊత కర్ర



సామగ్రిని పక్కకు పెడుతూ తల్లిదండ్రులకు సహకరిస్తున్న చిన్నారులు.

- చెదిరిన గూడు .. గణేశుడే దిక్కు!



ఏ గూడు లేని ఆ చిన్నారులకు వినాయక మండపమే ఆవాసంగా మారింది. సీఎం రేవంత్ రెడ్డి తమ ఆవాసాలను కూల్చేయడంతో ఎక్కడ నిద్దురించాలో తెలియక వినాయక మండపంలోనే సేద తీరుతున్న చిన్నారులు.

- గుడిసె కడితేనే బతుకు సాగేది



- ఒకచో నేలను పవ్వళించు!



పడేసిన పరుపుపైనే సేదతీరుతున్న స్థానికుడు



**పుస్తకాల కోసం చిన్నారి వెతుకులాట**

శిథిలాల కింద పడిన పుస్తకాల కోసం వెతుక్కుంటున్న చిన్నారి. గుంజలను పక్కకు తీస్తూ పుస్తకాలు తీయమని తండ్రికి చెబుతున్న దృశ్యం.

- ఒడువని ముచ్చట..



చెల్లా చెదురైన ఆవాసాలను చూస్తూ కన్నీటి పర్యంతమవుతున్న మహిళలు.

# పేదల బతుకుకు సర్కారు సున్నం

## బడుగుల భవితను కూల్చిన కాంగ్రెస్ బుల్డోజర్

**నాలుగు రోజులుగా సున్నం చెరువు బాధితులకు నరకం.. ఆకలితో అలమటిస్తూ నిలువ నీడలేక ఇబ్బందులు**

**ఆవాసం కోసం పందిరి ఏర్పాటు చేసుకుంటున్న జనం.. రేవంత్‌కు తమ గోస తగులుతుందని శాపాలు**

- **ప్రభుత్వమంటే ఇండ్లు కట్టిస్తది కదా!**

అక్కా.. అమ్మ ఎందుకు ఏడుస్తుంది? మన ఇండ్లు ప్రభుత్వం ఎందుకు కూలగొట్టింది? ఎక్కడైనా ప్రభుత్వం పేదోళ్లకు ఇండ్లు కట్టిస్తుంది కదా? మరి ఇక్కడ ఎందుకు కూలగొట్టింది? మనం పేదోళ్లం కాదా? లేదా ఇప్పుడున్న సర్కార్‌కు దయలేదా? మన చుట్టుపక్కల పెద్దపెద్ద భవంతులు ఉన్నాయి కదా? మరి వాటినెందుకు కూల్చలేదు. గట్టిగా గాలొస్తే కూలే మన రేకుల షెడ్డులపైనే అంతపెద్ద బుల్డోజర్లతో దాడి చేయడమేమిటి? మనం ప్రభుత్వానికి శత్రువులమా?

**- అభినవ్ తన అక్కతో పంచుకున్న సందేహం ఇది**

హైదరాబాద్ సిటీబ్యూరో, సెప్టెంబర్ 11 (నమస్తే తెలంగాణ): ఆకలితో చూస్తున్న బిడ్డలకు ఎలా వండిపెట్టాలో తెలియక నలిగిపోతున్న ఓ తల్లి.. నాన్న నా పుస్తకాలు ఏవి? నేను హోంవర్క్ చేసుకోవాలి? లేకపోతే మా సారు కొడుతాడు? అని అడుగుతున్న ఓ కొడుక్కి ఏం చెప్పాలో తెలియక కుమిలిపోతున్న ఓ తండ్రి.. శత్రుదేశంపై దాడి చేసి సర్వనాశనం చేసినట్టుగా చెదిరిపోయిన గూడును చూసి వేదనపడుతున్న ఓ వృద్ధుడు.. ఇలా ఎవ్వరిని కదిలించినా సమాధానం కన్నీళ్లతోనే వస్తున్నది. మొత్తంగా సున్నం చెరువు భీకర పరిస్థితులు బాధితులను ఇంకా వెంటాడుతున్నాయి. కాంగ్రెస్ బుల్డోజర్లు చేసిన గాయం వారికి సలుపుతూనే ఉన్నది. మాదాపూర్ సున్నం చెరువులోని ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్న నిర్మాణాలను ఈ నెల 8న హైడ్రా భారీ యంత్రాలతో కూల్చివేసింది. ముందస్తు నోటీసులు ఇవ్వకుండా, కనీసం ఇంట్లో సామగ్రి బయటకు తీసుకునే సమయమైనా ఇవ్వకుండా వర్షంలో అందరినీ కట్టుబట్టలతో బయటకు పంపి కూల్చివేతలు చేపట్టింది. పండగపూట వర్షంలో పిల్లలను తీసుకొని ఎటుపోవాలో దిక్కుతోచక బాధితులు బిక్కుబిక్కుమంటూ కన్నీరుమున్నీరయ్యారు. మహిళ సహ ఇద్దరు ఒంటిపై కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకునే యత్నం చేశారు. 10-15 ఏండ్ల నుంచి రేకు షెడ్డు వేసుకొని ఉంటున్న నిరుపేదల గూడును సైతం నేలమట్టం చేశారు. రీసర్వే చేయాలని కోర్టు చెప్పినా అధికారులు పట్టించుకోలేదు.

**15 ఏండ్లుగా నివాసం**

గొప్ప గొప్ప భవంతులేమీ కట్టుకోలేదు. గట్టిగా గాలొస్తే కుప్పకూలే రేకుల షెడ్డులే వారి ఆవాసాలు. కిరాయి కట్టే స్థోమతలేక నాలుగు గుంజలు పాతుకుని రేకులే కప్పులుగా గుడిసెలు నిర్మించుకున్నారు. పదిహేనేండ్ల నుంచి నివాసం ఉంటున్నారు. వీళ్లంతా పెద్ద భవంతుల యజమానుల ఇండ్లల్లో ఇంటి పని, కూలి పని చేసేటోళ్లే. రెక్కాడితే గానీ డొక్కాడని జీవితాలు. వచ్చిన ఆ కాస్త ఆదాయంలోనే ఇంటిల్లిపాది సంతోషంగా గడపటం నేర్చుకున్న మనుషులు. ఇలాంటి బక్కపల్చని బతకులపై కాంగ్రెస్ బుల్డోజర్లు విరుచుకుపడ్డాయి. ఇన్నేండ్లు అక్కడి నేలతో, ఇంటితో మెలేసుకున్న బంధాలను ఆ బుల్డోజర్లు తెంపేశాయి. ఈ వికృత చర్య ఫలితంగా నాలుగు రోజులుగా సున్నం చెరువు బాధితులు బిక్కుబిక్కుమంటూ కూలిన గోడలు, రేకుల షెడ్డుల మధ్యనే జీవనం సాగిస్తున్నారు.

**బరువెక్కిన గుండె**

రేవంత్ సర్కార్ చేసిన బుల్డోజర్ల యుద్ధంలో చితికిపోయిన ఆ కుటుంబాల చిన్నారులు వినాయక మండపాల్లో నిద్దురపోతున్నారు. ఈ దృశ్యాలు అందరిని కలచివేస్తున్నాయి. అంత కష్టాల్లోనూ తాను అపురూపంగా చూసుకుంటున్న పిల్లిని ఆప్యాయంగా హత్తుకుంటూ ఒడిలో కూర్చోబెట్టుకున్నదో చిన్నారి. ఈ దృశ్యం చూస్తే ఎవ్వరి కండ్లు అయినా చమ్మగిల్లకమానవు. తనకే గూడు లేక బయట ఉండే పరిస్థితిలోనూ మూగజీవికి తానున్నాననే భరోసానిచ్చిన ఆ చిట్టి గుండె ధైర్యం ఎంతో గొప్పదో కదా! కూలిపోయిన శిథిలాల కింద కొంతమంది పిల్లలు పుస్తకాలు వెతుక్కుంటున్న దృశ్యాలు అక్కడి హృదయ విదాకర పరిస్థితులను కండ్లకు కడుతున్నాయి. రాకాసి ప్రభుత్వం చేసిన గాయం మాన్పించే చేతుల కోసం వేడుకుంటున్నాయి. సున్నం చెరువుల బాధితుల కష్టాలు చూసిన అందరూ హైడ్రా చర్యలపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సీఎం రేవంత్ రెడ్డి తీరుపై విమర్శలు గుప్పిస్తున్నారు. హైడ్రా నిర్వచనమే ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ. అలాంటిది చెరువుల పక్కన ఉన్నాయని పేదల ఇండ్లు కూల్చేస్తున్న సర్కారు.. పెద్ద పెద్ద భవంతులను మాత్రం ఎందుకు కూల్చటం లేదు? అన్న ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి.



*దుండిగల్ మున్సిపాలిటీ పరిధి లోని మల్లంపేట కత్వా చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో శ్రీలక్ష్మీ శ్రీనివాస కన్‌స్ట్రక్షన్స్ సంస్థ నిర్మించిన 13 విల్లాలను హైడ్రా నేలమట్టం చేసింది. భారీ పోలీసు బందోబస్తు మధ్య ఉదయం ఆరు గంటలకు మొదలైన కూల్చివేతలు రాత్రి ఎనిమిదిన్నర వరకు కొనసాగాయి. కనీసం ఇంట్లో ఫర్నిచర్ తీసుకునేందుకు కూడా అధికారులు సమయం ఇవ్వలేదు. కేవలం ఎఫ్‌టీఎల్ పరిధిలోని నిర్మాణాలనే కూల్చివేస్తామని చెప్పిన హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ బఫర్‌జోన్‌లోని నిర్మాణాలను ఎందుకు కూల్చివేశారంటూ బాధితులు ప్రశ్నించినా సమాధానం చెప్పే వారు లేరు. తమకు న్యాయం చేయండంటూ బాధితులు రంగనాథ్‌తో సమావేశమైతే... బిల్డర్‌పై కేసు వేసుకోండి! అని ఆయన ఉచిత సలహా ఇచ్చారు.*

## కూల్చివేతలు ఆపండి

**దుండిగల్ మండలంలో నిర్మాణాలపై హైకోర్టు**

హైదరాబాద్, సెప్టెంబర్ 11 (నమస్తే తెలంగాణ): మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా, గండిమైసమ్మ-దుండిగల్ మండలం, మల్లంపల్లి గ్రామంలో నిర్మాణాలు పూర్తయిన విల్లాలను కూల్చరాదని హైకోర్టు ఇటీవల ప్రభుత్వానికి మధ్యంతర ఆదేశాలు జారీచేసింది. మల్లంపల్లి గ్రామ సర్వే నంబర్ 170/4లోని విల్లాలను కూల్చరాదని జిల్లా కలెక్టర్, దుండిగల్ ఎస్‌హెచ్‌ఓ, జిల్లా నీటిపారుదల శాఖ డీఈలను ఆదేశించింది. తదుపరి విచారణ జరిగే ఈ నెల 23వ తేదీ వరకు యథాతథ స్థితిని కొనసాగించాలని ఈ నెల 9న జస్టిస్ కే లక్ష్మణ్ ఆదేశాలు జారీ చేశారు మొత్తం 90 విల్లాల్లో 15 విల్లాలను ఈ నెల 8న కూల్చివేయడంతో మిగిలిన వాటిని కూల్చకుండా ఉత్తర్వులు జారీచేయాలని కోరుతూ లక్ష్మీ శ్రీనివాస కన్‌స్ట్రక్షన్స్ భాగస్వామి జీ కస్తూరిభాయ్ పిటిషన్ దాఖలు చేశారు.

## ఎన్‌హెచ్‌ఆర్సీకి బాధితుల ఫిర్యాదు

హైదరాబాద్ సిటీబ్యూరో, సెప్టెంబర్ 11 (నమస్తే తెలంగాణ): హైడ్రా చేతిలో ఇండ్లు నేలమట్టమైన మాదాపూర్ సున్నంచెరువు ప్రాంతంలోని సరోజినీనాయుడునగర్‌కు చెందిన పేదలు జాతీయ మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయించారు. గత పదిహేనేండ్లుగా గుడిసెలు వేసుకొని నివాసం ఉంటున్న తమకు ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా ప్రభుత్వం ఈ నెల 8న తమ ఇండ్లను కూల్చివేసిందని ఫిర్యాదుచేశారు. తెలంగాణ ప్రభుత్వం హైడ్రా అధికారులతో, పోలీసు బందోబస్తు మధ్య తమ గుడిసెలు కూల్చివేసిందని బాధితులు వీ వెంకటేశ్, బాడిగ రాజు, ఎం ఆంజనేయులు, వీ తార, నరేశ్ కమిషన్ దృష్టికి తెచ్చారు. తమ సామాన్లు, విలువైన వస్తువులు, చివరకు పిల్లల పుస్తకాలను తీసుకునే సమయం కూడా హైడ్రా అధికారులు ఇవ్వలేదని తెలిపారు. తమ నివాసాల కూల్చివేతల తర్వాత నీడ, ఆహారం, తాగడానికి మంచినీరు కోసం ఎదురుచూశామని, కానీ ప్రభుత్వం ఎలాంటి సహాయ చర్యలు చేపట్టలేదని ఆవేదన వ్యక్తంచేశారు. తగిన ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకుండా నివాసితుల ఇండ్లను కూల్చివేయడం.. రాజ్యాంగబద్ధంగా జీవించే హక్కును కాలరాయడమేనని పేర్కొన్నారు. ఇక్కడ మానవ హక్కుల ఉల్లంఘన స్పష్టంగా జరిగిందని, గుడిసెల కూల్చివేతల కారణంగా నష్టపోయిన పేదలకు ప్రభుత్వం తక్షణ నష్టపరిహారాన్ని అందించాలని, పునరావాసం కోసం మరొక ప్రాంతంలో ఇండ్ల స్థలాలిచ్చి గృహ నిర్మాణాలకు ఆర్థిక సాయం చేయాలని కోరారు. గుడిసెల కూల్చివేతల అనంతరం పోలీసులు బాధితులపై పెట్టిన కేసులను ఉపసంహరించుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. పేదల నుంచి ఫిర్యాదు నం. 14820/IN/2024 అందినట్టు జాతీయ మానవ హక్కుల కమిషన్ ధ్రువీకరించింది.

## హైడ్రా పనితీరుభేష్

**ఏపీ డిప్యూటీ సీఎం పవన్ ప్రశంసలు**

**సీఎంఆర్‌ఎఫ్‌కు కోటి చెక్కు అందజేత**


హైదరాబాద్, సెప్టెంబర్ 11(నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌లో హైడ్రా పనితీరు బాగుందని ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ప్రశంసించారు. జూబ్లీహిల్స్ నివాసంలో సీఎం రేవంత్‌రెడ్డిని బుధవారం కలిశారు. వరద బాధితుల సహాయార్థం రూ.కోటి చెక్కును సీఎంకు పవన్ అందజేశారు. ఈ సందర్భంగా హైడ్రా విధి విధానాలపై పవన్ ఆరా తీశారు. ఎన్ కన్వెన్షన్ కూల్చిన వెంటనే నాగబాబు స్పందించడం, తాజాగా హైడ్రా చర్యలను పవన్ ప్రశంసించడంపై సినీవర్గాల్లో తీవ్ర చర్చకు దారితీసింది.

## స్తంభించిన హెచ్‌ఎండీఏ ఆన్‌లైన్ సేవలు

హైదరాబాద్ సిటీబ్యూరో, సెప్టెంబర్ 11 (నమస్తే తెలంగాణ) : హెచ్‌ఎండీఏ పరిధిలో ఆన్‌లైన్ సేవలు స్తంభించిపోయాయి. స్టేట్ డాటా సెంటర్‌లో తలెత్తిన టెక్నికల్ సమస్యల కారణంగా ఆన్‌లైన్ సేవలు నిలిచిపోయి దరఖాస్తుదారులు ఇబ్బంది పడ్డారు. హైడ్రా కూల్చివేతల నేపథ్యంలోనే వెబ్‌సైట్‌కు సందర్శకుల తాకిడి పెరిగి హెచ్‌ఎండీఏ కోర్ వెబ్‌సైట్‌పై ప్రభావం పడినట్టు వెల్లడైంది. హెచ్‌ఎండీఏ, లేక్స్ వెబ్‌సైట్ మంగళవారం మధ్యాహ్నం నుంచి నిలిచిపోగా బుధవారం సాయంత్రం నాటికి క్రాష్ అయిందని తెలిసింది. కనిపించకుండా పోయిన హెచ్‌ఎండీఏ వెబ్‌సైట్‌ను వెతికిపెట్టాలని డీజీపీని పౌర హక్కుల నేత లుబ్నా సార్వత్ కోరారు.

## ‘ప్రెస్‌వు’ ఐ డ్రాప్స్‌కు అనుమతి రద్దు

- ఈ డ్రాప్స్‌తో కళ్లద్దాల అవసరం తగ్గుతుందని ప్రకటించిన కంపెనీ
- ప్రకటన సరైనది కాదన్న డీసీజీఐ
- గతంలో ఇచ్చిన అనుమతి రద్దు




న్యూఢిల్లీ, సెప్టెంబర్ 11: ముంబైకు చెందిన ఎన్టాడ్ ఫార్మాస్యూటికల్స్ ఇటీవల ఆవిష్కరించిన ‘ప్రెస్‌వు’ ఐ డ్రాప్స్‌కు డీసీజీఐ అనుమతి రద్దు చేసింది. ఈ ఐ డ్రాప్స్‌కు డీసీజీఐ ఆగస్టులో అనుమతి ఇచ్చింది. ప్రెస్బియోపియాతో బాధపడుతున్న వారు తమ ఐ డ్రాప్స్ వాడితే కళ్లద్దాల అవసరం తగ్గుతుందని ఈ కంపెనీ ప్రకటించింది. ‘రీడింగ్ గ్లాసెస్ అవసరాన్ని తగ్గించేందుకు భారత్‌లో తయారు చేసిన మొదటి ఐ డ్రాప్’ అని వెల్లడించింది. ఈ ప్రకటనపై వివరణ ఇవ్వాలని డీసీజీఐ సెప్టెంబర్ 4న కంపెనీని ఆదేశించింది. ప్రెస్బియోపియా చికిత్సకు భారత్‌లో ఇప్పటివరకు ఏ ఐ డ్రాప్స్‌కు అనుమతి లేనందున ఈ ప్రకటన చేసినట్టు కంపెనీ వివరణ ఇచ్చింది. అయితే, కళ్లద్దాల అవసరాన్ని తగ్గించేందుకు ఈ ఐ డ్రాప్స్ పని చేస్తాయని చెప్పుకోవడానికి అనుమతి లేదని పేర్కొన్న డీసీజీఐ, దాని అనుమతిని రద్దు చేసింది. దీనిని కోర్టులో సవాల్ చేస్తామని సంస్థ సీఈఓ నిఖిల్ కే మసూర్కర్ తెలిపారు.

### రాహుల్ వ్యాఖ్యలకు
## ఉగ్రవాది పన్నూ మద్దతు

- మా ఖలిస్థాన్ డిమాండ్‌ను సమర్థించేలా ఉన్నాయి: పన్నూ
- రాహుల్ వ్యాఖ్యలకు నిరసనగా ఢిల్లీలో సిక్కుల ఆందోళన
- ఇల్హాన్ ఒమర్‌తో రాహుల్ గాంధీ సమావేశంపైనా వివాదం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 11: ‘భారత్‌లో ఓ సిక్కు టర్బన్, కడెం ధరించేందుకు, గురుద్వారాకు వెళ్లేందుకు అనుమతి ఉంటుందా అనే దానిపై పోరాటం జరుగుతున్నది’ అంటూ కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలను ఖలిస్థానీ ఉగ్రవాది, సిక్స్ ఫర్ జస్టిస్ సహ వ్యవస్థాపకుడు గురుపత్వంత్ సింగ్ పన్నూ సమర్థించారు. అమెరికా పర్యటనలో భాగంగా వర్జీనియాలో జరిగిన ఓ కార్యక్రమంలో సోమవారం రాహుల్ ఈ వ్యాఖ్యలు చేశారు. రాహుల్ వ్యాఖ్యలపై స్పందించిన పన్నూ.. భారత్‌లో సిక్కులకు ఉన్న ముప్పుపై రాహుల్ చేసిన వ్యాఖ్యలు ధైర్యంతో, మార్గదర్శకంగా చేసినట్టు ఉన్నాయని పేర్కొన్నారు. భారత్‌లో 1947 నుంచి సిక్కులు ఎదుర్కొంటున్న వాస్తవిక పరిస్థితులను చాటేలా రాహుల్ వ్యాఖ్యలు ఉన్నాయని, తమ ఖలిస్థాన్ ఏర్పాటు డిమాండ్‌ను సమర్థిస్తున్నాయని పేర్కొన్నారు. కాగా, రాహుల్ వ్యాఖ్యలను నిరసిస్తూ బుధవారం ఢిల్లీలోని ఆయన నివాసం వద్ద సిక్కులు ఆందోళనకు దిగారు.

**భారత వ్యతిరేకితో సమావేశమా?**

అమెరికా పర్యటనలో భాగంగా అక్కడి హౌజ్ ఆఫ్ రిప్రజెంటేటీవ్స్ సభ్యురాలు ఇల్హాన్ ఒమర్‌తో రాహుల్ గాంధీ సమావేశం కావడం దుమారం రేపుతున్నది. తరచూ భారత వ్యతిరేక వ్యాఖ్యలు చేస్తూ, అమెరికా చట్టసభలో భారత్‌కు వ్యతిరేకంగా తీర్మానాలు ప్రవేశపెట్టే ఇల్హాన్‌తో రాహుల్ సమావేశం కావడాన్ని బీజేపీ తీవ్రంగా తప్పుబట్టింది. 2022 ఏప్రిల్‌లో ఆమె పీఓకేలో పర్యటించి, పాక్ నేతలతో భేటీ అయిన విషయాన్ని బీజేపీ నేత షెహ్‌జాద్ పూనావాలా గుర్తు చేశారు. ఆమె ఆర్టికల్ 370 రద్దును, ఎన్ఆర్‌సీని వ్యతిరేకించారని పేర్కొన్నారు. అనేకసార్లు భారత్‌కు వ్యతిరేకంగా నిలిచిన ఇల్హాన్ ఒమర్‌ను రాహుల్ ఎందుకు కలవాల్సి వచ్చిందని, బీజేపీ విరోధి అయితే దేశ విరోధి అయినా కలుస్తారా అని ఆయన ప్రశ్నించారు.

## ఎస్‌ఎఫ్‌జేపై నిషేధం మరో ఐదేండ్లు పొడిగింపు

న్యూఢిల్లీ: ఖలిస్థాన్ అనుకూల సిక్స్ ఫర్ జస్టిస్ (ఎస్‌ఎఫ్‌జే)పై నిషేధాన్ని కేంద్ర ప్రభుత్వం మరో ఐదేండ్లు పొడిగించింది. దేశ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నందుకు ఈ సంస్థపై ఐదేండ్ల క్రితం నిషేధం విధించింది. పంజాబ్, తదితర చోట్ల దేశ సమగ్రత, భద్రతలకు విఘాతం కలిగించే కార్యకలాపాలను కొనసాగిస్తున్నందుకు ఈ సంస్థపై నిషేధాన్ని మరో ఐదేండ్లు పొడిగించినట్లు కేంద్ర హోం శాఖ బుధవారం తెలిపింది.

### వాల్మీకి స్కామ్ నిధులతో
# కాంగ్రెస్ ప్రచారం!

- కర్ణాటక కుంభకోణంలో దారిమళ్లిన సొమ్ము హైదరాబాద్‌కు
- తెలంగాణలో లోక్‌సభ ఎన్నికలకు మద్యం కొనుగోళ్లు
- ఈడీ చార్జ్‌షీట్‌లో వెలుగులోకి వచ్చిన కీలక విషయాలు
- మాజీ మంత్రి నాగేంద్ర పీఏ విజయ్ ఫోన్‌లో ఆధారాలు



బెంగళూరు, సెప్టెంబర్ 11: కర్ణాటక వాల్మీకి కార్పొరేషన్ స్కామ్‌లో కీలక విషయాలు వెలుగు చూస్తున్నాయి. గిరిజనుల సంక్షేమం కోసం ఉపయోగించాల్సిన నిధులతో తెలంగాణ కాంగ్రెస్ కోసం మద్యం కొనుగోళ్లు జరిగాయని తెలుస్తున్నది. ఎన్నికల ప్రచారానికీ ఈ నిధులను వినియోగించినట్టు సమాచారం. ఈ మేరకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) మంగళవారం ప్రజాప్రతినిధుల కోర్టులో దాఖలు చేసిన చార్జ్‌షీట్‌లో కీలక అంశాలు ఉన్నట్టు ఓ జాతీయ మీడియా సంస్థ కథనం ప్రచురించింది. దీని ప్రకారం.. కర్ణాటక మాజీ మంత్రి, కాంగ్రెస్ కీలక నేత బీ నాగేంద్ర వ్యక్తిగత సహాయకుడు విజయ్ కుమార్ గౌడ మొబైల్ ఫోన్‌లో దొరికిన ఆధారాలతో ఈ బండారం బయటపడింది. కర్ణాటక మహర్షి వాల్మీకి షెడ్యూల్డ్ ట్రైబ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నుంచి దారి మళ్లించిన డబ్బుల్లో దాదాపు రూ.20 కోట్లు తెలంగాణకు వచ్చాయి. ఈ డబ్బులతో లోక్‌సభ ఎన్నికల సమయంలో తెలంగాణలో మద్యం కొనుగోళ్లు జరిగాయి. ఎన్నికల ప్రచారానికీ ఈ డబ్బులను వినియోగించారు. ఈ స్కామ్‌లో హైదరాబాద్‌కు చెందిన బిల్డర్ సత్యనారాయణ వర్మ కీలకంగా వ్యవహరించారు. కాగా, సత్యనారాయణ వర్మకు తెలంగాణకు చెందిన ఇద్దరు కాంగ్రెస్ కీలక నేతలు సన్నిహిత సంబంధాలు ఉన్నాయనే ప్రచారం జరుగుతున్నది.

**ఈడీ చేతికి పక్కా ఆధారాలు**

వాల్మీకి కార్పొరేషన్ స్కామ్‌ను కర్ణాటక ప్రభుత్వం సిట్ ద్వారా విచారించింది. ఈ స్కామ్‌లో మాజీ మంత్రి బీ నాగేంద్ర పాత్రనే లేదని సిట్ చార్జ్‌షీట్ దాఖలు చేసింది. అయితే, ఇదే కేసును దర్యాప్తు చేసిన ఈడీ మాత్రం ఈ కుంభకోణంలో అసలు విషయాలను బయటపెట్టింది. ఈ మేరకు 5,114 పేజీల చార్జిషీట్‌ను దాఖలు చేసింది. ఇందులో 15 మంది సాక్షుల స్టేట్‌మెంట్‌లను సైతం పొందుపరిచింది. నాగేంద్ర, సత్యనారాయణ వర్మతో పాటు తెలంగాణకు చెందిన ఇటకరి సత్యనారాయణ, కార్పొరేషన్ మాజీ ఎండీ జేజీ పద్మనాభ సహా 20 మంది పేర్లను చార్జిషీట్‌లో ప్రస్తావించింది.

### కాంగ్రెస్ ఖర్చు చేసింది
## వాల్మీకి స్కామ్ సొమ్మే

- పార్లమెంటు ఎన్నికలకు వాడుకుంది
- నిందితులను కఠినంగా శిక్షించాలి
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



హైదరాబాద్, సెప్టెంబర్ 11 (నమస్తే తెలంగాణ): కర్ణాటక వాల్మీకి స్కామ్ సొమ్మునే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఖర్చు చేసిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. వాల్మీకి స్కామ్‌పై తాము మొదటి నుంచి చెప్తున్నదే ఇప్పుడు నిజమని తేలిందన్నారు. గిరిజనుల బాగు కోసం ఖర్చు చేయాల్సిన సొమ్మును ఎన్నికల ప్రచారం కోసం వాడుకున్న కాంగ్రెస్ పార్టీ నేతలను శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. వాల్మీకి కుంభకోణంలో కాంగ్రెస్ నేత, కర్ణాటక మాజీ మంత్రి బీ నాగేంద్రనే కీలక సూత్రధారి అని ఈడీ తన చార్జిషీట్‌లో నిర్ధారించిన విషయాన్ని ఆయన ఈ సందర్భంగా ఉటంకించారు. కర్ణాటక మహర్షి వాల్మీకి షెడ్యూల్డ్ ట్రైబ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్‌కు చెందిన రూ.187 కోట్లు అప్పటి కాంగ్రెస్ మంత్రి చేతులమీదుగా దారిమళ్లాయని పేర్కొన్నారు. ఆ స్కామ్‌లో ప్రధాన నిందితుడు సత్యనారాయణ వర్మ తెలంగాణకు చెందిన ఇద్దరు కీలక కాంగ్రెస్ నేతలకు అత్యంత సన్నిహితుడని ఆరోపించారు. సత్యనారాయణ వర్మ వ్యాపారంలోనూ కాంగ్రెస్ నేతలు భాగస్వాములుగా ఉన్నట్టు అనుమానాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ కుంభకోణంలో ఇంకా అనేక మంది కాంగ్రెస్ పార్టీకి చెందిన పెద్దలు ఉన్నారనేది ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదని అన్నారు. ఈ కుంభకోణంపై దర్యాప్తు సంస్థలు లోతుగా విచారించి నిజానిజాలను నిగ్గుతేల్చాలని, దోషులను కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు.

**అత్యాచార నిందితులకు మద్దతిచ్చిన వ్యక్తికి సీటా?**

దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన కథువా అత్యాచారం కేసులో నిందితులకు మద్దతుగా నిలిచిన లాల్‌సింగ్ అనే వ్యక్తికి కాంగ్రెస్ అసెంబ్లీ టికెట్ ప్రకటించటం సిగ్గుచేటని కేటీఆర్ మండిపడ్డారు. నారీ న్యాయ్ అంటూ గొప్పలు చెప్పుకునే కాంగ్రెస్ పార్టీ రేపిస్టులను సమర్థించిన వ్యక్తికి సీటు ఎలా కేటాయిస్తుందని ప్రశ్నించారు. కథువా అత్యాచారాన్ని సమర్థించిన వ్యక్తికి సీటు కేటాయించి, అదే ఘటనలో బాధితుల తరపున పోరాడుతున్నట్టు కాంగ్రెస్ ఎలా చెప్పుకుంటుందని నిలదీశారు.

## సీఎం పదవి ఖాళీగా లేదు

- *పూర్తి కాలం నేనే సీఎంగా ఉంటా*
- *సీఎం సిద్ధరామయ్య స్పష్టీకరణ*

*బెంగళూరు: ముడా కుంభకోణం, ఇతర అవినీతి ఆరోపణల నేపథ్యంలో తనను పదవి నుంచి తొలగిస్తారని జరుగుతున్న ప్రచారాన్ని కర్ణాటక సీఎం సిద్ధరామయ్య ఖండించారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి పదవి ఖాళీగా లేదని, ఎలాంటి సందేహం లేకుండా తానే పూర్తి కాలం ఈ పదవిలో కొనసాగుతానని ఆయన స్పష్టం చేశారు. ఇటీవలి కాలంలో సిద్ధరామయ్యను తొలగిస్తారని వార్తలు రావడంతో ఆ పదవిని చేపట్టడానికి సిద్ధంగా ఉన్నామని ఇప్పటికే పలువురు కాంగ్రెస్ నేతలు బహిరంగంగా తమ కోరికను వ్యక్తం చేశారు. దీనిపై సిద్ధూ స్పందిస్తూ ‘ఎవరూ ఎలాంటి ప్రకటనా ఇవ్వలేదు. ఎవరూ తాము ముఖ్యమంత్రిని అవుతామని ప్రకటించలేదు. అయినా సీఎం పదవి ఖాళీగా లేదు. అలాంటప్పుడు ఎవరైనా ముఖ్యమంత్రి అవుతామని ఎందుకు అంటారు. అందరూ చెప్పేదేమిటంటే సిద్ధరామయ్యే ముఖ్యమంత్రిగా కొనసాగుతారు’ అని పేర్కొన్నారు.*



**సీజేఐ జస్టిస్ చంద్రచూడ్ నివాసంలో గణపతి పూజకు ప్రధాని మోదీ హాజరయ్యారు. కార్యనిర్వాహక, న్యాయ వ్యవస్థ మధ్య అధికారాల విభజన విషయంలో సీజేఐ రాజీ పడ్డారని, సీజేఐ స్వతంత్రతపై నమ్మకం పోయిందని లాయర్ ఇందిరా జైసింగ్ విమర్శించారు.**

## భారత్‌లో 1000 మంది ఉద్యోగులపై శాంసంగ్ వేటు!
### ప్రపంచవ్యాప్తంగా 30% మందికి ఉద్వాసన

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 11: ప్రముఖ ఎలక్ట్రానిక్ సంస్థ శాంసంగ్ పెద్దయెత్తున ఉద్యోగులను తొలగించడానికి ప్రణాళిక సిద్ధం చేసింది. ఈ ఏడాది చివరి నాటికి ప్రపంచవ్యాప్తంగా 30 శాతం మంది ఉద్యోగులను ఇంటికి పంపించేయడానికి నిర్ణయించినట్టు రైటర్స్ సంస్థ వెల్లడించింది. అమెరికా, యూరప్, ఆసియా, ఆఫ్రికా రీజియన్స్‌లోని సేల్స్, మార్కెటింగ్, అడ్మినిస్ట్రేషన్ విభాగాల సిబ్బందిని ఎక్కువగా తొలగించే అవకాశం ఉంది. భారత్‌లో వెయ్యి మందికి ఉద్వాసన పలకవచ్చు. ఈ తొలగింపులు ఈ ఏడాది ఆఖరుకు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. కాగా, దీనిపై శాంసంగ్ ఉన్నతాధికారి ఒకరు మాట్లాడుతూ సిబ్బంది సర్దుబాటు సహజ ప్రక్రియేనని, పని సామర్థ్యం పెంచడానికే తాము ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. స్మార్ట్‌ఫోన్‌లు, టీవీలు, గృహోపకరణాలు, మెమరీ చిప్స్ వంటివి తయారు చేసే అగ్రగామి సంస్థ శాంసంగ్‌లో ప్రపంచ వ్యాప్తంగా 2,67,800 మంది సిబ్బంది ఉన్నారు.

### 70 ఏండ్లు పైబడిన వారికీ
## ఆయుష్మాన్ భారత్

- ఆదాయంతో సంబంధం లేకుండా అందరికీ వర్తింపు
- ఈవీల ప్రోత్సాహకానికి 10 వేల కోట్లతో పీఎం ఈడ్రైవ్
- కేంద్ర మంత్రివర్గం నిర్ణయాలు



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 11: దేశంలో 70 ఏండ్లు పైబడిన అందరికీ ఆయుష్మాన్ భారత్ ప్రధాన మంత్రి జన్ ఆరోగ్య యోజన వర్తింపజేయాలని కేంద్ర మంత్రివర్గం నిర్ణయించింది. బుధవారం మంత్రివర్గ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. ఆదాయంతో సంబంధం లేకుండా 70 ఏండ్ల వయసు పైబడిన అందరికీ ఏడాదికి రూ.5 లక్షల వరకు ఉచిత వైద్య సేవలను అందించనున్నట్టు ఆయన తెలిపారు. దీని ద్వారా 4.5 కోట్ల కుటుంబాలు లబ్ధి పొందుతాయని చెప్పారు.

**హైడ్రోపవర్ ప్రాజెక్టుల నిర్మాణానికి 12వేల కోట్లు**

ఎలక్ట్రిక్ బస్సులు, అంబులెన్సులు, ట్రక్కులు సహ ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని ప్రోత్సహించేందుకు రూ.10,900 కోట్లతో రెండేండ్ల పాటు పీఎం ఈ-డ్రైవ్ పథకాన్ని అమలు చేయాలని క్యాబినెట్ నిర్ణయించినట్టు తెలిపారు. దేశంలో రానున్న ఎనిమిదేండ్లలో 31,350 మెగావాట్లతో నూతన జల విద్యుత్తు కేంద్రాల నిర్మాణానికి రూ.12,461 కోట్లు కేటాయించాలని క్యాబినెట్ నిర్ణయించినట్టు చెప్పారు.

**నాలుగో విడత గ్రామ్ సడక్ యోజన**


2024-25 నుంచి 2028-29 ఆర్థిక సంవత్సరాల మధ్యకాలంలో ప్రధానమంత్రి గ్రామ్ సడక్ యోజన-4 అమలు చేయాలని క్యాబినెట్ నిర్ణయించినట్టు అశ్వినీ వైష్ణవ్ చెప్పారు. దీని ద్వారా 25 వేల ఆవాసాలకు రోడ్డు సదుపాయం కల్పించేందుకు 62,500 కిలోమీటర్ల మేర రోడ్లను, కొత్త వంతెనలను నిర్మించనున్నట్టు తెలిపారు. మొత్తం రూ.70,125 కోట్ల వ్యయంతో చేపట్టనున్న ఈ పథకంలో రూ.49,087 కోట్లు కేంద్రం భరిస్తుందని, మిగతాది రాష్ట్రాలు భరించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

## విదేశీ విద్యపై సంపన్నుల మోజు

ముంబై: భారత్‌లోని సంపన్న, ఎగువ మధ్యతరగతి వర్గాలలో నాలుగింట మూడొంతుల మంది తమ పిల్లలను విద్యాభ్యాసం కోసం విదేశాలకు పంపుతున్నారని ఓ సర్వే నివేదిక వెల్లడించింది. కోటి రూపాయల నుంచి రూ.17 కోట్ల మధ్య పెట్టుబడి మిగులు ఉన్న 1,456 మంది సంపన్నులను ‘గ్లోబల్ క్వాలిటీ ఆఫ్ లైఫ్ 2024’ సంస్థ గత మార్చి నెలలో సర్వే చేసింది. వీరిలో 78 శాతం మంది తమ పిల్లలను చదువుకోసం విదేశాలకు పంపేందుకు ఆసక్తి కనబరిచారు. వీరిలో ఎక్కువమంది తమ పిల్లలను ప్రాధాన్య క్రమంలో అమెరికా, బ్రిటన్, కెనడా, ఆస్ట్రేలియా, సింగపూర్ దేశాలకు పంపేందుకు ఇష్టపడుతున్నట్టు వెల్లడించింది. కొంతమంది తల్లిదండ్రులు తమ పిల్లలను విదేశాలకు పంపేందుకు ఆర్థిక ఇబ్బందులను సైతం ఎదుర్కొనేందుకు సిద్ధపడుతున్నారని తెలిపింది. చాలామంది ఉద్యోగ విరమణ తరువాత బతకడం కోసం దాచుకున్న డబ్బును సైతం తమ పిల్లల చదువుకోసం వెచ్చిస్తున్నారని పేర్కొంది.

## ట్రంప్‌పై కమలదే పైచేయి!
### *వాడీవేడిగా తొలి డిబేట్*

*న్యూయార్క్: నవంబర్‌లో జరిగే అగ్రరాజ్య ఎన్నికల సందర్భంగా జరిగిన డిబేట్‌లో డెమోక్రటిక్ అభ్యర్థి కమలా హారిస్, మాజీ అధ్యక్షుడు, రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డొనాల్ట్ ట్రంప్ తొలిసారిగా ముఖాముఖీ తలపడ్డారు. గత డిబేట్‌లో ట్రంప్ వైపే స్పష్టంగా మద్దతు చూపిన మీడియా, ఈసారి మాత్రం కమలా హారిస్‌కు ఎడ్జ్ ఇచ్చింది. మంగళవారం రాత్రి వీరిరువురికి మధ్య జరిగిన సంవాదంలో ఆర్థిక వ్యవస్థ, గర్భ విచ్ఛిత్తి నుంచి వలస విధానం వరకు పలు అంశాలపై వాడీవేడిగా చర్చ జరిగింది. 90 నిముషాల పాటు జరిగిన ఈ చర్చలో హారిస్ కొన్ని సమయాల్లో సంభాషణను నియంత్రించారు. ట్రంప్‌ను అతని ఆర్థిక విధానంలోని లోపాలను ఎత్తి చూపారు. అలాగే 2020 ఎన్నికల్లో పరాజయాన్ని ట్రంప్ అంగీకరించడానికి నిరాకరించడం, సభలలో అతని వ్యవహార శైలిపై చురకలంటించారు. అయితే ట్రంప్ పలుసార్లు అసంబద్ధ వ్యాఖ్యలు చేశారు. సమయం గడిచే కొద్దీ ఆయనలో చికాకు కన్పించింది. హారిస్ ఆరోపణలను సమర్థించుకోవడానికి ఎక్కువ సమయం కేటాయించినట్టు కన్పించగా, హారిస్‌లో దృఢ విశ్వాసం, దూరదృష్టి కన్పించాయని పలువురు వ్యాఖ్యాతలు పేర్కొన్నారు. గత జూన్‌లో ట్రంప్‌తో అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ జరిపిన సంవాదం కన్నా హారిస్ చక్కగా తన వాగ్ధాటితో ఆకట్టుకున్నారు. అప్పటి సంవాదంలో పలుసార్లు బైడెన్ తడబడగా, హారిస్ మాత్రం సూటిగా సమాధానం చెబుతూ తనకు, ట్రంప్‌కు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని ప్రస్ఫుటింప చేశారు.*



### కమల ఇయర్ రింగ్స్‌లో సీక్రెట్ డివైస్!

డిబేట్ సమయంలో కమల ఇయర్ రింగ్స్‌లో రహస్య వినికిడి పరికరం ఉందని ఆరోపణలు వస్తున్నాయి. టెక్నాలజీకి సంబంధించిన ఓ వ్యాసంలో ఓ మహిళ ధరించిన కర్ణాభరణం వంటి ఇయర్‌పీస్‌తో కమల ధరించిన ఇయర్ రింగ్స్‌ని పోల్చి చూపిస్తున్నారు. ‘ట్రంప్‌తో చర్చలో కమల బాగా మాట్లాడారు. కానీ ఆమె కర్ణాభరణాలు నాకు ఆసక్తికరంగా మారాయి. అవి చెవి రింగుల మాదిరిగా కనిపించే ఓ ఇయర్‌ఫోన్ గురించి ఓ టెక్ ఆర్టికల్ గుర్తుకు వచ్చింది’ అని ఓ ఎక్స్ యూజర్ పేర్కొన్నారు.

# అదానీ.. గో బ్యాక్

- మోదీ ఆప్తమిత్రుడిపై కెన్యాలో పెద్ద ఎత్తున నిరసనలు
- అదానీ సంస్థకు జోమో కెన్యట్ట విమానాశ్రయ లీజు
- వ్యతిరేకిస్తూ సమ్మెకు దిగిన ఎయిర్‌పోర్టు కార్మికులు
- నిలిచిన విమానాలు.. స్తంభించిన కార్యకలాపాలు
- ఒప్పందంపై తాత్కాలిక స్టే విధించిన హైకోర్టు

*నైరోబి, సెప్టెంబర్ 11: దేశంలోని అనేక నౌకాశ్రయాలు, విమానాశ్రయాలను హస్తగతం చేసుకున్న ఆదానీ సంస్థ విదేశాలకు విస్తరించేందుకు చేస్తున్న ప్రయత్నాలకు తీవ్ర అడ్డంకులు ఎదురవుతున్నాయి. కెన్యాలో అదానీ సంస్థకు వ్యతిరేకంగా వందలాది మంది ఎయిర్‌పోర్టు కార్మికులు ఆందోళనకు దిగారు. రాజధాని నైరోబిలోని జోమో కెన్యట్ట అంతర్జాతీయ విమానాశ్రయాన్ని(జేకేఐఏ) అదానీ ఎయిర్‌పోర్ట్ హోల్డింగ్స్ లిమిటెడ్‌కు లీజుకు ఇవ్వడాన్ని వ్యతిరేకిస్తూ మంగళవారం రాత్రి కెన్యా ఏవియేషన్ అథారిటీ(కేఏఏ) కార్మికులు సమ్మెకు దిగారు. ‘అదానీ.. గోబ్యాక్’, ‘వీ రిజెక్ట్ అదానీ’ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అదానీతో ఒప్పందాన్ని వెంటనే రద్దు చేసుకోవాలని ప్రభుత్వాన్ని కార్మికులు డిమాండ్ చేశారు. ఎయిర్‌పోర్టును అదానీకి అప్పగించడాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించేది లేదని స్పష్టం చేశారు. కార్మికుల సమ్మెతో ఎయిర్‌పోర్టు కార్యకలాపాలు స్తంభించిపోయాయి. విమానాల రాకపోకలు ఆలస్యం అవుతున్నాయి. టెర్మినల్ బయట ప్రయాణికులు బారులు తీరుతున్నారు. ఇందుకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. కాగా, ఈ ఒప్పందంపై అభ్యంతరాల నేపథ్యంలో కెన్యా హైకోర్టు తాత్కాలిక స్టే విధించింది.*

- *2016 జూలై 10, 11 తేదీల్లో కెన్యాలో మోదీ పర్యటన*
- *2023 డిసెంబర్ 4 - 6 మధ్య భారత్‌లో కెన్యా అధ్యక్షుడు పర్యటన*
- *2024 జూలైలో ఎయిర్‌పోర్టు నిర్వహణకు అదానీ సంస్థ ప్రతిపాదన, వెంటనే ఆమోదం*

***ఏమిటీ ఒప్పందం?***

*జోమో కెన్యట్ట అంతర్జాతీయ విమానాశ్రయం కెన్యాలో ప్రధానమైనది. దాదాపు 185 కోట్ల డాలర్లకు ఈ ఎయిర్‌పోర్టును 30 ఏండ్ల పాటు అదానీ ఎయిర్‌పోర్ట్ హోల్డింగ్స్ లిమిటెడ్ సంస్థకు లీజుకు ఇచ్చేందుకు కెన్యా ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. సామర్థ్యానికి మించి ఎయిర్‌పోర్టుకు ప్రయాణికులు వస్తున్నందున ఆధునీకరించేందుకు ఈ ఒప్పందం చేసుకున్నట్టు కెన్యా ప్రభుత్వం చెప్పింది. ఒప్పందంలో భాగంగా అదానీ సంస్థ రెండో రన్‌వేను నిర్మించడంతో పాటు ప్రయాణికుల టెర్మినల్‌ను ఆధునీకరించాలి. అయితే, పబ్లిక్ టెండర్‌ను ఆహ్వానించకుండా అదానీ సంస్థ చేసిన ప్రతిపాదన ఆధారంగా ఈ ఒప్పందం ఖరారైంది.*




**నైరోబిలో అదానీ సంస్థకు వ్యతిరేకంగా కార్మికుల నిరసన**

***ఒప్పందాన్ని ఎందుకు దాచిపెడుతున్నారు?***

*నైరోబీ ఎయిర్‌పోర్టును అదానీకి అప్పగించేందుకు కెన్యా ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాన్ని రహస్యంగా ఉంచుతున్నారని కార్మికులు ఆరోపిస్తున్నారు. అన్ని వివరాలను ప్రభుత్వం తమకు ఇవ్వడం లేదని, ఎందుకు ఒప్పంద వివరాలను రహస్యంగా ఉంచుతున్నారని కెన్యా ఏవియేషన్ వర్కర్స్ యూనియన్ సెక్రటరీ జనరల్ మోసెస్ ప్రశ్నించారు. ఎయిర్‌పోర్టు ప్రభుత్వ ఆస్తి అని, కెన్యా ప్రజలకు నిజాలు తెలియాలని కినాంగాప్ ఎంపీ క్వ్యెన్యా థుకు పేర్కొన్నారు. రాయితీల ద్వారా ఎయిర్‌పోర్టు కార్యకలాపాలు సాగుతున్నాయని, ఇప్పుడు ఆదానీ సంస్థకు ఎయిర్‌పోర్టును అప్పగిస్తే స్థానికులు ఉద్యోగాలు కోల్పోతారని, లాభాల కోసం ఈ సంస్థ ప్రయాణికులను దోచుకుంటుందని ఎయిర్‌పోర్టు కార్మికులు ఆరోపిస్తున్నారు. ‘ఇది మా సార్వభౌమత్వాన్ని అపహాస్యం చేయడమే. అదానీ సంస్థ ఒట్టి చేతులతో వస్తున్నది. మేము అదానీని తిరస్కరిస్తున్నాం’ అని వర్కర్స్ యూనియన్ ప్రకటించింది. ఈ లీజు ఒప్పందాన్ని లా సొసైటీ ఆఫ్ కెన్యా, కెన్యా మానవ హక్కుల కమిషన్ కోర్టులో సవాల్ చేశాయి. ఒప్పందంపై తాత్కాలిక స్టే విధించిన కోర్టు తుది తీర్పు వెలువరించాల్సి ఉంది.*

***మొన్న ఆస్ట్రేలియా, శ్రీలంక..***
***నిన్న బంగ్లాదేశ్.. నేడు కెన్యా***

*గత పదేండ్లుగా భారత్‌లో అనేక రంగాలకు వ్యాపారాన్ని విస్తరించిన అదానీ సంస్థలు విదేశాల్లోనూ అడుగుపెట్టాయి. పలు దేశాలతో ఇంధన, విద్యుత్తు, మైనింగ్, విమానాశ్రయాలకు సంబంధించిన ఒప్పందాలు కుదుర్చుకుంటున్నాయి. అయితే, ఈ ఒప్పందాలపై ఆయా దేశాల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్నది. శ్రీలంకలోని మన్నార్ జిల్లాలో నిర్మించాలనుకున్న పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులపై అక్కడి ప్రజలు భగ్గుమన్నారు. 2022లో అక్కడి ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరిగిన అల్లర్లకు ఇదీ ఓ కారణం. అదానీ నుంచి విద్యుత్తు కొనుగోలు కోసం బంగ్లాదేశ్ ప్రభుత్వం ఒప్పందం చేసుకోగా, దీనిపైనా తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. అంతకుముందు ఆస్ట్రేలియాలోనూ అదానీ మైనింగ్ ప్రాజెక్టుపై ఆందోళనలు జరిగాయి. ఇప్పుడు కెన్యాలోనూ ఇదే జరుగుతున్నది.*

## ఐఐటీ గువాహటి డీన్ రాజీనామా
### విద్యార్థి ఆత్మహత్యపై నిరసనలు వెల్లువెత్తడంతో నిర్ణయం

గువాహటి: ఐఐటీ గువాహటి అకడమిక్ అఫైర్స్ డీన్ కేవీ కృష్ణ రాజీనామా చేశారు. కంప్యూటర్ సైన్స్ మూడో సంవత్సరం చదువుతున్న విద్యార్థి తన హాస్టల్ గదిలో సోమవారం ఉరివేసుకుని కనిపించడంతో విద్యార్థులు పెద్ద ఎత్తున నిరసనకు దిగారు. ఈ విద్యార్థికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నట్లు కొందరు చెప్తున్నారు. ఈ నేపథ్యంలో కృష్ణ తన పదవికి రాజీనామా చేశారు. విద్యార్థులు సోమవారం నుంచి నిరసన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఇటువంటి సంఘటనలు పదే పదే జరుగుతున్నాయని, ఇప్పటి వరకు ఈ క్యాంపస్‌లో నలుగురు విద్యార్థులు మరణించారని కొందరు చెప్పారు.

## రైళ్లలో ‘క్లౌడ్ కిచెన్’ సేవలు!
### తొలుత ముంబైలో

న్యూఢిల్లీ : నాణ్యమైన ఆహారం దొరకటం లేదన్న ఫిర్యాదుల నేపథ్యంలో భారతీయ రైల్వే కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పుడున్న బేస్ కిచెన్ల స్థానంలో క్లౌడ్ కిచెన్స్‌ను ఏర్పాటుచేసేందుకు ‘ఐఆర్‌సీటీసీ’ (ఇండియన్ రైల్వే కేటరింగ్, టూరిజం కార్పొరేషన్) చర్యలు చేపట్టింది. సీసీటీవీ పర్యవేక్షణ, పాకశాస్త్ర ప్రవీణులు, ఇతర నిపుణుల బృందంతో దాదాపు 200 వరకు ‘క్లౌడ్ కిచెన్ల’ను ఐఆర్‌సీటీసీ వెస్ట్ జోన్‌లో ఏర్పాటు చేయబోతున్నారు. తొలుత ముంబైలోని బేస్ కిచెన్స్‌ను క్లౌడ్ కిచెన్స్‌గా అప్‌గ్రేడ్ చేయనున్నట్టు రైల్వే అధికారులు చెప్పారు. ఇకపై వీటి నుంచే రాజధాని, శతాబ్ది, తేజస్ ఎక్స్‌ప్రెస్, వందే భారత్ రైళ్లలో ప్రయాణికులకు ఆహారాన్ని అందజేస్తారు.

## గుజరాత్‌లో అంతుచిక్కని వ్యాధి
### 15 మంది మృత్యువాత

గాంధీనగర్: అంతుబట్టని ఓ వ్యాధి గుజరాత్‌లో కలకలం రేపుతున్నది. ముఖ్యంగా కచ్ జిల్లాలో లఖ్‌పత్, అబ్డాసా తాలూకాల్లో పరిస్థితి ఆందోళనకరంగా తయారైంది. గత కొద్ది రోజులుగా జ్వరం, నిమోనియా లక్షణాలతో బాధపడుతున్న వాళ్లలో 15 మంది చనిపోవటం కలవరపరుస్తున్నది. మృతుల్లో ఆరుగురు పిల్లలు ఉన్నారు. 11 మృతదేహాల నుంచి శాంపిల్స్ సేకరించి పుణేలోని వైరాలజీ ఇన్‌స్టిట్యూట్‌కి పంపామని కచ్ జిల్లా కలెక్టర్ అమిత్ అరోరా చెప్పారు. కారణాలేమితో తెలుసుకోవడానికి సమయం పడుతుందన్నారు. మరణాలకు గల కారణంపై దర్యాప్తు చేపట్టామని, వైద్య బృందాలు త్వరలో నివేదికను అందజేస్తాయని ఆరోగ్య మంత్రి రిషికేశ్ పటేల్ చెప్పారు.

### దేశీయ తొలి ఏరోస్పైక్ రాకెట్
## ఇంజిన్ ప్రయోగం విజయవంతం

న్యూఢిల్లీ: భారత తొలి ఏరో స్పైక్ రాకెట్ ఇంజిన్ ప్రయోగం విజయవంతమైంది. కర్ణాటకలోని చిత్రదుర్గ జిల్లాలో ఉన్న ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్ ప్రొపల్షన్ టెస్ట్ ఫెసిలిటీలో ఈ ప్రయోగాన్ని స్పేస్‌ఫీల్డ్స్ స్టార్టప్ విజయవంతంగా పరీక్షించింది. తొలుత అసాధారణ స్థితిలో ఉన్న ఇంజిన్ క్రమంగా స్థిరత్వాన్ని సాధించిందని శాస్త్రవేత్తలు వెల్లడించారు. ఈ ఇంజిన్ కోసం స్పేస్‌ఫీల్డ్స్ టైటానియం గ్రేడ్5ని వినియోగించింది. ఈ ప్రయోగ విజయం భారత అంతరిక్ష సాంకేతికతలో ముఖ్య ఘట్టంగా శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. స్పేస్‌ఫీల్డ్స్ లీడర్‌గా నిలుస్తుందని, ఏరోస్పైక్ ఇంజిన్‌తో సామర్థ్యం మెరుగుపడటమే కాకుండా, తక్కువ ఖర్చుతో కూడుకొన్నదని పేర్కొన్నారు.

## అమెరికాను కనుగొన్నది భారతీయులే
### మధ్యప్రదేశ్ మంత్రి పర్మార్

భోపాల్: అమెరికాను కనుగొన్నది క్రిస్టోఫర్ కొలంబస్ కాదని, భారతీయ పూర్వీకులేనని మధ్యప్రదేశ్ విద్యాశాఖ మంత్రి ఇందర్‌సింగ్ పర్మార్ వ్యాఖ్యానించారు. భారత్‌ను కనుగొన్నది వాస్కోడిగామా అన్నది కూడా తప్పేనని అన్నారు. ‘భారత గొప్ప యోధుడైన వాసులూన్ 8వ శతాబ్దంలోనే అమెరికాకు వెళ్లారు. శాన్‌టియాగోలో అనేక దేవాలయాలు నిర్మించారు. ఇప్పటికీ ఆ నిజాలు అక్కడి మ్యూజియంలో భద్రంగా ఉన్నాయి. వాస్కోడిగామా భారత్‌ను కనిపెట్టాడన్నదీ తప్పే, పుస్తకాల్లో తప్పుగా రాశారు’ అని పేర్కొన్నారు.

## డెంగ్యూతో మహిళ మృతి



వంగల జ్యోతి(ఫైల్)

ములుగురూరల్, సెప్టెంబర్11: డెంగ్యూ జ్వరంతో బాధపడుతూ మహిళ మృతి చెందిన ఘటన ములుగు జిల్లా కేంద్రం లోని గొల్లవాడలో బుధవారం చోటుచేసుకుంది. గొల్లవాడ కాలనీకి చెందిన వంగల జ్యోతి (48) వారం రోజులుగా జ్వరంతో బాధపడుతున్నది. స్థానికంగా వైద్యం చేయించినా తగ్గకపోవడంతో రెండు రోజుల క్రితం వరంగల్ ఎంజీఎం దవాఖానలో చేరింది. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందిందని స్థానికులు తెలిపారు.



## రోడ్డుపై ఆడ శిశువు

### ఐసీడీఎస్ కేంద్రానికి తరలించిన పోలీసులు

దేవరకద్ర, సెప్టెంబర్ 11: మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర మండలం డోకూరు స్టేజీ సమీపంలో ఓ ఆడ శిశువు లభ్యమైంది. బుధవారం ఉదయం 6:30 గంటలకు దేవరకద్ర సహకార సంఘం అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి వాకింగ్ వెళ్లగా.. రోడ్డు పక్కల శిశువు ఏడుపు వినిపించింది. వెంటనే అక్కడికి వెళ్లి చూడగా గుర్తు తెలియని వ్య క్తులు శిశువును బస్తాలో ఉంచి వెళ్లా రు. శిశువుకు చీమలు పట్టి ఉన్నట్టు గమనించారు. వెంటనే అంగన్‌వాడీ కార్యకర్త విజయలక్ష్మికి సమాచారం అందించగా.. ఆమె అక్కడికి చేరుకొని పసికందును స్థానిక దవాఖానకు తీసుకెళ్లగా.. శిశువు ఆరోగ్యంగా ఉన్నట్టు వైద్యులు తెలిపారు. సమాచారం అందుకున్న ఎస్సై నాగన్న శిశువును ఐసీడీఎస్ కేంద్రానికి తరలించారు.

## చోరీకి వెళ్లి కరెంట్ షాక్‌తో తండ్రీకొడుకు మృతి

మిడ్జిల్, సెప్టెంబర్ 11: చోరీ చేసేందుకు వెళ్లిన తండ్రీకొడుకు విద్యుదాఘాతానికి గురై మృతి చెందిన ఘటన మహబూబ్‌నగర్ జిల్లాలో బుధవారం చోటుచేసుకుంది. జోగుళాంబ గద్వాల జిల్లా ఇటిక్యాల మండలానికి చెందిన బాలస్వామి (42), జయరాజ్ (17) తండ్రీకొడుకులు. మంగళవారం అర్ధరాత్రి మిడ్జిల్ మండలంలోని బోయిన్‌పల్లి గ్రామ సమీపంలో ఉన్న సోలార్ ప్లాంట్‌లో దొంగతనం చేయడానికి వచ్చారు. ఇక్కడ అమర్చే తీగల్లో ఉండే రాగి తీగను చోరీ చేయాలని ప్రయత్నించారు. సోలార్ ప్లాంట్‌లో గతంలో పలు మార్లు రాగి తీగ కోసం చోరీలు జరగడంతో అధికారులు ఫెన్సింగ్ వైర్‌కు విద్యుత్తు సరఫరా చేశారు. ఈ విషయం తెలియని ఇద్దరు ప్రహరీపై ఉన్న ఎల్కక్ట్రిక్ వైర్లను కట్ చేస్తుండగా కరెంట్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందారు. పోలీసులు బుధవారం ఉదయం ఘటనా స్థలానికి చేరుకొని వారి మృతదేహాలను జడ్చర్ల ప్రభుత్వ దవాఖానకు తరలించారని, కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై శివనాగేశ్వర్ నాయుడు తెలిపారు.

## అంజన్న సన్నిధిలో మహిళా అఘోరా



కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామివారిని బుధవారం ఓ మహిళా అఘోరా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు, అర్చకులు ఆమెకు స్వాగతం పలికారు. అనంతరం అఘోరా స్వామివారికి ప్రత్యేక పూజలు చేయగా, అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు. సనాతన ధర్మాన్ని కాపాడేందుకు తాను అఘోరాగా మారినట్టు ఆమె తెలిపారు. –మల్యాల

# మునిగిన బతుకు ఆశలకు వేలాడి



ఇటీవల ముంచెత్తిన మున్నేరు వాగు వరదల్లో చిక్కుకున్న కాంప్లెక్స్ ఇది. ఖమ్మం పట్టణం బొక్కలగడ్డలోని ఈ కాంప్లెక్స్ వాసులకు చివరకు మిగిలింది ఇవే. వానలు, వరదల్లో పాడైపోగా మిగిలిన వాటిని బుధవారం ఇలా ఆరబెట్టారు

### ◆ ఆమెకెంత కష్టం



కర్ణగిరిలోని రాజీవ్‌గృహకల్పలోకి నీళ్లు చేరడంతో ఫ్రిజులు, టీవీలు, కూలర్లు వంటివన్నీ పాడైపోయాయి. అలా పాడైపోయిన ఫ్రిజ్‌లను ఆరుబయట ఆరబెడుతున్న మహిళలు

మొన్నటి భారీ వర్షాల ధాటికి కన్నీటి సంద్రమైన ఖమ్మం పట్టణం ఇప్పుడిప్పుడే తేరుకుంటున్నది. వానల్లో, వరదల్లో సర్వం కోల్పోయిన వరద బాధితులు పాడైపోయిన వస్తువులను బాధాతప్త హృదయంతో పాత సామాన్ల దుకాణాలకు తరలిస్తున్నారు. కొద్దోగొప్పో మిగిలినవాటిని ఆర బెట్టుకుంటూ, శుభ్రం చేసుకుంటూ జీవనయానం సాగించేందుకు సిద్ధమవు తున్నారు.

-ఫొటోలు మహేశ్ భండారి

### రేపటి వెలుగుల కోసం



వెంకటేశ్‌నగర్‌లో వర్షాలకు దెబ్బతిన్న విద్యుత్తు మీటర్లను మరమ్మతు చేస్తున్న సిబ్బంది

### ◆ కన్నీటి తడి ఆరేనా!



బొక్కలగడ్డలో వరదల కారణంగా ఇంజినీరింగ్ చదువుతున్న ఓ విద్యార్థిని పుస్తకాలు, రికార్డులు తడిసిపోయాయి. తన బిడ్డ భవిష్యత్‌కు ఎంతో విలువైన పుస్తకాలను ఆరబెడుతున్న ఓ తండ్రి

### ◆ మునిగిన సామాన్లు కొంటాం!



మున్నేరు వాగు మిగిల్చిన దుఃఖం ఇది. వరదల్లో పాడైపోయిన విలువైన వస్తువులన్నీ ఇలా భారంగా పాత సామాన్ల దుకాణానికి వెళ్తున్నాయి

### ◆ తరలిపోయే జీవితం



వీరికి సొంత గూడు లేదు. జూబ్లీపురాలో అద్దె ఇంట్లో కాపురం చేస్తున్నారు. మొన్నటి వరదలు సర్వం ఊడ్చేయడంతో ఇక అక్కడ ఉండలేక, మిగిలిన కొద్దిపాటి సామాన్లతో చంటి బిడ్డను పొత్తిళ్లలో పెట్టుకుని తరలిపోతున్న ఇల్లాలు

# రాత్రికి రాత్రే మునిగిపోయాయి

- అపార నష్టం.. ఆదుకోండి సారూ
- కేంద్రబృందానికి వరద బాధితుల మొర
- కూసుమంచి, ఖమ్మంరూరల్ మండలంలో పర్యటన
- మహబూబాబాద్ జిల్లాలో రాత్రివేళలో వరదనష్టం అంచనా



ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం మల్లాయిగూడెం వద్ద దెబ్బతిన్న రోడ్డును పరిశీలిస్తున్న కేంద్ర బృంద సభ్యులు

కూసుమంచి/ ఖమ్మం రూరల్ /మహబూబాబాద్, సెప్టెంబర్ 11: 'వందేండ్లలో ఎన్నడూ ఇలాంటి విపత్తు రాలేదు. రాత్రికి రాత్రే ఇళ్లు, పొలాలు మునిగిపోయాయి. రోడ్లు కొట్టుకుపోయాయి. కాలువలకు గండ్లు పడ్డాయి. పచ్చటి పంటలన్నీ మా కళ్లెదుటే ఎడారిలా మారాయి. అన్నింటా అపార నష్టం జరిగింది. ఆదుకోండి సారూ..' అంటూ కేంద్ర బృందం ఎదుట తమ గోడు వెళ్లబోసుకున్నారు కూసుమంచి, ఖమ్మం రూరల్ మండలాలకు చెందిన వరద బాధిత రైతులు. ఇటీవలి భారీ వర్షాలు, వరదల కారణంగా ఖమ్మం జిల్లా కూసుమంచి, ఖమ్మం రూరల్ మండలాల్లో వరద నష్టాన్ని అంచనా వేసేందుకు కేంద్ర బృందం అధికారులు బుధవారం పర్యటించారు. దీంతో వరద బాధితులు, రైతులు తమ ఆవేదనను కేంద్ర బృందానికి వినిపించారు. ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ కూడా నష్ట తీవ్రత గురించి కేంద్ర అధికారులకు వివరించారు. తొలుత కూసుమంచి మండలంలో పర్యటించిన కేంద్ర అధికారులు.. పంటల నష్టానికి సంబంధించిన ఫొటో ఎగ్జిబిషన్‌ను పరిశీలించారు. ఖమ్మం రూరల్ మండలం తనగంపాడులోనూ ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించి, కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌తో కలిసి ఇసుక మేట వేసిన పొలాలను పరిశీలించారు. కేంద్ర బృందంలో సెంట్రల్ టీం అధికారులు కే.ప్రతాప్‌సింగ్, మహేశ్‌కుమార్, శాంతి స్వరూప్, కుషవహ, నియల్‌ఖాన్ సన్, శశివర్ధన్, విజయ్‌కుమార్ తదితరులు ఉన్నారు. అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్, జిల్లా అధికారులు అభిమన్యుడు, విద్యాసాగర్, పుల్లయ్య, మంగలంపుడి వెంకటేశ్వర్లు, కోక్యానాయక్, వేణుగోపాల్‌రెడ్డి, సరిత, వాణి, రమేశ్‌రెడ్డి, మన్మథరావు, రత్నకుమారి, రామచందర్‌రావు, రత్నకుమారి,గణేశ్, పుల్లయ్య, మధుసూన్, సరిత, అపర్ణ, ఉమా నగేశ్ తదితరులు పాల్గొన్నారు.

### చీకట్లో వరద నష్టం అంచనా

ఖమ్మం జిల్లా పర్యటన ముగించుకొని మహబూబాబాద్ జిల్లాలోకి కేంద్ర బృందం ప్రవేశించే సరికి రాత్రి 7 గంటలు అయ్యింది. రాత్రి వేళల్లో కేంద్ర బృందాల ఉరుకులు, పరుగులు అంతా ఇంతా కాదు. రాత్రి 7గంటలకు మరిపెడ అతిథి గృహానికి చేరుకున్నారు. ఇక్కడ వీరికి కలెక్టర్, అదనపు కలెక్టర్లు స్వాగతం పలికారు. అనంతరం సభ్యులు రెండు బృందాలుగా ఏర్పడి వరద నష్టంపై అంచనా వేశారు. కేంద్ర హోంశాఖ సంయుక్త కార్యదర్శి ఆధ్వర్యంలో ఎస్‌కే కుశ్వాహ, నియల కన్నన్, శశివర్దన్ బృందం అబ్బాయిపాలెంలో వరదలకు కొట్టుకుపోయిన పంచాయతీ రాజ్ రోడ్లను, గాలివారి గూడెం, పురుషోత్తమాయ గూడెం, ముల్కల పల్లి బ్రిడ్జిలను పరిశీలించారు. రాత్రి కావడంతో టార్చిలైట్ల, కారు వెలుతురులో నష్టాన్ని పరిశీలించారు. మరిపెడ మండలం అబ్బాయిపాలెం వద్ద ఇటీవల వరదలకు ధ్వంసమైన రోడ్లకు సంబంధించిన ఫొటో ఎగ్జిబిషన్‌ను అధికారులు తిలకించారు. అదనపు కలెక్టర్ డేవిడ్‌తోపాటు ఇతర శాఖలకు సంబంధించిన అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. రెండో బృందం కల్నల్ కేపీ సింగ్ ఆధ్వర్యంలోని ముగ్గురు సభ్యులు మరిపెడ మండలం ఉల్లేపల్లి గ్రామంలో పర్యటించింది. అక్కడ వరద నష్టంపై ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. అనంతరం మరిపెడ మండలం సీతారాం తండాలో బృందం పర్యటించింది. అక్కడ ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించింది. గ్రామంలో సీఎం రేవంత్‌రెడ్డి వచ్చి మాట్లాడిన కుటుంబసభ్యుల ఇస్లావత్ మంగీలాల్, కవితతో పాటు వారి ముగ్గురి పిల్లలు మాట్లాడారు. డోర్నకల్ మండలం ముల్కలపల్లి గ్రామంలో పర్యటించి అక్కడి ప్రజలతో మాట్లాడారు. జిల్లాలో రాత్రి 7 నుంచి 10గంటల వరకు కేంద్ర బృందాల పర్యటన కొనసాగింది. అనంతరం రెండు బృందాలు ఖమ్మం జిల్లాకు వెళ్లాయి. కేంద్ర బృంద సభ్యులు మహేశ్‌కుమార్ శాంతినాథ్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ అర్వింద్‌కుమార్ తదితరులు ఉన్నారు.

## వరద నష్టం రూ.5,438 కోట్లు

- కేంద్ర బృందానికి సీఎస్ శాంతికుమారి వివరణ
- సహాయ, సహకారాలు అందించాలని విజ్ఞప్తి

హైదరాబాద్, సెప్టెంబర్11 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదల కారణంగా ప్రాథమిక అంచనాల ప్రకారం రూ.5,438 కోట్ల మేరకు నష్టం వాటిల్లిందని, పూర్తిస్థాయి అంచనాల ప్రక్రియ ఇంకా కొనసాగుతున్నదని సీఎస్ శాంతికుమారి వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం అన్నివిధాలుగా రాష్ట్రానికి సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఇటీవల వచ్చిన వరదలతో సంభవించిన అపారమైన నష్టాన్ని అంచనా వేసేందుకు కల్నల్ కేపీ సింగ్ నేతృత్వంలోని ఆరుగురు సభ్యుల కేంద్ర అధికారుల బృందం రాష్ట్రానికి బుధవారం విచ్చేసింది. సచివాలయంలో సీఎస్, సీనియర్ అధికారులతో భేటీ అయ్యింది. వరదలు, వాటిల్లిన నష్టాలను కేంద్ర బృందానికి సీఎస్ శాంతికుమారి వివరించారు. ఏటూరునాగారం అటవీ ప్రాంతంలో 332 హెక్టార్ల విస్తీర్ణంలో భారీ చెట్లు కూలిన సంఘటనలను, పర్యావరణ విపత్తు సమస్యను కూడా కేంద్ర బృందానికి సీఎస్ వివరించారు. విపత్తుకు మూలకారణాలను తెలుసుకునేందుకు సమగ్ర అధ్యయనం చేయాలని కేంద్ర బృందం సీఎస్‌కు ఈ సందర్భంగా సూచించింది. వరదల కారణంగా ప్రాథమిక అంచనాల మేరకు రూ.5,438 కోట్ల నష్టం వాటిల్లిందని, పూర్తిస్థాయి అంచనా ప్రక్రియ ఇంకా కొనసాగుతున్నదని కేంద్ర బృందానికి విపత్తు నిర్వహణ శాఖ రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్‌కుమార్ తెలియజేశారు. వరదలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను కేంద్ర బృందం తొలుత పరిశీలించింది.

## అడవులను రక్షించుకుందాం

### మాజీ ఎంపీ సంతోష్‌కుమార్



హైదరాబాద్, సెప్టెంబర్ 11 (నమస్తే తెలంగాణ): అటవీ శాఖ అమరవీరుల స్ఫూర్తిగా అడవులను రక్షించుకుందామని గ్రీన్ ఇండియా చాలెంజ్ వ్యవస్థాపకుడు, మాజీ ఎంపీ సంతోష్‌కుమార్ పిలుపునిచ్చారు. అటవీ అమరవీరుల దినం సందర్భంగా అమరవీరులకు బుధవారం ఆయన నివాళులర్పించారు. ఎక్స్ వేదికగా అమరవీరుల త్యాగాలను గుర్తుచేసుకున్నారు.1730 సెప్టెంబర్‌లో బిష్ణోయ్ కమ్యూనిటీ మార్వార్‌లో చెట్లను కాపాడటం కోసం తమ ప్రాణాలను త్యాగం చేసిన సందర్భాన్ని సంతోష్‌కుమార్ గుర్తుచేశారు. 'నిరంకుశుడు మరణిస్తాడు.. అతని పాలన ముగుస్తుంది. అమరవీరుడు మరణిస్తాడు.. అతని పాలన ప్రారంభమవుతుంది' అంటూ తత్వవేత్త కీర్కెగార్డ్ వ్యా ఖ్యలను ఉటంకిస్తూ సంతోష్‌కుమార్ ట్వీట్ చేశారు.

## గాలే చెట్లను పెకిలించేసింది

వరంగల్, సెప్టెంబర్ 11 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): ములుగు జిల్లా తాడ్వాయి అటవిలో చెట్లు కూలిపోవడానికి సమాంతర ఉధృత గాలులు (డౌన్ బస్ట్ అండ్ స్ట్రెయిట్ లైన్ విండ్ స్టార్మ్) కారణమని అటవీశాఖ అధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు. 28 ఏండ్ల క్రితం మధ్యప్రదేశ్‌లో నౌరాదేహి అభయారణ్యంలో ఇదే తరహాలో చెట్లు భారీగా కూలిపోయాయని వెల్లడించారు.

# పోలీసు బిడ్డలకు రెసిడెన్షియల్ స్కూల్స్

- హైదరాబాద్, వరంగల్‌లో 50 ఎకరాలు కేటాయిస్తాం
- ఆరు నుంచి పీజీ వరకు నాణ్యమైన ఉచిత విద్య
- ఎస్సైల దీక్షాంత్ పరేడ్‌లో సీఎం రేవంత్‌రెడ్డి
- సీఎంఆర్‌ఎఫ్‌కు ఒకరోజు వేతనం అందించిన పోలీసులు



పోలీసు విభాగం తరపున ఒకరోజు వేతనం రూ.11,06,83,571 చెక్కును ముఖ్యమంత్రి సహాయనిధికి అందజేస్తున్న డీజీపీ జితేందర్, డీజీ శివధర్‌రెడ్డి, పోలీసు అధికారుల సంఘం

హైదరాబాద్, సెప్టెంబర్ 11 (నమస్తే తెలంగాణ): పోలీసుల పిల్లలకు ఆరో తరగతి నుంచి పీజీ వరకు నాణ్యమైన, ఉచిత విద్యను అందించేందుకు సైనిక్‌స్కూల్ తరహాలో పోలీస్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. బుధవారం తెలంగాణ పోలీసు అకాడమీలో ట్రైనీ ఎస్సైల దీక్షాంత్ పరేడ్‌కు సీఎం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. హైదరాబాద్, వరంగల్ నగరాల్లో 50 ఎకరాల విస్తీర్ణంలో పోలీసు రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు కోసం ప్రభుత్వం స్థలం కేటాయిస్తుందని ప్రకటించారు.

### ప్రజల్లో విశ్వాసం కల్పించండి

వ్యసనాలకు బానిసలైన కొంతమంది డ్రగ్స్, గంజాయి, సైబర్ నేరాలకు పాల్పడుతున్నారని, శిక్షణ పొందిన ఎస్సైలు విధుల్లో చేరిన తర్వాత వాటిపై ఉక్కుపాదం మోపాలని పిలుపునిచ్చారు. గ్రామీణ నేపథ్యం నుంచి వచ్చిన ఎస్సైలందరినీ చూ స్తుంటే, తెలంగాణ డ్రగ్స్ రహితంగా మారుతుందన్న నమ్మకం కలుగుతున్నదని చెప్పారు. పోలీసుది ఒక ఉద్యోగం మాత్రమే కాదని అదొక భావోద్వేగమని చెప్పారు. ఏ సమస్య వచ్చినా ముందుగా అందుబాటులో ఉండేది పోలీసులేనని, వారి సాయంతో డ్రగ్స్, గంజాయి, సైబర్ నేరాలు, ఆక్రమణలపై ఉక్కుపాదం మోపుతామని పేర్కొన్నారు. డ్రగ్స్ పేరు వింటేనే మోకాళ్లలో వణుకు పుట్టాలని అన్నా రు. పోలీస్‌స్టేషన్‌కు కన్నీళ్లతో వచ్చిన వారితోనే ఫ్రెండ్లీగా ఉండాలని నేరస్తులతో కాదని చెప్పా రు. 'ప్రస్తుతం కాస్మెటిక్ పోలీసింగ్ కాదు.. కాంక్రీట్ పోలీసింగ్ అవసరం' అని స్పష్టంచేశారు.

### సీఎంఆర్‌ఎఫ్‌కు 11.6 కోట్ల విరాళం

ఈ సందర్భంగా పోలీసు విభాగం తరపున ఒకరోజు వేతనం నుంచి రూ.11,06,83,571 నిధులను ముఖ్యమంత్రి సహాయనిధికి డీజీపీ జితేందర్, డీజీ శివధర్‌రెడ్డి, పోలీసు అధికారుల సంఘం ప్రతినిధులు అందజేశారు. ఈ సందర్భంగా పోలీసుల సహాయక చర్యను సీఎం అభినందించారు. పరేడ్ అనంతరం పోలీసు అకాడమీలో నిర్మించిన క్రీడాభవన్‌ను సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. అందులోని బ్యాడ్మింటెన్ కోర్టులో కాసేపు బ్యాడ్మింటెన్ ఆడారు. అంతకుముందు ట్రైనీ ఎస్సైల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన ట్రోఫీలను అందజేశారు. కార్యక్రమంలో చేవెళ్ల ఎంపీ కొండ విశ్వేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, డీజీపీ జితేందర్, ఆర్‌బీఆర్‌ఆర్ పోలీసు అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్, ట్రై కమిషనరేట్ల సీపీలు, సీనియర్ ఐపీఎస్ అధికారులు, ఇతర పోలీసు అధికారులు, పెద్ద సంఖ్యలో ట్రైనీ ఎస్సైల బంధువులు పాల్గొన్నారు.

### కేసీఆర్ హయాంలోనే ఎస్సైల ట్రైనింగ్ ప్రారంభం

2022 ఏప్రిల్‌లో 17,516 పోలీసు ఉద్యోగాలను భర్తీ చేసేందుకు నాటి కేసీఆర్ ప్రభుత్వం పలు నోటిఫికేషన్లు విడుదల చేసింది. వాటిలో 16,929 కానిస్టేబుల్, తత్సమాన పోస్టులు, 587 ఎస్సై, తత్సమాన పోస్టులు ఉన్నాయి. ఎస్సై పోస్టులకు ప్రిలిమినరీ టెస్టు, ఫిజికల్ ఈవెంట్స్, మెయిన్స్ పరీక్షలు నిర్వహించి నిరుడు ఆగస్టులోనే తుది ఫలితాలు ప్రకటించారు. అనంతరం గత ఏడాది సెప్టెంబర్‌లో శిక్షణను ప్రారంభించగా, 547 మంది ప్రస్తుతం శిక్షణ ముగించుకున్నారు. కేసీఆర్ ప్రభుత్వం మహిళలకు 33/3 శాతం రిజర్వేషన్‌ను పోలీసు ఉద్యోగాల్లో కూడా అమలుచేయడంతో వివిధ విభాగాలకు చెందిన మహిళా ట్రైనీ ఎస్సైలు 147 మంది ఎంపికయ్యారు.

- ట్రైనీలలో గ్రాడ్యుయేట్లు 472 మంది ఉండగా వారిలో 248 మంది బీటెక్, ముగ్గురు బీఫార్మసీ, 221 మంది డిగ్రీ చేసిన వారున్నారు.
- పోస్ట్‌గ్రాడ్యుయేట్స్ 75 మంది ఉండగా వారిలో ఎంటెక్ 26, ఎంఫార్మసీ 3, ఎంబీఏ 18, ఎంసీఏ 4, ఇతర కోర్సులు చేసిన వారు 24 మంది ఉన్నారు.
- మొత్తం 547 మందిలో 401 మంది సివిల్, ముగ్గురు పీటీవో, 12 మంది ఎస్పీఎఫ్, 22 మంది ఐటీ అండ్ సీ, 29 మంది టీజీఎస్పీ, 71 మంది ఏఆర్ అండ్ సీపీఎల్, తొమ్మిది మంది పింగర్ ప్రింట్ ఏఎస్సైలు ఎంపికయ్యారు.
- వీరిలో కొత్తగా పోలీసు ఉద్యోగంలోకి వచ్చిన వారు 344 మంది ఉండగా, ఇప్పటికే పోలీసు డిపార్ట్‌మెంట్‌లోఉద్యోగం చేస్తున్నవారు 109 మంది, వివిధ విభాగాల్లో ఉద్యోగం చేసినవారు 92 మంది ఉన్నారు.
- ట్రైనింగ్ పూర్తి చేసుకున్న 547 మందిలో 26–30 ఏండ్లవారు 283 మంది, 21–25 ఏండ్ల వారు 182 మంది ఉన్నారు.

## వరాహానికి గోమాత పాలు

వనపర్తి జిల్లా ఆత్మకూరు పట్టణంలో ఓ వరాహానికి గోమాత పాలిచ్చి ఆశ్చర్యానికి గురిచేసింది. బుధవారం స్థానిక శ్రీ సాయివాణి కల్యాణమండపం ప్రాంగణంలో ఓ ఆవు కూర్చొని ఉండగా.. పంది వెళ్లి పాలు తాగింది. -ఆత్మకూరు



## 21వ సారి ఢిల్లీకి సీఎం రేవంత్

- నేడు కేంద్రమంత్రి అమిత్‌షాతో భేటీ
- వరద నష్టం, సాయంపై చర్చ
- పార్టీ అధిష్ఠానంతోనూ భేటీ ?
- మంత్రివర్గ విస్తరణపై చర్చ !

హైదరాబాద్, సెప్టెంబర్ 11(నమస్తే తెలంగాణ): సీఎం రేవంత్‌రెడ్డి 21వ సారి ఢిల్లీకి వెళ్లారు. బుధవారం సాయంత్రం హైదరాబాద్ నుంచి బయల్దేరిన ఆయన రాత్రికి ఢిల్లీ చేరుకున్నారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా ఇటు అధిష్ఠానంతో, అటు కేంద్ర ప్రభుత్వ పెద్దలతో భేటీ కానున్నారు. గురువారం కేంద్ర హోం మంత్రి అమిత్‌షాతో భేటీ కానున్నట్టుగా తెలిసింది. రాష్ట్రంలో కురిసిన వర్షాలు, నష్టంపై చర్చించి నష్టపరిహారం కోరనున్నట్టుగా తెలిసింది. ఆ తర్వాత కాంగ్రెస్ అధిష్ఠానం పెద్దలతోనూ భేటీ అయి మంత్రివర్గ విస్తరణపై చర్చించే అవకాశం ఉన్నట్టుగా తెలిసింది. దీంతో పాటు హైడ్రా పరిణామాలను కూడా అధిష్ఠానానికి వివరించనున్నట్టుగా తెలిసింది

## కూతురికి తండ్రి సెల్యూట్

- తండ్రి ఏఆర్ ఏఎస్సై.. కూతురు ఏఆర్ ఎస్సై
- ఎస్సైల పరేడ్‌లో అరుదైన ఘటన

హైదరాబాద్, సెప్టెంబర్ 11(నమస్తే తెలంగాణ): పిల్లలు ప్రయోజకులైనప్పుడు ఆ తండ్రి గుండె సంతోషంతో ఉప్పొంగిపోతుంది. అల్లారుముద్దుగా పెంచుకున్న కూతురు తనకంటే పెద్ద హోదాను అందుకోవడంతో సెల్యూట్ చేస్తూ ఓ తండ్రి భావోద్వేగానికి లోనైన అరుదైన ఘటనకు ఎస్సై ట్రైనీ క్యాడెట్ల మూడో దీక్షాంత్ పరేడ్ వేదికైంది. రాచకొండ కమిషనరేట్ పరిధిలో ఏఆర్ ఏఎస్సైగా విధులు నిర్వర్తిస్తున్న జీ రాంచందర్‌రావు కూతురు సౌమ్య తన విభాగంలోనే ఎస్సైగా శిక్షణ పూర్తి చేసుకోవడంతో ఆయన ఆనందానికి అవధులు లేవు. బుధవారం పరేడ్ పూర్తి చేసుకున్న అనంతరం తన కూతురికి 'సెల్యూట్' చేశారు. బ్యాచ్‌లో టాప్–10లో చోటు సంపాదించడం, సీఎం రేవంత్‌రెడ్డి నుంచి 'చీఫ్ మినిస్టర్స్ రివాల్వర్ బెస్ట్ అండ్ బెస్ట్ ఆల్ రౌండర్' 'హోం మినిస్టర్ బాటెన్ విత్ సిల్వర్ ఎండ్ ఫర్ బెస్ట్ ఇండోర్' అవార్డులు అందుకోవడం గర్వంగా ఉందని రాంచందర్‌రావు పేర్కొన్నారు. మొదటి సెల్యూట్ తండ్రి నుంచే దక్కడంతో ఏఆర్ ఎస్సై సౌమ్య భావోద్వేగానికి లోనయ్యారు.



# గోండ్వానా కాలంనాటి జెర్రి

**గుర్తించిన సీసీఎంబీ**



హైదరాబాద్ సిటీబ్యూరో, సెప్టెంబర్ 11 (నమస్తే తెలంగాణ): నాలుగు శతాబ్దాల నాటి గోండ్వానా కాలం జీవరాశులను సీసీఎంబీ పరిశోధకులు గుర్తించారు. అతి ప్రాచీన భౌగోళిక నేపథ్యం ఉన్న గోండ్వానా కాలం నాటి భారతీయ ద్వీపకల్పంపై ప్రత్యేక దృష్టి సారించిన పరిశోధకులు నాటి జీవభౌగోళిక చరిత్రను అంచనా వేశారు. ఖండాంతర వైకారి మూలాలు ఆసియా, ఆస్ట్రేలియాతోపాటు భారత్‌లోని పలు ప్రాంతాల్లో ఉన్నట్టు తేల్చారు. ఈ క్రమంలో మాలిక్యూలార్ డాటా పరిశీలించి పాకెడు పురుగు 'జెర్రి'కి ఉన్న చారిత్రక నేపథ్యాన్ని సీసీఎంబీకి చెందిన జాన్వి జోషీ పరిశోధన బృందం తెలుసుకునేందుకు అధ్యయనం చేస్తున్నది. ఇందుకోసం ఆ బృందం పశ్చిమ కనుమల్లోని పలు కొండప్రాంతాల్లో ఏడాది కాలంగా సంచరిస్తూ పరిశోధన సాగిస్తున్నది. ఈ క్రమంలోనే 400 ఏళ్ల నాటి జెర్రి మూలాలను కనుగొన్నట్టు వెల్లడించింది. జీవ వైవిధ్యం, పురాతన వైవిధ్యం గోండ్వానా అవశేషాలను సూచిస్తున్నాయని, అండమాన్ దీవుల నుంచి 11 పుటేటివ్ జాతుల ఆవిష్కరణ ఐదు రెట్లు ఎక్కువగా ఉన్నదని తెలిపింది.

## గాంధీలో మహిళా డాక్టర్‌పై రోగి దాడి

అడ్డగుట్ట, సెప్టెంబర్ 11: హైదరాబాద్‌లోని గాంధీ దవాఖానలో విధులు నిర్వహిస్తున్న మహిళ వైద్యురాలిపై దాడికి పాల్పడ్డాడో రోగి. బన్సీలాల్ పేట ప్రాంతానికి చెందిన ప్రకాశ్ అనే వ్యక్తిని అతని భార్య చికిత్స నిమిత్తం గాంధీ దవాఖానకు తీసుకొచ్చింది. బుధవారం సాయంత్రం 4 గంటల ప్రాంతంలో క్యాజువాలిటీ వార్డులో విధులు నిర్వహిస్తున్న జూనియర్ మహిళా డాక్టర్ల వద్దకు ప్రకాశ్ వచ్చి.. ఓ వైద్యురాలిపై దాడిచేశాడు. ఒక్కసారిగా షాక్‌కు గురైన సహచర వైద్యులు వెంటనే తేరుకొని అతడిని పక్కకు నెట్టేశారు. చిలకలగూడ పోలీసులకు ఫిర్యాదు చేయటంతో పోలీసులు ప్రకాశ్‌ను అదుపులోకి తీసుకొన్నారు. జూనియర్ డాక్టర్ల ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. అయితే ప్రకాశ్ మానసికస్థితి సరిగా లేదని, దాడిచేసిన సమయంలో మద్యం మత్తులో ఉన్నట్టు ప్రాథమిక సమాచారం. కాగా గాంధీలో జూనియర్ డాక్టర్లకు రక్షణ కరువైందని, ఘటనపై వెంటనే స్పందించాలని జూనియర్ డాక్టర్స్ అసోషియేషన్ దవాఖాన సూపరింటెండెంట్ రాజకుమారిని కోరారు.

## ఏపీలో వ్యాన్ బోల్తా.. ఏడుగురు దుర్మరణం


హైదరాబాద్, సెప్టెంబర్ 11 (నమస్తే తెలంగాణ) : ఏపీలోని తూర్పు గోదావరి జిల్లా దేవరపల్లి మండలం చిలకవారిపాకల సమీపంలో మినీ వ్యాన్ బోల్తాపడగా ఏడుగురు కూలీలు దుర్మరణం చెందారు. టీ నరసాపురం మండలం బొర్రంపాలెం నుంచి జీడిపిక్కల లోడుతో తూర్పు గోదావరి జిల్లా నిడదవోలు మండలం తాడిమళ్లకు ఓ మినీ వ్యాన్ మంగళవారం బయల్దేరింది. దేవరపల్లి మండలం చిలకవారి పాకలు సమీపంలో బుధవారం తెల్లవారుజామున అదుపుతప్పి పంటబోదెలోకి దూసుకెళ్లి బోల్తాపడింది. ఈ ఘటనలో జీడిపిక్కల కింద ఇరుక్కుని ఏడుగురు కూలీలు దుర్మరణం చెందారు.

## జగన్ లండన్ టూర్‌కు క్లియరెన్స్

హైదరాబాద్, సెప్టెంబర్ 11 (నమస్తే తెలంగాణ) : ఏపీ మాజీ సీఎం వైఎస్ జగన్‌కు ఏపీ హైకోర్టు భారీ ఊరట కల్పించింది. జగన్ పాస్ పోర్టు రెన్యువల్‌ను ఐదేళ్లకు పెంచాలని అధికారులను ఆదేశించింది. దీంతో జగన్ లండన్ టూర్‌కు క్లియరెన్స్ లభించింది.

# పెసర్ల కొనుగోలుపై చేతులెత్తేసిన సర్కారు

- నాఫెడ్ రూల్స్ ఒప్పుకోవని మార్క్‌ఫెడ్ వివరణ
- కొనుగోలుకు అనుమతివ్వని రాష్ట్ర ప్రభుత్వం
- లబోదిబోమంటున్న రైతులు



హైదరాబాద్, సెప్టెంబర్ 11(నమస్తే తెలంగాణ): తడిసిన పెసర్ల కొనుగోలుపై రాష్ట్ర ప్రభుత్వం చేతులెత్తేసింది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు తడిసిపోయిన పెసర్లను కొనుగోలు చేసేందుకు మార్క్‌ఫెడ్ అధికారులు నిరాకరిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ సంస్థ నాఫెడ్ నిబంధనలు ఒప్పుకోవని చెప్తున్నారు. తద్వారా రైతుల నుంచి పెసర్ల కొనుగోలును నిలిపివేశారు. దీంతో రైతులు లబోదిబోమంటున్నారు. మొన్నటివరకు కనీసం మద్దతు ధర కూడా లభించకపోవడంతో నష్టపోయిన రైతులు ఇప్పుడు వర్షాలతో పంట తడిసి మరింత నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. పెసర్లకు మద్దతు ధర దక్కకపోవడంపై ప్రధాన ప్రతిపక్షం బీఆర్‌ఎస్ ప్రశ్నించడంతో ప్రభుత్వం ఎట్టకేలకు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేసింది. నాఫెడ్ సహకారంతో కొనుగోళ్లు ప్రారంభించింది. అయితే ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రాష్ట్రవ్యాప్తంగా పెసర పంట తడిసిపోయింది. తడిసిన పంటను కొనుగోలు చేసేందుకు మార్క్‌ఫెడ్ అధికారులు నిరాకరిస్తున్నారు. ఇందుకు నాఫెడ్ నిబంధనలు అంగీకరించవని చెప్తున్నారు. నాఫెడ్ నిబంధనల ప్రకారం తేమ శాతం 12కు మించితే కొనుగోలు చేయబోమని అంటున్నారు. దీంతో పెసరు రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. ఉమ్మడి ఖమ్మం, ఉమ్మడి వరంగల్, కామారెడ్డి, మహబూబాబాద్ రైతులు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నారు.

**చేతులెత్తేసిన రాష్ట్ర ప్రభుత్వం**

రాష్ట్రంలో 64,175 ఎకరాల్లో పెసర పంట సాగు కాగా 17,841 టన్నుల ఉత్పత్తి వస్తుందని అధికారులు అంచనా వేశారు. అత్యధికంగా ఖమ్మంలో 14 వేల ఎకరాలు, వికారాబాద్‌లో 12,500, సంగారెడ్డిలో 11 వేలు, మహబూబాబాద్‌లో 5 వేలు, కామారెడ్డిలో 4,600 ఎకరాల్లో పెసర పంట సాగైంది. ఇప్పటివరకు పెసర్ల కొనుగోలుకు రాష్ట్ర ప్రభుత్వం నాఫెడ్‌పైనే ఆధారపడింది. నాఫెడ్ అనుమతిచ్చే కోటా కోసం ఎదురు చూసింది. ఆ మేరకు మాత్రమే కొనుగోలుకు నిర్ణయించింది. సొంతంగా రాష్ట్ర ప్రభుత్వం తరుపున కొనుగోలు కోసం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలొస్తున్నాయి. వర్షాలతో తడిసిపోయిన పంటను కొనుగోలు చేసేందుకు నాఫెడ్ అంగీకరించడం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో తడిసిన పంటను రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేయాల్సి ఉంటుంది. కానీ, ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి మార్క్‌ఫెడ్‌కు ఎలాంటి ఆదేశాలు రాలేదు. తడిసిన పెసర్ల కొనుగోలుకు వెంటనే ఆదేశాలు జారీచేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

## ఈసీ పట్టభద్రుల ఓట్ల నమోదును చేపట్టాలి

- రాజకీయ పార్టీల సమావేశంలో బీఆర్‌ఎస్ సూచన

హైదరాబాద్, సెప్టెంబర్ 11 (నమస్తే తెలంగాణ) : పట్టభద్రుల ఓట్ల నమోదును ఎన్నికల సంఘమే చేపట్టాలని ఎన్నికల సంఘానికి బీఆర్‌ఎస్ సూచించింది. రాజకీయ పార్టీలకు బాధ్యత అప్పగిస్తుండడంతో పూర్తిస్థాయిలో ఓటర్ల నమోదు జరగడం లేదని పేర్కొంది. బుధవారం బీఆర్కే భవన్‌లో రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్‌రెడ్డి అధ్యక్షతన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సాధారణ ఓటర్ల జాబితా ప్రక్షాళన, గ్రాడ్యుయేట్ ఓట్ల నమోదు తదితర అంశాలపై చర్చించారు. సమావేశంలో బీఆర్‌ఎస్ నుంచి మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ల శశిధర్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు దూదిమెట్ల బాలరాజు యాదవ్, రాకేశ్‌కుమార్, పల్లె రవికుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా బాలరాజు యాదవ్ పలు సూచనలు చేశారు. ఈ నెల 30 నుంచి ప్రారంభం కానున్న కరీంనగర్ గ్రాడ్యుయేట్ ఓటర్ల నమోదును ఎన్నికల సంఘమే చేపట్టాలని కోరారు.

## అటవీ శాఖ అమరవీరుల త్యాగాలు మరువలేనివి

- అటవీ అమవీరులకు పోడెం వీరయ్య, ఆర్ఎం డోబ్రియాల్ నివాళి

హైదరాబాద్, సెప్టెంబర్ 11 (నమస్తే తెలంగాణ): అటవీ శాఖలో పనిచేస్తూ విధి నిర్వహణలో అమరులైన వారి త్యాగాలు మరువలేనివని, అడవుల సంరక్షణ కోసం వారు చేసిన ప్రాణత్యాగాలకు విలువకట్టలేమని అటవీ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పోడెం వీరయ్య పేర్కొన్నారు. అటవీ శాఖ అమరవీరుల దినం సందర్భంగా బుధవారం నెహ్రూ జూలాజికల్ పార్క్‌లోని అమరుల స్మారక చిహ్నం వద్ద పోడెం వీరయ్య, అటవీ దళాల ప్రధాన సంరక్షణాధికారి ఆర్ఎం డోబ్రియాల్ తదితరులు పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వీరయ్య మాట్లాడుతూ.. అడవులకూ, ఆదివాసీలకు అవినాభావ సంబంధం ఉన్నదని, నిజమైన అడవుల పరిరక్షకులు ఆదివాసీలేనని చెప్పారు. అడవుల పరిరక్షణ మనందరి బాధ్యత అని తెలిపారు. ఆర్ఎం డోబ్రియాల్ మాట్లాడుతూ.. 1984 నుంచి ఇప్పటివరకు విధి నిర్వహణలో 22 మంది సిబ్బంది ప్రాణాలు కోల్పోయారంటూ వారి సేవలను స్మరించుకున్నారు.

## ఐఎంజీ భారత్‌కు భూములపై పిటిషన్లు కొట్టివేత

హైదరాబాద్, సెప్టెంబర్ 11 (నమస్తే తెలంగాణ): నాటి ఉమ్మడి ఏపీ సీఎం చంద్రబాబునాయుడు హైదరాబాద్‌లో అత్యంత ఖరీదైన 855 ఎకరాల భూమి, పలు క్రీడా స్టేడియాల నిర్వహణను ఐఎంజీ భారత్ అకాడమీస్ ప్రైవేట్ లిమిటెడ్‌కు ఇవ్వడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన ఓ ప్రజాహిత వ్యాజ్యంతోపాటు పలు పిటిషన్లను హైకోర్టు కొట్టివేసింది. ఐఎంజీబీకి భూముల కేటాయింపుల వ్యవహార అంశాలు గతంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి భార్య విజయమ్మ వేసిన పిల్‌లో, పాల్వాయి గోవర్ధన్‌రెడ్డి దాఖలు చేసిన క్రిమినల్ కేసులోనూ ఉన్నాయని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జే శ్రీనివాస్‌రావుతో కూడిన ధర్మాసనం పేర్కొంది. వీటి గురించి చెప్పకుండా సీనియర్ జర్నలిస్ట్ ఏబీకే ప్రసాద్, ఎంపీ విజయసాయిరెడ్డి, న్యాయవాది శ్రీరంగారావు 2012లో దాఖలు చేసిన పిటిషన్లను ధర్మాసనం కొట్టివేసింది. చట్టం చదరంగం ఏమీ కాదని ఘాటుగా స్పందించింది. నాటి క్రీడల మంత్రి పీ రాములుకు విజయసాయిరెడ్డి రాజకీయ ప్రత్యర్థి అని గుర్తుచేసింది.

## ప్రజాపాలన దినంగా సెప్టెంబర్ 17

హైదరాబాద్, సెప్టెంబర్ 11(నమస్తే తెలంగాణ): సెప్టెంబర్ 17ను ప్రజాపాలన దినంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు బుధవారం సీఎస్ శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు. హైదరాబాద్‌తోపాటు అన్ని జిల్లాకేంద్రాల్లో జాతీయ జెండాలను ఆవిష్కరించనున్న ప్రజాప్రతినిధుల పేర్లను ఖరారు చేశారు. హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి త్రివర్ణ పతాకాన్ని ఎగురవేయనున్నారు. జిల్లాల్లో మంత్రులు, స్పీకర్, మండలి చైర్మన్ పతాకావిష్కరణ చేస్తారు.

## ఢిల్లీ మద్యం విధానం కేసులో పిళ్లైకి బెయిల్

హైదరాబాద్, సెప్టెంబర్11 (నమస్తే తెలంగాణ): ఢిల్లీ మద్యం విధానం కేసులో హైదరాబాద్ వ్యాపారి అరుణ్ రామచంద్ర పిళ్లైకి ఢిల్లీ హైకోర్టు బెయిల్ మంజూరుచేసింది. పిళ్లైని ఈడీ 2023 మార్చిలో అరెస్ట్ చేసింది. పలుమార్లు ఆయన వాంగ్మూలాన్ని నమోదు చేసింది.

## నేటి నుంచి ఎడ్‌సెట్ తుది విడత కౌన్సెలింగ్

హైదరాబాద్, సెప్టెంబర్ 11 (నమస్తే తెలంగాణ): రెండేండ్ల బీఈడీ కోర్సుల్లో సీట్ల భర్తీకి నిర్వహించే ఎడ్‌సెట్ తుది విడత కౌన్సెలింగ్ గురువారం నుంచి ప్రారంభంకానుంది. 17 వరకు రిజిస్ట్రేషన్‌కు, 20 వరకు వెబ్ ఆప్షన్లకు, 21న వెబ్ ఆప్షన్ల సవరణకు అవకాశం కల్పించగా, 25న సీట్లు కేటాయిస్తారు. సీట్లు పొందిన వారు 30లోగా కాలేజీల్లో రిపోర్ట్ చేయాలని ప్రవేశాల కమిటీ కన్వీనర్ ప్రొఫెసర్ రమేశ్‌బాబు సూచించారు.

## 14 వరకు ఆధార్ ఫ్రీ అప్‌డేట్

హైదరాబాద్, సెప్టెంబర్ 11(నమస్తే తెలంగాణ) : ఆధార్ కార్డులో పొరపాట్లను ఫ్రీగా అప్‌డేట్ చేసుకునేందుకు 14 వరకు గడువు ఇచ్చారు. ఆధార్ అప్‌డేట్‌కు గుర్తింపు, చిరునామా రుజువులు సమర్పించాల్సి ఉంటుంది. ఉడాయ్(యూనిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా)మీ సమాచారాన్ని రికార్డుల ప్రకారం సరిచూసి అప్‌డేట్ చేస్తుంది. ఈ నెల 14 తర్వాత ఆధార్ అప్‌డేట్‌కు రూ.50 చెల్లించాల్సి ఉంటుంది.

## దసరా, దీపావళికి 24 ప్రత్యేక రైళ్లు

హైదరాబాద్, సెప్టెంబర్ 11 (నమస్తే తెలంగాణ): దసరా, దీపావళి సందర్భంగా సికింద్రాబాద్-తిరుపతి, శ్రీకాకుళం-తిరుపతి రైల్వే స్టేషన్ల మధ్య 24 ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేసినట్టు దక్షిణ మధ్య రైల్వే అధికారులు బుధవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈ రైళ్లు కాచిగూడ, ఉందానగర్, జడ్చర్ల, మహబూబ్‌నగర్, వనపర్తి, కర్నూల్, డోన్, కడప, రేణిగుంట మీదుగా నడుస్తాయన్నారు. రేణిగుంట, నెల్లూరు, తెనాలి, విజయవాడ, ఏలూరు, రాజమండ్రి, సామర్లకోట, తుని, కొత్తవలస, చీపురుపల్లి స్టేషన్ల మీదుగా అక్టోబర్ 5 నుంచి నవంబర్ 11 వరకు నడుస్తాయని పేర్కొన్నారు.



వాణిజ్య

# మేకిన్ తెలంగాణే లక్ష్యం

ఏఐని అందరికీ అందుబాటులోకి తేవాలి • రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు

హైదరాబాద్, సెప్టెంబర్ 11 (నమస్తే తెలంగాణ): రాష్ట్రాన్ని ఉత్పాదక రంగంలో అగ్రగామిలా నిలిపేలా 'మేకిన్ తెలంగాణ' భావనను పెంపొందించాల్సిన అవసరం ఉందని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పారిశ్రామిక రంగానికి పిలుపునిచ్చారు. దేశీయ మార్కెట్‌లో తెలంగాణ ఉత్పత్తులకు ఆదరణ ఉండేలా నాణ్యతకు ప్రాధాన్యతనివ్వాలని సూచించారు. క్వాలిటీ సర్కిల్ ఫోరం ఆఫ్ ఇండియా (క్యూసీఎఫ్ఐ) హైదరాబాద్ చాప్టర్ 38వ వార్షిక సదస్సును బేగంపేటలోని ఓ హోటల్‌లో ప్రారంభించిన అనంతరం ఆయన ప్రసంగించారు. పరిమాణంపైనే కాకుండా నాణ్యతకు ప్రాధాన్యతనిస్తే దేశమంతా మనవైపు చూస్తుందన్నారు. ఇక ఉద్యోగుల సృజనాత్మకతను వెలికితీసి ఆయా రంగాల్లో ఉత్పాదకతను పెంచేందుకు క్వాలిటీ ఫోరం చేస్తున్న కృషిని మంత్రి



క్యూసీఎఫ్ఐ సదస్సును జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న మంత్రి శ్రీధర్ బాబు

శ్రీధర్ బాబు అభినందించారు. 'క్యాంపస్ టు కార్పొరేట్' అనే మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని రూపొందించడం ప్రశంసనీయమని కొనియాడారు. క్వాలిటీ సర్కిల్ శిక్షణ కార్యక్రమాలకు సహకరించిన ఈసీఐఎల్, ఎన్ఎండీసీ, ఆర్టీసీ, థర్మోపాడ్స్, థర్మోకేబుల్స్, ఉషా ఇంటర్నేషనల్, టాటా గ్రూప్, రేణుకా ప్లాస్టిక్, తోషిబా, రామ్‌కో, కేసీపీ సిమెంట్స్, హెచ్ఏఎల్, మిధాని, బీఈఎల్ సంస్థలకు ఈ సందర్భంగా మంత్రి ప్రోత్సాహకాలు అందజేశారు.

**కృత్రిమ మేధను ప్రోత్సహిస్తాం**

కృత్రిమ మేధస్సు (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ లేదా ఏఐ)ను అందరికీ అందుబాటులోకి తెచ్చేందుకు సీఎం రేవంత్ రెడ్డి సారథ్యంలోని తెలంగాణ ప్రభుత్వం తన వంతు కృషి చేస్తోందని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. రోజువారీ కార్యక్రమాల్లోనూ ఏఐ భాగమైపోయిందని, దీనిని మరింతగా ప్రోత్సహించేందుకు ప్రభుత్వం తగిన విధానాలతో ముందుకుపోతోందని చెప్పారు. ఇందులో భాగంగానే విద్యార్థుల భవిష్యత్ అవసరాలు తీర్చేలా స్కిల్డ్ వర్సిటీల ఏర్పాటుకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. ఏఐ వినియోగంపై ఉద్యోగులు, కార్మికులు, పరిశ్రమ ప్రతినిధులకు అవగాహన కల్పిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఫోరం జాతీయ చైర్మన్ శ్యామ్ మోహన్, హైదరాబాద్ చాప్టర్ చైర్మన్ బాలకృష్ణరావులు కూడా మాట్లాడారు.

## 2 రోజుల్లో 1,000 అప్



మళ్లీ పెరుగుతున్న బంగారం ధరలు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 11: బంగారం మళ్లీ ప్రియమవుతున్నది. ప్రస్తుత పండుగ సీజన్‌కావడంతో కొనుగోళ్లు ఊపందుకున్నాయి. దీంతో గడిచిన రెండు రోజుల్లో పుత్తడి ధర రూ.1,000 ఎగబాకింది. ఢిల్లీ బులియన్ మార్కెట్లో తులం ధర మరో రూ.500 పెరిగి రూ.74,600 పలికింది. అంతకుముందు ఈ ధర రూ.74,100గా ఉన్నది. బంగారంతోపాటు వెండి కూడా పరుగులు పెట్టింది. పారిశ్రామికవర్గాలు, నాణేల తయారీదారుల నుంచి డిమాండ్ ఉండటంతో కిలో వెండి రూ.500 అధికమై రూ.85 వేలకు చేరుకున్నది. ఇటు హైదరాబాద్‌లో 22 క్యారెట్ తులం పుత్తడి ధర రూ.380 అధికమై రూ.67,150కి చేరుకోగా, 24 క్యారెట్ ధర రూ.410 ఎగబాకి రూ.73,250కి చేరుకున్నది. అలాగే కిలో వెండి రూ.500 ఎగబాకి రూ.91,500 పలికింది. గ్లోబల్ మార్కెట్లో ఔన్స్ ధర 2,550.90 డాలర్లు పలుకగా, వెండి 29.11 డాలర్లకు చేరుకున్నది.

# మళ్లీ భారత్‌కు ఫోర్డ్?

న్యూఢిల్లీ/చెన్నై, సెప్టెంబర్ 11: భారతీయ మార్కెట్‌కు గుడ్‌బై చెప్పిన అగ్రరాజ్యం ఆటో దిగ్గజం ఫోర్డ్.. త్వరలోనే రీఎంట్రీ ఇచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. అమెరికా పర్యటనలో ఉన్న తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్.. ఆ సంస్థ ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తమ రాష్ట్రంతో మూడు దశాబ్దాలుగా ఉన్న అనుబంధాన్ని కొనసాగించాలని, చెన్నైలోని ప్లాంట్‌ను తిరిగి తెరవాలని స్టాలిన్ కోరారు. ఈ మేరకు తమిళనాడు సీఎం 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. దీంతో ఫోర్డ్ పునరాగమనంపై తిరిగి అంచనాలు ఏర్పడుతున్నాయి. కాగా, 2021లో భారతీయ మార్కెట్ నుంచి ఫోర్డ్ వైదొలగిన విషయం తెలిసిందే. భారీ నష్టాలతోనే కంపెనీ ఈ నిర్ణయం తీసుకున్నది. అంతేగాక చెన్నైలోని తమ ప్లాంట్‌నూ జేఎస్‌డబ్ల్యూ గ్రూప్‌నకు అమ్మాలనుకున్నది. అయితే గత ఏడాది డిసెంబర్‌లో ఈ ప్రణాళికల నుంచి వెనక్కి తగ్గింది. ఈ క్రమంలోనే ఈ ఏడాది జనవరిలో కొత్త ప్రణాళికలకు శ్రీకారం కూడా చుట్టింది. అయితే మళ్లీ పెద్దగా కదలికలేవీ లేకపోవడంతో ఫోర్డ్ రాక సందిగ్ధంలో పడింది. కానీ స్టాలిన్ అభ్యర్థనకు ఫోర్డ్ నుంచి సానుకూల స్పందనే వచ్చినట్టు తెలుస్తున్నది. దీంతో ఫోర్డ్‌పై మళ్లీ ఊహాగానాలు ఊపందుకుంటున్నాయి. ఇదిలావుంటే చెన్నై ప్లాంట్‌లో హైబ్రిడ్, ఎలక్ట్రిక్ వెహికిల్స్ (ఈవీ)ను తయారు చేసేందుకు ఫోర్డ్ ఆసక్తితో ఉన్నట్టు సమాచారం. 1990లో ఫోర్డ్.. భారతీయ మార్కెట్‌లోకి ప్రవేశించింది. 2019లో మహీంద్రా అండ్ మహీంద్రాతో జట్టు కట్టినా కలిసిరాలేదు. కరోనా పరిస్థితుల నడుమ పూర్తిగా దేశీయ మార్కెట్‌కు దూరమైంది.






# ఎంజీ మోటర్ సరికొత్త ఈవీ

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 11: ఎంజీ మోటర్.. దేశీయ మార్కెట్లోకి మరో ఈవీని పరిచయం చేసింది. మూడు రకాల్లో లభించనున్న ఈ కారు ప్రారంభ ధర రూ.9.99 లక్షలు. ఈ ధరలు ఢిల్లీ షోరూంనకు సంబంధించినవి. 38 కిలోవాట్ల బ్యాటరీ ప్యాక్ కలిగిన ఈ కారు సింగిల్ చార్జింగ్‌తో 331 కిలోమీటర్లు ప్రయాణించనున్నది. 15.6 ఇంచుల టచ్‌స్క్రీన్, 8.8 ఇంచుల డిజిటల్ డ్రైవర్ డిస్‌ప్లే, వైర్‌లెస్ ఫోన్ చార్జింగ్, ఆటోమేటిక్ ఏసీ, ఆరు ఎయిర్‌బ్యాగ్, టైర్ ప్రెషర్ మానిటరింగ్ సిస్టమ్, ఎలక్ట్రానిక్ స్టేబిలిటీ కంట్రోల్ సిస్టమ్ వంటి ఫీచర్స్‌తో తీర్చిదిద్దింది. 3.3 కిలోవాట్ల ఏసీ చార్జర్ 13.8 గంటల్లో బ్యాటరీ చార్జింగ్ కానుండగా, 7.4 కిలోవాట్ల బ్యాటరీ 6.5 గంటల్లో, 50 కిలోవాట్ల డీసీ ఫాస్ట్ చార్జర్ కేవలం 55 నిమిషాల్లో పూర్తిగా రీచార్జికానున్నది. టాటా నెక్సాన్, మహీంద్రా ఎక్స్‌యూవీ 400, టాటా పంచ్‌లకు పోటీగా ఈ మాడల్‌ను ప్రవేశపెట్టింది.

## అలోపెక్స్‌తో భారత్ బయోటెక్ జట్టు

హైదరాబాద్, సెప్టెంబర్ 11: యాంటీ-మైక్రోబయాల్ వ్యాక్సిన్ ఏవీ0328 కోసం అలోపెక్స్ కంపెనీతో భారత్ బయోటెక్ జట్టు కట్టింది. భారత్‌తోపాటు ఇతర అల్పాదాయ, దిగువ మధ్యశ్రేణి ఆదాయ దేశాల్లో ఏవీ0328 అమ్మకాలు జరుగనున్నాయని సంస్థలు తెలిపాయి. 'అలోపెక్స్ సంస్థ సహకారంతో అవసరం ఉన్న దేశాల్లో ఏవీ0328 వ్యాక్సిన్‌ను తీసుకొస్తుండటం మాకు గర్వంగా ఉన్నది. వ్యాక్సినేషన్ ద్వారా యాంటీ-మైక్రోబయాల్ రెసిస్టెన్స్‌ను తగ్గించే మార్గాలను అందుబాటులోకి తేవడమే మా లక్ష్యం. సురక్షిత, నాణ్యమైన వ్యాక్సిన్లను అందుబాటు ధరల్లో తీసుకురావడానికే మా ఈ భాగస్వామ్యం' అని హైదరాబాద్ కేంద్రంగా పని చేస్తున్న ప్రముఖ ఔషధ రంగ సంస్థ భారత్ బయోటెక్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ కృష్ణ ఎల్లా అన్నారు.

# 30 కోట్ల నీరవ్ ఆస్తులు జప్తు

**పీఎన్‌బీ కేసులో తాజాగా అటాచ్ చేసిన ఈడీ**



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 11: నీరవ్ మోదీకి చెందిన మరో రూ.29.75 కోట్ల విలువైన ఆస్తుల్ని జప్తు చేసినట్టు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) బుధవారం తెలిపింది. దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన 2 బిలియన్ డాలర్ల (డాలర్‌తో పోల్చితే ప్రస్తుత రూపాయి విలువలో దాదాపు రూ.17 వేల కోట్లు) పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) కుంభకోణంలో వజ్రాల వ్యాపారి నీరవ్ మోదీ ప్రధాన నిందితుడిగా ఉన్న విషయం తెలిసిందే. ఆయన మేనమామ, రత్నాల వ్యాపారి మెహుల్ చోక్సీ సైతం కీలక నిందితుడే. ఇక ఈ వ్యవహారంలో మనీ లాండరింగ్ నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసిన ఈడీ.. ఇప్పటిదాకా దేశ, విదేశాల్లోని రూ.2,596 కోట్ల విలువైన నీరవ్ ఆస్తుల్ని అటాచ్ చేసింది. కాగా, తాజా జప్తులో బ్యాంక్ డిపాజిట్లు, భూమి, భవనాలున్నట్టు ఓ ప్రకటనలో ఈడీ పేర్కొన్నది. పీఎన్‌బీ మోసం నేపథ్యంలో నీరవ్ మోదీ, మెహుల్ చోక్సీలు దేశం విడిచి పరారైపోగా.. నీరవ్ ఇప్పుడు బ్రిటన్ జైలులో ఉన్నాడు. అతని అప్పగింత కోసం ఈ కేసును దర్యాప్తు చేస్తున్న సీబీఐ విశ్వ ప్రయత్నాలనే చేస్తున్నది. ముంబైలోని బ్రాడీ హౌజ్ పీఎన్‌బీ శాఖ కేంద్రంగా ఈ కుంభకోణం జరిగింది. బ్యాంక్ ఉన్నతాధికారులతో కలిసి నకిలీ/మోసపూరిత ఎల్‌వోయూలతో నీరవ్, చోక్సీలు వేల కోట్ల రుణాలను పొందారు. ఇక ఈ కేసు దర్యాప్తులో భాగంగా ఇప్పటిదాకా రూ.1,052.42 కోట్ల సొమ్మును పీఎన్‌బీ, ఇతర బ్యాంకులకు అప్పజెప్పినట్టు ఈడీ వర్గాలు చెప్తున్నాయి.

## త్వరలో ఎంఎస్‌ఎంఈ పాలసీ

జయేశ్ రంజన్



హైదరాబాద్, సెప్టెంబర్ 11 (నమస్తే తెలంగాణ): టెక్నాలజీని ఆధునీకరించడంతోపాటు ఉత్పత్తిని మరింత పెంచేందుకు దోహదపడే విధంగా నూతన ఎంఎస్‌ఎంఈ పాలసీని త్వరలో అందుబాటులోకి తీసుకురాబోతున్నట్టు ఐటీ, పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ చెప్పారు. సాంకేతికతను మెరుగుపర్చేందుకు ద్రవ్యపరమైన మద్దతునిచ్చే మొదటి రాష్ట్రంగా తెలంగాణ అవతరిస్తుందని సీఐఐ ఆధ్వర్యంలో డిఫెన్స్ మరియు స్పేస్ సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొని ఆయన ప్రసంగించారు. మౌలిక సదుపాయాలు, ప్రతిభ, నూతన ఆవిష్కరణల ఆవశ్యకతను ప్రస్తావిస్తూ, తెలంగాణ రాష్ట్రం ప్రైవేటు సంస్థల భాగస్వామ్యంతో రక్షణ, ఏరోస్పేస్ రంగంలో వృద్ధిని కొనసాగిస్తున్నదని వివరించారు.

## • పంట నష్టపరిహారం ఎక్కడ?



భారీ వర్షాలకు పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పరిహారం అందించాలని కామారెడ్డి జిల్లా పెద్దకొడప్‌లో రైతు సంఘాల ఆధ్వర్యంలో బుధవారం రైతులు ధర్నా నిర్వహించారు. వీరికి బీఆర్‌ఎస్ నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ..ఇప్పటి వరకు వ్యవసాయాధికారులు పంటలను పరిశీలించలేదని ఆరోపించారు. ప్రభుత్వం ఆదుకోకపోతే రైతుల కుటుంబాలు రోడ్డున పడుతాయని వాపోయారు. అనంతరం తహసీల్దార్ దశరథ్, మండల వ్యవసాయ అధికారి కిషన్‌కు వినతిపత్రం అందజేశారు. ధర్నా ముగిసిన తరువాత కొందరు రైతులు పెద్దకొడప్‌గల్ రైతువేదిక వద్దకు వెళ్లగా తాళం వేసి ఉంది. ఉదయం 11.30 గంటలైనా ఒక్క అధికారి రాకపోవడంతో అన్నదాతలు అసహనం వ్యక్తంచేశారు. ఏవో కిషన్‌తో మాట్లాడి.. వచ్చేవరకు రైతువేదిక వద్ద పడిగాపులు కాశారు.

- పెద్ద కొడప్‌గల్

# రుణమాఫీ కాలేదని రైతు ఆత్మహత్యాయత్నం

- జగిత్యాల దవాఖానలో చావు బతుకుల్లో రైతు సాగర్‌రెడ్డి
- గతంలో రైతుధర్నాలోనే ఆత్మహత్యాయత్నం
- ఇరవై రోజులైనా పరిష్కారం చూపని అధికారులు



జగిత్యాల దవాఖానలో చికిత్స పొందుతున్న రైతు ఏనుగు సాగర్‌రెడ్డి

జగిత్యాల, సెప్టెంబర్ 11 (నమస్తే తెలంగాణ): రుణమాఫీ కాలేదని ఇరువై రోజుల క్రితం రైతు ధర్నాలో ఆత్మహత్యాయత్నం చేసిన జగిత్యాల జిల్లాకు చెందిన ఓ రైతు తీవ్ర ఆవేదనతో మరోసారి ఆత్మహత్యకు యత్నించాడు. ప్రస్తుతం దవాఖానలో చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నాడు. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. జగిత్యాల జిల్లా కథలాపూర్ మండలం భూషణ్‌రావుపేటకు చెందిన ఏనుగు సాగర్‌రెడ్డి(40)కి మూడెకరాలు ఉంది. భార్య మంజుల పేరున రెండెకరాలు ఉంది. సాగర్‌రెడ్డి భూషణ్‌రావుపేటలో ఉన్న సింగిల్ విండోలో ₹50వేలు, దక్కన్ గ్రామీణ బ్యాంకులో ₹లక్ష రుణం తీసుకున్నాడు. మంజుల దక్కన్ గ్రామీణ బ్యాంకులో ₹1.60 లక్షల పంట రుణం తీసుకున్నది. సీఎం రేవంత్‌రెడ్డి రెండు లక్షల వరకు రుణమాఫీ చేస్తామని చెప్పడంతో తన పేరిట ఉన్న ₹1.50 లక్షల రుణం, తన భార్య పేరిట ఉన్న ₹1.60 లక్షల రుణంలో కనీసం ఒకటి మాఫీ అవుతుందని భావించాడు. అనూహ్యంగా ఇద్దరికీ రుణమాఫీ కాకపోవడంతో తీవ్ర ఆందోళనకు గురయ్యాడు. వ్యవసాయ అధికారులు, బ్యాంకు అధికారులను కలిసి విన్నవించినా ప్రయోజనం లేకపోవడంతో మంగళవారం రాత్రి భూషణ్‌రావుపేటలోనే పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. కుటుంబ సభ్యులు వెంటనే ఆయనను కథలాపూర్‌లోని ప్రైవేట్ దవాఖానకు తరలించారు. పరిస్థితి విషమించడంతో జగిత్యాల ప్రధాన దవాఖానకు తీసుకెళ్లారు.

**అధికారులు స్పందించి ఉంటే...**

రుణమాఫీ కోసం ఆగస్టు 20న కథలాపూర్‌లో రైతులు భారీ ధర్నాను చేపట్టారు. ధర్నాలో పాల్గొన్నప్పుడే సాగర్‌రెడ్డి పురుగుల మందు తాగే ప్రయత్నం చేశాడు. పోలీసులు ఆ ప్రయత్నాన్ని అడ్డుకున్నారు. అన్ని మీడియాల్లోనూ సాగర్‌రెడ్డి ఆత్మహత్యాయత్నం ప్రచురితమైంది. అయినా అధికారుల నుంచి ఎలాంటి స్పందన రాలేదు. సీఎం రేవంత్‌రెడ్డినే తన భర్త ఆత్మహత్యాయత్నానికి కారణమని భార్య మంజుల ఆరోపించింది. బుధవారం రాత్రి రైతు సాగర్‌రెడ్డిని జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత పరామర్శించారు.

## • ఫార్మాసిటీ వద్దే వద్దు



రంగారెడ్డి జిల్లా యాచారం మండలంలోని మేడిపల్లి గ్రామ రైతులు తమ భూముల్లో ఫార్మాసిటీని ఏర్పాటు చేయొద్దని బుధవారం ఆందోళనకు దిగారు. ఫార్మా వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్థూపం వద్ద నల్ల బ్యాడ్జీలను ధరించి నిరసన తెలిపారు. మేడిపల్లిలో ఫార్మాసిటీని ఏర్పాటు చేస్తే మరో ఉద్యమానికి రైతులు సిద్ధం కానున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో రైతులు గణేశ్, పాపిరెడ్డి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

- యాచారం

## చిన్నారిని కాపాడిన బ్లూకోల్ట్స్ పోలీసులు



చిన్నారిని దవాఖానకు తీసుకెళ్తున్న పోలీసులు

సీసీసీ నస్పూర్, సెప్టెంబర్ 11: ఫిట్స్ వచ్చి అపస్మారక స్థితికి చేరిన ఏడాది వయస్సు గల చిన్నారిని సకాలంలో దవాఖానకు తరలించి మంచిర్యాల జిల్లా సీసీసీ నస్పూర్ బ్లూకోల్ట్స్ పోలీసులు ఔదార్యాన్ని చాటుకున్నారు. శ్రీరాంపూర్‌కు చెందిన బాబుకు బుధవారం తీవ్ర జ్వరం రావడంతో తల్లిదండ్రులు మంచిర్యాల దవాఖానకు తీసుకెళ్లారు. సాయంత్రం తిరిగి ఇంటికి వస్తుండగా, సీసీసీ కార్నర్ వద్దకు చేరుకోగానే బాబుకు ఫిట్స్ వచ్చింది. అక్కడే విధుల్లో ఉన్న పోలీసులు బాబుకు ప్రథమ చికిత్స చేసి తమ బైక్‌పై సమీపంలోని దవాఖానకు తరలించారు. బాబు ఆరోగ్యం నిలకడగా ఉందని డాక్టర్లు తెలిపారు.

## • తలుపులకు వినతి!



కరెంటు సమస్యను పరిష్కరించాలంటూ విద్యుత్‌శాఖ కార్యాలయ తలుపులకు వినతిపత్రాన్ని అంటించిన ఘటన నారాయణపేట జిల్లా మక్తల్ మండలంలో బుధవారం చోటు చేసుకున్నది. కచ్‌వార్ గ్రామంలో తరచూ కరెంట్ సమస్య వేధిస్తుండడంతో ఆగ్రహం వ్యక్తంచేసిన స్థానికులు, రైతులు.. మక్తల్ సబ్‌స్టేషన్ వద్ద ఉన్న అసిస్టెంట్ ఇంజినీర్ ఆపరేషన్ కార్యాలయానికి తరలివెళ్లగా ఏఈతో సహా సిబ్బంది లేకపోవడంతో తలుపునకు వినతిపత్రాన్ని అంటించి వెనుదిరిగారు.

-మక్తల్



సిద్దిపేట జిల్లా మద్దూరు జూనియర్ కళాశాలలో మరుగుదొడ్డి వద్ద క్యూలైన్ కట్టిన విద్యార్థులు

# ఒక్క మరుగుదొడ్డి.. 150 మంది క్యూ!

మద్దూరు (ధూళిమిట్ట), సెప్టెంబర్ 11(నమస్తే తెలంగాణ): సిద్దిపేట జిల్లా మద్దూరు మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఒకే ఒక్క మరుగుదొడ్డి ఉన్నది. దీంతో విద్యార్థినులు చెప్పుకోలేని బాధను అనుభవిస్తున్నారు. కళాశాలలో 150 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇందులో 90 మంది బాలికలు, 60 మంది బాలురు ఉన్నారు. వీరికి తోడు 15 మంది అధ్యాపకులు ఉన్నారు. వీరందరికీ కలిపి కళాశాల ఆవరణలో ఒకే ఒక్క మరుగుదొడ్డి ఉంది. దీంతో విరామ సమయంలో బాలికలు మరుగుదొడ్డి వద్ద క్యూలైన్ కట్టడం నిత్యకృత్యమైంది. బాలురు, అధ్యాపకులు మాత్రం ఆరుబయటకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. ఉన్న ఒక్క మరుగుదొడ్డి సైతం శిథిలావస్థకు చేరింది. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో మరుగుదొడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేసినా పనులు చేసేందుకు కాంట్రాక్టర్ ముందుకు రాకపోవడంతో నిధులు వెనక్కి పోయాయి. మరిన్ని మరుగుదొడ్లను నిర్మించి తమ ఇబ్బందులు తీర్చాలని విద్యార్థులు కోరుతున్నారు.

# గురుకులంలో మరో విద్యార్థికి పాముకాటు

- కరీంనగర్ దవాఖానలో చికిత్స.. తప్పిన ప్రమాదం
- సుల్తానాబాద్ శాస్త్రీనగర్ కళాశాలలో ఘటన
- పాడుబడిన రైస్‌మిల్ పక్కనే కళాశాల ఏర్పాటు
- అపరిశుభ్ర పరిసరాలే కారణమని తల్లిదండ్రుల ఫైర్



కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానలో చికిత్స పొందుతున్న విద్యార్థి మన్విత్

సుల్తానాబాద్, సెప్టెంబర్ 11: అధ్వానంగా మారిన గురుకులాల్లో పిల్లల ప్రాణాలకు గ్యారెంటీ లేకుండా పోతున్నది. ఇటీవల మెట్‌పల్లి మండలంలోని గురుకుల పాఠశాలలో ఇద్దరు విద్యార్థులు మృతి చెందడం కలకలం రేపింది. తాజాగా పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ పట్టణంలోని శాస్త్రీనగర్ సాంఘిక సంక్షేమ గురుకుల కాలేజీలో బుధవారం ఓ విద్యార్థి పాముకాటుకు గురికావడం ఆందోళన కలిగించింది. సుల్తానాబాద్ పట్టణంలోని శాస్త్రీనగర్ గురుకుల కళాశాలలో జూలపల్లి మండలం కాచాపూర్‌కు చెందిన బత్తిని మన్విత్ ఆరో తరగతి చదువుతున్నాడు. ఎప్పటిలాగే బుధవారం మధ్యాహ్న భోజనం చేశాడు. కాసేపటికి మలవిసర్జన కోసం ఆవరణలోని బాత్‌రూమ్‌కు వెళ్తుండగా పాముకాటు వేసింది. దీంతో మన్విత్ కేకలు వేయడంతో సిబ్బంది వెంటనే గమనించి సుల్తానాబాద్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం వైద్యుడి సూచనల మేరకు కరీంనగర్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ప్రస్తుతం ప్రాణానికి ఎలాంటి ప్రమాదం లేకపోయినప్పటికీ 24 గంటలు పర్యవేక్షణలో ఉండాలని వైద్యులు సూచించారు. విషయం తెలుసుకున్న ఎస్సై శ్రావణ్‌కుమార్ సిబ్బంది కలిసి దవాఖానకు చేరుకుని విద్యార్థి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కళాశాల ఆవరణ అపరిశుభ్రంగా ఉండటం, పక్కనే పాడుబడ్డ రైస్‌మిల్లు ఉండటంతో పాములు సంచరిస్తున్నాయని తల్లిదండ్రులు వాపోతున్నారు.

# కుక్క కాట్లపై సర్కారు మొద్దు నిద్ర

- ఈ ఏడాది ఇప్పటికే 60 వేల మంది బాధితులు
- జీహెచ్‌ఎంసీ పరిధిలోనే 10 లక్షల వీధి కుక్కలు
- కుక్కకాటు మృతులకు రూ.5 లక్షలు ఇవ్వాలి
- మాజీ మంత్రి హరీశ్‌రావు డిమాండ్



హైదరాబాద్, సెప్టెంబర్ 11 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో కుక్కకాట్లకు చిన్నారులు బలవుతున్నా కాంగ్రెస్ సర్కారుకు చీమ కుట్టినట్టు కూడా లేకపోవటం దుర్మార్గమని మాజీమంత్రి హరీశ్‌రావు ధ్వజమెత్తారు. కుక్కలు పీక్కుతినడం, కుక్కకాటుకు మరణాలు అనే వార్తలు రాష్ట్రంలో సాధారణంగా మారిపోయాయని, కుక్క కాట్లు పెరిగిపోతున్నాయని ముందే ప్రభుత్వాన్ని హెచ్చరించినా పట్టించుకోలేదని ఎక్స్ వేదికగా సర్కారు తీరును ఎండగట్టారు. ప్రభుత్వ నిర్లక్ష్యానికి ఈ ఏడాది రాష్ట్రంలో 60వేలకు పైగా కుక్క కాట్లు నమోదయ్యాయని, పదుల సంఖ్యలో ప్రాణాలు కోల్పోయారని, ఎన్నో కుటుంబాల్లో విషాదం నిండిందని తెలిపారు. నియంత్రణ పక్కనపెడితే, ప్రభుత్వ దవాఖానల్లో కనీసం యాంటిరేబిస్ ఇంజక్షన్లనూ అందుబాటులో ఉంచలేదని మండిపడ్డారు. గ్రామాల్లో, పట్టణాల్లో పారిశుధ్య నిర్వహణ పడకేసిందని, చెత్తాచెదారం పేరుకుపోయి వీధికుక్కల బెడద విపరీతంగా పెరిగిపోయిందని అన్నారు. పురపాలకశాఖ వైఫల్యం వల్ల వీధి కుక్కల నియంత్రణ లేక మనుషుల ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయని, రాష్ట్రంలో 20 లక్షలకు పైగా వీధికుక్కలు ఉంటే అందులో 10 లక్షలకు పైగా కుక్కలు జీహెచ్‌ఎంసీ పరిధిలోనే ఉన్నాయంటే ప్రభుత్వ యంత్రాంగ వైఫల్యం స్పష్టంగా కనిపిస్తున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. కుక్కల సంతాన నియంత్రణ ఆపరేషన్లకు (స్టెరిలైజేషన్) ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవటం శోచనీయమని తెలిపారు. కుక్కకాటు మరణాలపై హైకోర్టు మందలించినా రాష్ట్ర ప్రభుత్వం మొద్దు నిద్రవీడటం లేదని, ఇప్పటికీ కుక్క కాట్ల నివారణకు ఎలాంటి కార్యాచరణ ప్రకటించలేదని ధ్వజమెత్తారు. గత మూడేండ్లుగా ఒక కుక్క కాటు మరణం సంభవించని గోవా లాంటి రాష్ట్రాల నియంత్రణ పద్ధతులను అధ్యయనం చేయాలని సూచించారు. హర్యానా, పంజాబ్ హైకోర్టుల తీర్పును దృష్టిలో పెట్టుకొని కుక్క కాటుతో మరణించినవారికి రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా, గాయపడిన వారికి రూ.50వేలు అందించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర హైకోర్టు సూచన మేరకు వీధి కుక్కల నియంత్రణకు కమిటీలు ఏర్పాటు చేయాలని, క్రమం తప్పకుండా స్టెరిలైజేషన్ చేయాలని హరీశ్‌రావు పేర్కొన్నారు.


## బదిలీ అయినట్టా? కానట్టా?

- బదిలీ చేసి నెలరోజులైనా ఉత్తర్వులివ్వని వైనం
- ఇదీ సాంఘిక సంక్షేమ గురుకుల బదిలీ ప్రక్రియ

హైదరాబాద్, సెప్టెంబర్11 (నమస్తే తెలంగాణ): తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థల సొసైటీ లో బదిలీ ప్రక్రియ అంతు చిక్కడం లేదు. సొసైటీలోని నాలుగో తరగతి ఉద్యోగులకు గత జూలై 31న బదిలీల ప్రక్రియను పూర్తి చేసినా ఇప్పటివరకు ఉత్తర్వులను మాత్రం ఇవ్వడం లేదు. ఇదేమంటే ఆ బదిలీల ప్రక్రియను కలెక్టర్లకు అప్పగించామని సొసైటీ ఉన్నతాధికారులు చెబుతుండగా, తమకేమీ సంబంధం లేదని కలెక్టర్లు బదులిస్తుండటం కొసమెరుపు. దీంతో ఈ ప్రక్రియ అంతా గందరగోళంగా మారింది. సొసైటీలో నాలుగవ తరగతి ఉద్యోగులు దాదాపు 400మందికిపైగా ఉన్నారు. బదిలీ కోసం జూలై31న కౌన్సెలింగ్ నిర్వహించారు. నెలన్నర గడచినా ఎలాంటి ఉత్తర్వులను ఉన్నతాధికారులు వెలువరించలేదు. దీంతో సొసైటీలోని నాలుగవ తరగతి ఉద్యోగులందరూ ఆందోళనకు గురవుతున్నారు. బదిలీలు ఉన్నట్టా? లేనట్టా? అని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. వెంటనే బదిలీ ఉత్తర్వులు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

# బీసీల జెండా ఎత్తితే బీఆర్‌ఎస్‌కు పూర్వవైభవం

- బీసీ ఉద్యమాలు పదునెక్కాలి: జస్టిస్ ఈశ్వరయ్య



ప్రొఫెసర్ జీ లక్ష్మణ్ రచించిన 'కులగణన-రిజర్వేషన్లు, శాస్త్రీయ అవగాహన' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న జస్టిస్ ఈశ్వరయ్య, ఎంపీ రవిచంద్ర, ప్రభుత్వ సలహాదారు కేకే, తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ జూలూరు గౌరీశంకర్ తదితరులు

ఖైరతాబాద్, సెప్టెంబర్ 11: బీసీల సమస్యలు, కులగణన ఉద్యమాన్ని బీఆర్‌ఎస్ తన భుజస్కంధాలపై వేసుకుంటే ఆ పార్టీకి పూర్వవైభవం వస్తుందని జాతీయ బీసీ కమిషన్ మాజీ చైర్మన్ జస్టిస్ వీ ఈశ్వరయ్య అభిప్రాయపడ్డారు. ప్రొఫెసర్ జీ లక్ష్మణ్ రచించిన 'కులగణన-రిజర్వేషన్లు, శాస్త్రీయ అవగాహన' పుస్తకాన్ని జస్టిస్ ఈశ్వరయ్య, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ప్రభుత్వ సలహాదారులు కే కేశవరావు, తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ జూలూరు గౌరీ శంకర్‌తో కలిసి సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఆవిష్కరించారు. జస్టిస్ ఈశ్వరయ్య మాట్లాడుతూ బీఆర్‌ఎస్ తిరిగి అధికారంలోకి రావాలంటే బీసీల సమస్యల జెండాను ఎత్తాలని కోరారు. బీసీలు చైతన్యంతో హక్కులను సాధించుకుంటే అగ్రకులాల వారు రిజర్వేషన్లు అడిగే దశకు వస్తారని, ఆ దిశగా బీసీ ఉద్యమాలు పదునెక్కాలని పిలుపునిచ్చారు. ఎంపీ రవిచంద్ర మాట్లాడుతూ బీసీల సమస్యల సాధనకు పార్లమెంట్‌లో కొట్లాడుతానని చెప్పారు. తెలంగాణ ప్రభుత్వ మంత్రివర్గ కూర్పులో ఇద్దరే బీసీ మంత్రులున్నారని, మున్నూరుకాపు, ముదిరాజ్, యాదవ, మైనార్టీలు వర్గాలకు ఎందుకు ప్రాతినిధ్యం కల్పించలేదని ప్రశ్నించారు. సామాజిక ఉద్యమకారుడు రౌతు కనకయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో తెలంగాణ వెనుకబడిన తరగతుల ఉద్యోగుల ఫెడరేషన్ చైర్మన్ దేవళ్ల సమ్మయ్య, ఆకుల రజిత్, సీనియర్ జర్నలిస్టు దుర్గం రవీందర్, వనమాల చంద్రశేఖర్, ఉస్మానియా అధ్యాపకుల సంఘం అధ్యక్షులు డీ మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

## రిటైర్‌మెంట్ డబ్బులు ఎప్పుడిస్తారు?

- ప్రభుత్వాన్ని నిలదీస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

హైదరాబాద్, సెప్టెంబర్ 11 (నమస్తె తెలంగాణ) : రాష్ట్రంలోని అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల సమస్యలను కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు జోరందుకున్నాయి. 65 ఏండ్లు దాటిన టీచర్లను ఉద్యోగం నుంచి తొలిగించినా రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ ఇవ్వలేదని అంగన్‌వాడీ టీచర్ల సంఘం నాయకులు నల్ల భారతి ఆరోపించారు. రిటైర్‌మెంట్ బెనిఫిట్ రూ.2 లక్షలు, ఆయాలకు రూ. లక్ష ఇస్తామని హామీ ఇచ్చారని, దీనిపై రాష్ట్ర ప్రభుత్వం నుంచి జీవో రావాల్సి ఉన్నా పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. అంగన్‌వాడీ టీచర్లకు ఐదు నెలలు నుంచి జీతాలు ఇవ్వడం లేదని, వంట గ్యాస్, కూరగాయల బిల్లులు సకాలంలో రావడంలేదని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా 35,700 అంగన్‌వాడీల్లో పని చేస్తున్న సిబ్బంది పదవీ విరమణతో ఐదు వేలకు పైగా టీచర్లు, ఆయాలు తగ్గిపోవడడంతో కేంద్రాల నిర్వహణ భారంగా మారిందని తెలిపారు. తమ డిమాండ్ల పరిష్కారం కోసం మంత్రి, అధికారులను సంప్రదిస్తున్నా ఇంతవరకు ఎలాంటి హామీ రాలేదని మండిపడ్డారు.

# కోచింగ్ సెంటర్లపై కొరడా

- కేంద్ర మార్గదర్శకాలు అమలు చేయాలని సర్కారు నిర్ణయం
- కొత్తగా లెక్చరర్ల నియామకానికి కాలేజీ సర్వీస్ కమిషన్
- ఇంజినీరింగ్ కాలేజీలుగా 9 పాలిటెక్నిక్ కాలేజీలు: మంత్రివర్గ ఉపసంఘం

హైదరాబాద్, సెప్టెంబర్ 11 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలోని పోటీపరీక్షలు సహా ఎస్‌సెట్, నీట్ వంటి ప్రవేశ పరీక్షలకు కోచింగ్ ఇస్తున్న కోచింగ్ సెంటర్లపై సర్కారు కొరడా ఝులిపించనున్నది. నిబంధనలు పాటించని కోచింగ్ సెంటర్లపై చర్యలు తీసుకోనున్నది. కేంద్ర ప్రభుత్వం సూచించిన మార్గదర్శకాలను అమలుచేయాలని క్యాబినెట్ సబ్‌కమిటీ నిర్ణయం తీసుకున్నది. ఇంటర్ నుంచి యూనివర్సిటీల వరకు అన్ని స్థాయిల్లో లెక్చరర్ల నియామకం కోసం కాలేజీ సర్వీస్ కమిషన్ ఏర్పాటు చేసే అంశాన్ని సర్కారు పరిశీలిస్తున్నది. ఈ నేపథ్యంలో విద్యారంగంలో సంస్కరణలకు ప్రభుత్వం నియమించిన మంత్రివర్గ ఉపసంఘం బుధవారం సచివాలయంలో భేటీ అయ్యింది. మంత్రి శ్రీధర్‌బాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో మంత్రి సీతక్క, విద్యాశాఖ ఉన్నతాధికారులు హాజరయ్యారు. కోచింగ్ సెంటర్ల నిర్వహణ విషయంలో కేంద్రం జారీచేసిన మార్గదర్శకాలను రాష్ట్రంలో అమలుచేయకపోవటంతో ఇటీవలే కేంద్రం సీరియస్ అయ్యింది. దీంతో ఆ మార్గదర్శకాలను రాష్ట్రంలో అమలుచేయాలని క్యాబినెట్ సబ్‌కమిటీ నిర్ణయించింది. సర్కారు బడుల్లో ఎన్‌రోల్‌మెంట్ తగ్గుతుండటంపై ఆందోళన వ్యక్తం చేస్తూ.. ఎన్‌రోల్‌మెంట్‌ను పెంచేందుకు చర్యలు తీసుకోవాలని సూచించింది. న్యూ ఎడ్యుకేషన్ పాలసీ (ఎన్‌ఈపీ), ప్రైవేట్ స్కూళ్లల్లో ఫీజుల నియంత్రణకు ఫీజు రెగ్యులేటరీ కమిటీ, తెలుగుభాష అమలు, ఆర్టీఈ ప్రకారం ప్రైవేట్ బడుల్లో 25 శాతం సీట్లు.. తదితర అంశాలపై సమావేశంలో చర్చించారు. ప్రాథమికోన్నత బడులను ప్రాథమిక పాఠశాలల్లో విలీనం చేసే అంశంపై నివేదికను సమర్పించాలని శ్రీధర్ బాబు సూచించారు. జీరో ఎన్‌రోల్‌మెంట్ ఉన్న స్కూళ్లల్లోని 1,600 మంది టీచర్లను ఇతర స్కూళ్లకు బదిలీచేయాలని ఆదేశించారు. 9 పాలిటెక్నిక్ కాలేజీలను ఇంజినీరింగ్ కాలేజీలుగా అప్‌గ్రేడ్ చేసే పనులను వేగవంతం చేయాలని తెలిపారు. ట్రిపుల్ ఐటీలో బయోసైన్సెస్, ఫార్మా కోర్సులను వచ్చే ఏడాది నుంచి ప్రవేశపెట్టాలని వెల్లడించారు. ప్రైవేట్ స్కూళ్లు, ఇంటర్ కాలేజీల్లో ఫీజుల నియంత్రణపై కమిటీ వేసే విషయాన్ని పరిశీలిస్తున్నట్టు తెలిపారు. సమావేశంలో విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం, ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ ఆర్ లింబాద్రి, ఇంటర్‌బోర్డు డైరెక్టర్ శృతి ఓజా తదితరులు పాల్గొన్నారు.

## ఎన్డీఎస్‌ఏ తుది నివేదికను తెప్పించండి

- అధికారులకు మంత్రి ఉత్తమ్ ఆదేశాలు

హైదరాబాద్, సెప్టెంబర్ 11 (నమస్తే తెలంగాణ): మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌లపై ఎన్డీఎస్‌ఏ నుంచి తుది నివేదికను త్వరితగతిన తెప్పించేందుకు కృషిచేయాలని ఇరిగేషన్ శాఖ అధికారులకు మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి సూచించారు. ఇరిగేషన్‌శాఖ ఉన్నతాధికారులతో ఆయన బుధవారం ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. పలు పెండింగ్ అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం ప్రాజెక్టులపై వానకాలంలో నిర్వహించాల్సిన పరీక్షలన్నీ పూర్తిచేసి ఆ నివేదికను ఎన్డీఎస్‌ఏ నిపుణుల కమిటీకి సమర్పించాలని సూచించారు. సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి సంబంధించి ఆర్అండ్ఆర్ కమిషనర్ వినయ్‌కృష్ణారెడ్డిని ప్రభుత్వం నియమించింది

## ముదిరాజ్‌ల హామీల అమలెప్పుడు?

- బీసీ 'ఏ'లోకి మార్చాలని జేఏసీ చైర్మన్ లక్ష్మీనారాయణ ముదిరాజ్ డిమాండ్
- కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను మరిచిందని మండిపాటు



ఖైరతాబాద్, సెప్టెంబర్ 11: ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ముదిరాజ్‌లకు ఇచ్చిన హామీలను మరిచిపోయిందని తెలంగాణ ముదిరాజ్ జేఏసీ చైర్మన్ పొల్కం లక్ష్మీ నారాయణ ముదిరాజ్ అన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలవుతున్నా ఏ ఒక్క హామీని అమలు చేయలేదని మండిపడ్డారు. ముదిరాజ్‌లను బీసీ'డీ' నుంచి బీసీ 'ఏ'లోకి మార్చాలని, మంత్రి పదవి, ఎమ్మెల్సీతోపాటు నాలుగు నామినేటెడ్ కార్పొరేషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ముదిరాజ్ భవనాన్ని పూర్తి చేయాలని, బీసీ కులగణన చేసిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలన్నారు. సమావేశంలో ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్ ముదిరాజ్, మహిళా నాయకురాలు పుష్పలత, నీరజ పాల్గొన్నారు.



మత్స్యభవన్ ముందు నిరసన వ్యక్తం చేస్తున్న మత్స్యకారులు


## 50% చేపపిల్లల పంపిణీ నిర్ణయం సరికాదు

- ముదిరాజ్ మహాసంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీను

సుల్తాన్‌బజార్, సెప్టెంబర్ 11 : ప్రభుత్వం ఈ ఏడాది చేప పిల్లల పంపిణీని 50 శాతానికి తగ్గిస్తూ తీసుకున్న నిర్ణయం సరికాదని, దీంతో మత్స్యకారులు తీవ్రంగా నష్టపోతారని ముదిరాజ్ మహాసంఘం రాష్ట్ర అధ్యక్షుడు గుండ్లపల్లి శ్రీను ముదిరాజ్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని నిరసిస్తూ అన్ని జిల్లాల మత్స్యకారుల ఆధ్వర్యంలో బుధవారం శాంతినగర్‌లోని మత్స్యభవన్ ముందు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రతి సంవత్సరం వంద శాతం చెరువుల్లో చేపపిల్లలను వదిలినట్టు గుర్తుచేశారు.బాలు, వెంకటేశ్, జగన్, రంజిత్, రాజేశ్, రవి, ఎల్లయ్య పాల్గొన్నారు.

## 25న హైదరాబాద్‌లో కులగణన మార్చ్

- కులగణనపై హైకోర్టు తీర్పు సర్కారుకు చెంపపెట్టు
- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్



ఖైరతాబాద్, సెప్టెంబర్ 11 : ఈ నెల 25న హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రం నుంచి ఇందిరా పార్కు వరకు లక్షలాది మంది బీసీలతో కులగణన మార్చ్ చేపడుతున్నామని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. కులగణనపై హైకోర్టు ఇచ్చిన తీర్పు కాంగ్రెస్ ప్రభుత్వానికి చెంపపెట్టు అని అన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బీసీ సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ సమగ్ర కులగణన చేపట్టి 42శాతం రిజర్వేషన్లు పెంచుతామని కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి డిక్లరేషన్ ద్వారా హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిందని చెప్పారు. పార్లమెంట్ ఎన్నికల తర్వాత కాంగ్రెస్ స్వరం మార్చిందని, హైకోర్టులో పిటిషన్ దాఖలు చేస్తే, త్వరితగతిన కులగణన చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించిందని చెప్పారు. హైకోర్టుకు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారపు గణేశ్ చారి, బాలరాజు గౌడ్, శ్యాంసుందర్, శ్రీనివాస్, మణిమంజరి తదితరులు పాల్గొన్నారు.